

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 100 • పేజీలు:12+16 • వెల: రూ.5 | శనివారం • 10-3-2018 | www.manamnews.com | /manamnews



చావు కోసం..

42 ఏళ్ల ఎదురుచూపు!

- అరుణా షాన్‌బాగ్‌పై అత్యాచారం
- మర్నాడే కోమాలోకి వెళ్లిన నర్సు
- 42 ఏళ్లు మంచానికే పరిమితం
- అప్పుడే పరోక్ష కారుణ్య మరణం ప్రస్తావన

7లో..



విపక్షాలు ఏకమవ్వాలి

- విభేదాలు పక్కనపెట్టాలి
- జాతిహితం కోసం 'చేయి' కలపాలి
- త్వరలో కాంగ్రెస్‌కు కొత్తరూపు
- ప్రజాస్వామ్యంలో అసమ్మతికి స్థానం
- నియంతృత్వ పోకడలకు చోటు లేదు
- రాహుల్‌కు సలహాలివ్వను..
- 'ఇండియా'టుడే సదస్సులో సోనియా

7లో..





నా పుట్టుక.. చావు టీఆర్ఎస్‌లోనే!

త్యాగాల కుటుంబం నుంచి వచ్చా.. సీఎం కేసీఆర్ మాటే నా బాట

- దీనిపై ఎన్నోమార్లు స్పష్టతనిచ్చా..
- అయినా వదంతులు ప్రచారం చేస్తారా?
- ఇకపై అలాచేస్తే జైలు ఊచల వెనక్కే
- మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం
- కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాదు
- మీడియాతో మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి):

తాను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తనని, సీఎం కేసీఆర్ బాటే తన బాటని మంత్రి హరీశ్‌రావు పునరుద్ఘాటించారు. తన పుట్టుక.. చావు రెండూ టీఆర్ఎస్ పార్టీలోనేనని ఆయన తేల్చిచెప్పారు. పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను మంత్రి ఖండించారు. ఈ విషయంలో ఎన్నోమార్లు స్పష్టత ఇచ్చానని, అయినా కూడా ఇలాంటి వార్తలు ఎలా ప్రచారం చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వార్తలను మిగతా 6లో..



గౌరవ మరణం

పరోక్ష కారుణ్య మరణానికి ఓకే

సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు



- బతుకే కాదు.. చావులోనూ గౌరవం
- జీవచ్ఛవంలా వెంటిలేటర్‌పై అక్కర్లేదు
- అవసరాన్ని బట్టి మెడికల్ బోర్డు సలహా
- భవిష్యత్తులో వెంటిలేటర్ వద్దనీ చెప్పొచ్చు
- అందుకు వీలుకల్పించే సజీవ వీలునామా
- వెంటిలేటర్ అంటే చిత్రహింస పెట్టడమే
- కామన్ కాజ్ స్వచ్ఛంద సంస్థ వాదన

న్యూఢిల్లీ, మార్చి 9:

మనిషికి గౌరవంగా బతకడానికే కాదు.. గౌరవంగా చావడానికీ హక్కుంటుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుదీర్ఘకాలంగా ఎంతోమంది ఎదురు చూస్తున్న కారుణ్యమరణాల విషయంలో సంచలన మిగతా 6లో..

పరోక్ష కారుణ్య మరణం అంటే..

అరుణా షాన్‌బాగ్ కేసు విచారణ సందర్భంగానే సుప్రీంకోర్టు 'పరోక్ష కారుణ్య మరణం' విషయాన్ని మిగతా 6లో..

ఇదీలోకం!



పోయిన సారి బీజేపీ వాళ్లు అలా చెప్తేనే మనం ఓడిపోయామా మేడమ్..!

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి ఉ.6.01 తదుపరి నవమి; నక్షత్రం: జ్యేష్ఠ తె.3.25 తదుపరి మూల; వర్జ్యం: ఉ.6.57-8.44; దుర్ముహూర్తం: ఉ.8.54-9.42, మ.12.50-1.38; రాహుకాలం: ఉ.10.58-12.27; అమృతఘడియలు: సా.5.40-7.27; శుభసమయం: మ.1.39-3.00;

సూర్యోదయం: 6.33

సూర్యాస్తమయం: 6.21

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శనివారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 13 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 37 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు

గాలిలో తేమ: 51 శాతం

దేశానికి ఎజెండా



- రూపొందించాల్సింది మనమే
- మీరే మార్గదర్శనం చేయాలి
- అన్ని ప్రాంతాలవారూ రావాలి
- దేశంలో అనుకున్న పురోగతి లేదు
- చాలా సమస్యలు అపరిష్కృతమే
- జలవివాదాలు పరిష్కారం కాలేదు
- మన పథకాలు అందరికీ ఆదర్శం
- ప్రముఖులతో భేటీలో కేసీఆర్

హైదరాబాద్, మార్చి 9: అనేక రాష్ట్రాలు, విభిన్న వర్గాలు ఉన్న భారతదేశానికి అవసరమైన అభివృద్ధి ఎజెండా రూపొందాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ఇప్పుడున్న విధానాలు, మిగతా 6లో..

పెళ్లింట విషాదం

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి

- వరుడి దుర్మరణం.. కోమాలో వధువు
- వరుడి చెల్లెలు.. బావ.. మరో అక్క మరణం
- ఘటనాస్థలిలోనే మరణించిన కారు డ్రైవర్
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అక్క భర్త
- ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలు





వరంగల్/కొణిజర్ల, మార్చి 9 (మనం న్యూస్):

''పారాణింకా ఆరనే లేదు.. తోరణాల కళ వాడనే లేదు..'' అన్న పాటను గుర్తుచేసేలా పెళ్లింట్లో పెను విషాదం చోటుచేసుకుంది. పెళ్లి జరిగి 24 గంటలు మిగతా 6లో..

పెట్టుబడి పథకం 'రైతులక్ష్మి'

పేరును ఆమోదించిన సీఎం కేసీఆర్!

రెండుమూడు రోజుల్లో ఆదేశాలు

- పథకం అమలుకు కీలక నిర్ణయాలు
- రూ.50 వేలు దాటితే రెండో చెక్కు
- మూడు దఫాలుగా చెక్కుల పంపిణీ
- ఏప్రిల్ 20న ప్రారంభం..మే 15 నాటికి పూర్తి
- వ్యవసాయ శాఖ కమిషనర్ పేరుపై ఖాతాలు

6లో..





నిప్పుల కొలిమి!

దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు

- టాప్-10లో తెలుగు రాష్ట్రాలు
- వచ్చే వారం నుంచి మరింత
- వడగాలులతో ఉక్కిరిబిక్కిరి
- ఉష్ణోగ్రత 52-54 డిగ్రీలకు!
- అప్రమత్తం కావాలని వాతావరణ శాఖ హెచ్చరిక

అమరావతి, మార్చి 9 (మనం ప్రతినిధి):

తెలుగు రాష్ట్రాల్లో ఉగ్రభానుడు ప్రచండంగా నిప్పులు కురిపిస్తున్నాడు. మార్చి నెల మొదట్లోనే సూర్య ప్రతాపానికి జనం హడలెత్తిపోతున్నారు. ఉదయం పది గంటలకే ఎండ తీవ్రత అధికమవుతోంది. వేడి గాడ్పులు, ఉక్కపోతతో మిట్టమధ్యాహ్నం రోడ్డుపైకి రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. సాధారణానికి మించి నాలుగు.. ఐదు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నాడు దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు తెలుగు రాష్ట్రాల్లోనే నమోదైనట్లు ప్రైవేటు వాతావరణ అంచనాల సంస్థ స్కైమేట్ పేర్కొంది. ఈ మిగతా 6లో..





హైదరాబాద్ బేగంపేటలో ప్రారంభమైన ఏవియేషన్ షోకు శుక్రవారం ప్రజలు పోటెత్తారు. అధునాతన విమానాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జయంత్ సిన్హా తదితరులు పాల్గొన్నారు

వెబ్‌సైట్‌లో పదోతరగతి హాల్‌టికెట్స్

హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి): మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్స్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టికెట్స్ పంపించామని, ఒకవేళ హాల్‌టికెట్స్ అందని విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ. తెలంగాణ. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రైతు విమోచన కమిషన్ ఏమైంది?

- మూడు నెలల్లో ఏర్పాటు చేయాలిగా?
- కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోవద్దు
- ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న.. నోటీసులు జారీ



హైదరాబాద్, మార్చి 9 (మనం లీగల్ ప్రతినిధి): రైతు రుణ విమోచన కమిషన్‌ను మూడు మాసాల్లో ఏర్పాటు చేయాలనే తమ ఉత్తర్వుల్ని ఎందుకు అమలు చేయలేదో వివరించాలని, మీపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో కూడా తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ నోటీసులు జారీ చేసింది. వచ్చే విచారణ సమయంలో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన చట్టం 2016లోని సెక్షన్ 3(1) ప్రకారం రైతులు, వ్యవసాయ కూలీలు తదితరుల సంక్షేమం కోసం కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న నిబంధనల్ని అమలు చేయకపోవడాన్ని తప్పుపడుతూ బీజేపీ అగ్రనేత, మాజీ ఎమ్మెల్యే ఎన్. ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ శుక్రవారం విచారించింది. మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని గత ఏడాది ఆగస్టులో హైకోర్టు ఆదేశాలు అమలు కాలేదంటూ ఆయన కోర్టు ధిక్కార రిట్ వేశారు. కమిషన్‌కు హైకోర్టు రిటైర్డు జడ్జిని చైర్మన్‌గా నియమించేందుకు హైకోర్టుతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపాల్సివుందని ప్రభుత్వ ప్రత్యేక లాయర్ చెప్పారు.గతసారి కూడా ఇదే జవాబు చెప్పారని, తీరా తమతో ఎవరూ సంప్రదింపులే చేయలేదని బెంచ్ వాఖ్యానించింది. సీఎస్ స్వయంగా కోర్టుకు రావాలని ఆదేశిస్తూ విచారణ నెల రోజులకు వాయిదా వేసింది.

కేసులు వేస్తే దాడులకు దిగుతారా?

- వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు: హైకోర్టు

హైదరాబాద్, మార్చి 9 (మనం లీగల్ ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం కోర్టుల్లో కేసులు వేసిన వారిపై దాడులకు దిగి చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని వదిలిపెట్టేది లేదని హైకోర్టు హెచ్చరించింది. హైదరాబాద్ సిద్ది అంబర్ బజార్, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారంటూ ఫొటోలతో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసినందుకే తనపై దుండుగులు దాడి చేశారని లక్ష్మీనివాస్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టుకు విన్నవించారు. అగర్వాల్‌కు ఏమేరకు ముప్పు ఉందో సీనియర్ పోలీస్ అధికారితో దర్యాప్తు చేయించి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శుక్రవారం ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ హోంశాఖను ఆదేశించింది. సీసీ ఫుటేజీని సీల్డ్ కవర్‌లో అందజేయాలని బెంచ్ ఆదేశించింది. దాడి తర్వాత తనకు ప్రాణ హాని ఉందని అగర్వాల్ ఆందోళన వ్యక్తం చేయడంతో బెంచ్ ఆయనకు భరోసా ఇస్తూ ప్రకటన చేసింది. మీకేమీ కాదని, తాము స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నామని బెంచ్ స్పష్టం చేసింది. ఒక కానిస్టేబుల్‌ను రక్షణగా ఏర్పాటు చేయాలని డీజీపీని బెంచ్ ఆదేశించింది. దాడి చేసిన వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి చెప్పారు. సీసీఎస్ ద్వారా దర్యాప్తు చేయించేందుకు ప్రభుత్వానికి అభ్యంతరం లేదని చెప్పారు. అగర్వాల్‌కు ఏమేరకు ప్రాణహాని ఉందో సీనియర్‌పోలీస్ అధికారి స్వయంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన బెంచ్ విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది

అధికారికి రెండు నెలల జైలు

హైదరాబాద్, మార్చి 9 (మనం లీగల్ ప్రతినిధి): కోర్టు ఆదేశాల్ని పెడచెవినపెట్టిన తెలంగాణు చెందిన అధికారికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఆ అధికారి అప్పీల్ చేసుకునేందుకు వీలుగా తీర్పును మూడు వారాలపాటు సస్పెండ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ జిల్లా మూసీ మత్స్య కార మార్కెటింగ్ సంఘానికి ఆరు వారాల్లో ఎన్నికలు నిర్వహించాలని 2017, సెప్టెంబరు 7న హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాల్ని అమలు చేయకుండా కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారంటూ నర్సయ్య మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్/తెలంగాణ సహకార సంఘ ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రావు శుక్రవారం స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఆయన ఇచ్చిన వివరణతో సంత ప్తి చెందని బెంచ్ రెండు నెలల జైలు శిక్ష విధించింది. అప్పీల్ చేసుకునేందుకు వీలుగా మూడు వారాలపాటు శిక్షను సస్పెండ్ చేసింది.

‘జనజాతర’ కేసు విచారణ వాయిదా

హైదరాబాద్, మార్చి 9 (మనం లీగల్ ప్రతినిధి): ఈ నెల 10వ తేదీ ఎన్టీఆర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ నిర్వహించే ‘జన జాతర’ పేరిట సభకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదనే కేసు విచారణ 13వ తేదీకి వాయిదా పడింది. ఎన్టీఆర్ స్టేడియంలో సభలకు అనుమతి ఇవ్వడం లేదని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. మరో వేదికపై ఇంకో తేదీని ఎంచుకుంటే అనుమతి ఇచ్చేందుకు అభ్యంతరం లేదన్నారు. నిజాం కాలేజీ మైదానంలో జరుపుకుంటామని, అందుకు అనుమతి ఇవ్వాలని పిటిషనర్ లాయర్ కోరారు. దాంతో విచారణను 13కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఏవీ శేషసాయి ఉత్తర్వులు జారీ చేశారు.

అన్ని స్కూళ్లకు ‘భగీరథ’ నీళ్లు

వచ్చే విద్యాసంవత్సరానికి ..కొత్తగా 8792 మంది టీచర్లు

- స్కూల్ గ్రాంట్స్ 12 నెలలకు పెంపు
- విద్యార్థినులకు హెల్త్ కిట్స్
- విద్యార్థులకు వారానికి ఐదు గుడ్లు
- విద్యా సదస్సులో మంత్రి కడియం



హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి):రాష్ట్రంలోని అన్ని స్కూల్స్‌కు మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీటిని అందించనున్నట్టు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధానోపాధాయ్యుల సంఘం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన విద్యా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో కొత్తగా 8792 మంది టీచర్లు పనిచేయనున్నారని, ప్రభుత్వ పాఠశా లలను అన్ని విధాలుగా పటిష్టం చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తామని, వీటికి మార్గదర్శకాలు రూపొందిం చామని చెప్పారు. కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆదివారం కూడా పనిచేస్తున్నారని, సెలవులు కూడా తీసుకోవడంలేదని తెలిపారు. ప్రభుత్వ విద్యను పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యా యులపై ఉందని, దీన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు రోల్‌మోడల్‌గా ఉండాలని సూచించారు. హెల్త్ అండ్ హైజీన్ కిట్స్‌ను ఏడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థినుల వరకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో 23 లక్షల మందికి మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, గుడ్ల కోసమే రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. వారానికి మూడు గుడ్ల నుంచి ఐదు గుడ్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్కూల్ గ్రాంట్స్‌ను పది నెలల నుంచి 12 నెలలకు పెంచుతామన్నారు. ప్రధానోపాధ్యాయులు ఒకరిపై ఒకరు నెపం నెట్టివేసి తప్పించుకునే పద్ధతికి స్వస్తి పలకాలని తెలిపారు. ఈ స్కూల్ నాది అనే భావనతో పనిచేయాలని సూచించారు. 8792 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ త్వరలోనే ప్రకటిస్తుందని, జూన్ నాటికి కొత్త ఉపాధ్యాయులు పాఠశాలల్లో పనిచేసే విధంగా ప్రయత్నం చేస్తామని ప్రకటించారు. స్కూల్ విద్యుత్ బిల్స్ మాఫీ చేసేందుకు మార్గాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు పూల రవీందర్, కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పుడు ప్రోత్సాహం.. ఇప్పుడు ఛీత్కారం

- ఉద్యమకారుడు నాగరాజుకు అవమానం
- కడియంను కలిసేందుకు అడ్డగించిన పోలీసులు
- ఒకప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసలు



హైదరాబాద్, మార్చి 9 (మనం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పని చేసిన ఓ యువకుడికి చేదు అనుభవం ఎదురైంది. ఉద్యమ సమయంలో ప్రతి సమావేశంలోనూ, ప్రతి పిలుపులోనూ ముందుండేవాడు. వంటి నిండా గులాబీ రంగు వేసుకుని సభల్లో ఉత్తేజం నింపేవాడు. అతని పేరు నాగరాజు. ఆ యువకుడి పట్టుదల, ఉద్యమ స్ఫూర్తిని ఆ నాటి సభల్లో అనేక మార్లు కేటీఆర్, హరీశ్‌రావు, భుజం తట్టి ప్రోత్సహించేవారు. ఖర్చుల కోసం కొంత నగదు సాయం కూడా చేశారు. ఒక సభలో కేసీఆర్ దృష్టిని సైతం ఈ యువకుడు ఆకర్షించాడు . దీంతో కేసీఆర్ స్వయంగా నాగరాజును స్టేజీపైకి పిలిపించుకుని మెచ్చుకున్నారు. ఈ ప్రశంసతో ఆ యువకుడు రెట్టించిన ఉత్సహంతో రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నాడు. ఇలాంటి ఎందరో యువకుల కృషి మూలంగా నేడు సొంత రాష్ట్రం కల నెరవేరింది. నిరుద్యోగి అయిన నాగరాజు తనకు ఏదో ఒక ఉపాధి లభించకపోతుందా అని చాలా కాలంగా ఎదురు చూస్తున్నాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎక్కడ ఫలితం కనిపించలేదు. చివరకు విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరిని కలిసి తన గోడు వెళ్లబోసుకుందామని శుక్రవారం నాడు రవీంద్ర భారతికి వచ్చాడు. అక్కడ జరుగుతున్న విద్యా సదస్సులో పాల్గొన్న కడియం ను కలిసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ ఉద్యమ కారుడిని మంత్రిలో కలిపించే బదులు పోలీసులు అతన్ని అక్కడి నుంచి బలవంతంగా లాక్కుని వెళ్లిపోయారు. దీంతో ఈ నిరుద్యోగి ఆశలు అడిఆశాలే అయ్యాయి.

రైతులపై కేసీఆర్‌ది కపట ప్రేమ

- వారంలోగా కంది రైతులకు డబ్బులివ్వండి
- టీ జేఏసీ చైర్మన్ కోదండరామ్ డిమాండ్



కందిరైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

తాండూరు టౌన్, మార్చి 9(మనం న్యూస్): ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులపై కపట ప్రేమ వలకబోస్తున్నారని తెలంగాణ రాజకీయ ఐకాస చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. కంది రైతుల సంక్షోభంపై వరంగల్ జిల్లా తాండూరులో శుక్రవారం నిర్వహించిన చర్చావేదికలో కోదండరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు కంది పప్పుకు రాష్ట్రంలో డిమాండ్ ఉంది. తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. కందికి గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం రూ.4 వేలకే కొన్నదని గుర్తు చేశారు. ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన కందికి సంబంధించి నేటికి డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. వారం రోజుల్లోగా ప్రభుత్వం ఈ చెల్లింపులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో వికారాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. గతేడాది కంది క్వింటాల్ ధర పది వేలు పలికిందని ఈ ఏడాది నాలుగు వేలకు పడిపోయిందన్నారు. కంది కొనుగోలు కేంద్రాలను మూసివేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తాండూరులో కంది బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. లక్ష ఉద్యోగాలు కల్పిస్తానన్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 17వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని కోదండరామ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు జేఏసి చైర్మన్ సోమశేఖర్, విజయ్‌కుమార్, రైతులు, యంగ్‌లీడర్స్ సభ్యులు పాల్గొన్నారు.

‘నవదేవీ’ ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



హైదరాబాద్, మార్చి 9 (మనం ప్రతినిధి): సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనదని చెప్పవచ్చు. నిత్యజీవితంలో మహిళలు ఎన్నో పాత్రలను పోషిస్తున్నారు. భిన్న వాతావరణంలో ఓర్పుగా, విశ్వాసంగా, వినయంగా పనులు చేస్తూనే.. తన మనుసులోని భావాలను అందుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ వృత్తుల్లో కొనసాగుతున్నప్పటికీ.. కళాత్మక పెయింటింగ్స్ వేస్తున్నారు. ఇలా కొందరు మహిళలు వేసిన చిత్తరువులతో ‘నవదేవి’ గ్రూప్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు.మార్చి 21 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతోంది. ‘నవదేవితో పేరుతో జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇంటరీయర్ డిజైనింగ్, పోయెట్రీ, జర్నలిజం, సింగింగ్, యాడ్ ఏజెన్సీ, హెల్త్, ఇలా తొమ్మిది రంగాలకు చెందిన మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు పసుపులేటి గీత మాట్లాడుతూ.. పల్లెటూరి వాతావరణంలో పెరిగడం వల్ల, సమాజాన్ని ప్రజల సమస్యల కోణం నుంచే చూడటం అలవాటయ్యిందని, ఆ మేరకు చిత్తరువులు వేశానని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను, బాధలను ప్రపంచానికి చాటేందుకు కవిత్వం, రచనలు ఉపయోగపడతాయని ఆమె అన్నారు. చిన్నప్పటి నుంచి తనలో ఆర్టిస్ట్ కావాలనే కుతూహలం ఉండేదని ఆమె అన్నారు. జర్నలిజం వైపు వచ్చినా, ఆర్టిస్ట్‌గా నిరూపించుకోవాలనే తపనతో ఆ దిశగా అడుగులు వేస్తున్నానని ఆమె తెలిపారు. నవదేవి ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన గ్యాలరీలో జంతుప్రపంచ ఇతివృత్తంతో ఆర్ట్ వేశానన్నారు. మనుషుల్లో కొంతలో కొంతైన స్వార్థపూరిత లక్షణాలు ఉంటాయని, కానీ జంతువుల్లో స్వచ్ఛమైన భావాలుంటాయని అందుకే ఆ ఇతివృత్తాన్నే ఎంచుకుని, మరింత అందంగా చూపించే ప్రయత్నం చేశానన్నారు. ప్రతి మహిళలో ఓ ఆర్టిస్ట్ తప్పకుండా ఉంటారని ఇంటరీయర్ డిజైనర్ నలినీ శ్రీ అన్నారు. కట్టుబొట్టులో, వేసే ముగ్గులో, చేసే పనిలో ఇలా తనలోని చిత్రకళా బహిర్గతమవుతుందని ఆమె అన్నారు. మహిళలు తమ అభిలాషకు అనుగుణంగా అడుగులు వేస్తే, ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రశాంతత కోసం మెలోడీ పాటలు, ఉత్సాహాన్ని నింపేందుకు మాస్ సాంగ్స్, చిందేసేందుకు డీజే పాటలు వింటున్నానని గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ లిప్సిక అన్నారు. పాటలు పాడటం చిన్నప్పటి నుంచే ప్రారంభించానని, అనుకోకుండా డబ్బింగ్ వైపు అడుగులు పడ్డాయని ఆమె తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో పీహెచ్‌డీ చేస్తున్నానన్నారు. పలు రంగాలకు చెందిన మహిళలకు ఓ వేదిక ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ‘నవదేవి’కి అంకురార్పణ చేశానని, రాబోయే రోజుల్లో ఇదే పేరుతో ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నామని ఎగ్జిబిషన్ నిర్వాహకురాలు ఉదయ తెలిపారు.



నా హత్యకు ప్రభుత్వ కుట్ర

- ఓ మంత్రి, ఎమ్మెల్యేకు బాధ్యత అప్పగింత
- ప్రజాసమస్యలకోసం ప్రాణాలకైనా తెగిస్తా..
- ప్రశ్నిస్తే చంపడం ప్రజాస్వామ్యమా?: మంద కృష్ణ

హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి): తనను చంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నిందంటూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సంచలన ఆరోపణ చేశారు. శుక్రవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీస్ ప్రధాన కార్యాలయంలో మందకృష్ణ విలేకరులతో మాట్లాడారు. తనను చంపే ప్రయత్నంలో భాగంగానే జూలైలో సూర్యాపేటలో కారులో వెంబడించారన్నారు. దీనిపై రెండు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా.. ఆ కారు ఎవరిదనే విషయాన్ని ఇంతవరకూ గుర్తించలేదన్నారు. ప్రభుత్వం తనను చంపే బాధ్యతను ఒక మంత్రి, మరో ఎమ్మెల్యేకు అప్పగించిందని ఆరోపించారు. హత్యాయత్నం జరిగిన విషయాన్ని గుర్తించి అప్రమత్తం కావడం చూసి సదరు మంత్రి, ప్రభుత్వం వెనుకంజవేశాయని పేర్కొన్నారు. త్వరలోనే వారి పూర్తి వివరాలు బయటపెడతానని, తనకు ఎక్కడి నుంచి ప్రాణహాని జరిగినా వారిదే బాధ్యతని చెప్పారు. ప్రశ్నిస్తే చంపడం ప్రజాస్వామ్యం ఏలా అవుతుందని మందకృష్ణ నిలదీశారు. అయితే, ప్రజాసమస్యల పరిష్కారానికి అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధమేనని చెబుతూ ప్రభుత్వం ఇంత దారుణంగా ప్రవర్తించడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత వర్గానికి చెందడంవల్లే తమపై ప్రభుత్వం ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందన్నారు. మార్చి 13న తలపెట్టిన 24 గంటల బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

మిలియన్ మార్చ్‌కు అనుమతివ్వండి

- సీఎం కేసీఆర్‌కు చాడ వెంకటరెడ్డి లేఖ

హైదరాబాద్, మార్చి 9: హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ కార్యక్రమ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుక్రవారం ఓ లేఖ రాశారు. 2011 మార్చి 10న నిర్వహించిన మిలియన్ మార్చ్ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికగా నిలిచిందని, జాతీయ స్థాయిలో తెలంగాణ ఆకాంక్షలకు నిలువుటద్ధమని చాడ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణవాదులు, టీజేఏసీతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు ఆ రోజు ట్యాంక్‌బండ్‌పైకి వచ్చి తెలంగాణ వాదాన్ని వినిపించారన్నారు. అనాటి త్యాగాలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తే బాగుండేదని చాడ అభిప్రాయపడ్డారు. మార్చి 10న ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్‌కు అనుమతి కోరుతూ దరఖాస్తు చేయగా పోలీసులు తిరస్కరించారన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి స్ఫూర్తివంతమైన ఈ కార్యక్రమం నిర్వహణకు అనుమతి ఇప్పించాలని చాడ వెంకటరెడ్డి సీఎం కేసీఆర్ కోరారు.



మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మిషన్ భగీరథ పనుల పరిశీలనకు వచ్చిన ఇథియోపియా మంత్రులు, అధికారులకు స్థానికుల సంప్రదాయ స్వాగతం



సింగరేణి బొగ్గు గని కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన వెంకట్రావు, రాజిరెడ్డి శుక్రవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత కూడా పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ అధ్యక్షుడిగా వెంకట్రావ్

- ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి
- సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు
- అన్ని విభాగాలకు కమిటీల నియామకం
- కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ

హైదరాబాద్, మార్చి 9 (మనం ప్రతినిధి): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర కమిటీని యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కె.కవిత టీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రకటించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా వి. వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శిగా ఎం. రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి. సంపత్‌కుమార్, అప్పాని శ్రీనివాస్, కోశాధికారిగా ఎల్. వెంకటేశ్‌తో కమిటీని ఏర్పాటు ప్రకటించారు. రాష్ట్ర కమిటీతో పాటు ఏరియా, రీజనల్, పిట్ కమిటీలను నియమించారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

ఏరియాల ఉపాధ్యక్షులు వీరే..

రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో విస్తరించిన సింగరేణిలోని 11 ఏరియాలకు ఉపాధ్యక్షులను ఎంపీ కవిత ప్రకటించారు. శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులుగా కె. సురేందర్‌రెడ్డి, బెల్లంపల్లి ఏరియాకు ఎం. శ్రీనివాస్‌రావ్, మందమర్రి ఏరియాకు ఎం. సంపత్, ఆర్జీ-1 ఏరియాకు జి. దామోదర్‌రావ్, ఆర్జీ-2 ఏరియాకు ఎ. శ్రీనివాస్, ఆర్జీ-3 ఏరియాకు ఎ. సాంబయ్య, భూపాలపల్లి ఏరియాకు కె. తిరుపతి, మణుగూరు ఏరియాకు ప్రభాకర్‌రావ్, కొత్తగూడెం ఏరియాకు ఎండీ. రజాక్, కార్పొరేట్‌కు సోమిరెడ్డి, ఇల్లెందు ఏరియా ఉపాధ్యక్షులుగా గడ్డం వెంకటేశ్వర్లును నియమించారు.

రీజనల్ కార్యదర్శులుగా..

బెల్లంపల్లి రీజనల్ కార్యదర్శిగా మందా మల్లారెడ్డి, రామగుండం-సాంసన్, భూపాలపల్లి-ఆగయ్య, ఖమ్మం(కొత్తగూడెం)-కె. వీరభద్రం ఎన్నికయ్యారు.

11మెన్‌కమిటీ సభ్యులు..

సింగరేణి యాజమాన్యంతో కార్మికుల సమస్యలను చర్చించేందుకు గుర్తింపు సంఘం నుంచి ఎనిమిది మంది సభ్యుల బృందం పాల్గొంటుంది. ఆర్జీ-1 నుంచి దేవ వెంకటేశం, పెద్దపల్లి సత్యనారాయణ, ఆర్జీ-2 నుంచి కె. సత్యనారాయణరెడ్డి, మణుగూరు నుంచి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం(కొత్తగూడెం) నుంచి కాపు కృష్ణ, శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఏనుగు రవీందర్, భూపాలపల్లి నుంచి మంగీలాల్‌తో పాటు ఆల్టర్నేటీవ్‌గా మరో ముగ్గురిని ప్రకటించారు. వీటితో పాటు గనులు, డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన అన్ని విభాగాలకు అధిష్టానమే నియామకాలు చేపట్టడం గమనార్హం.

టీబీజీకేఎస్ కమిటీపై అసంతృప్తి

- ఏకపక్షంగా జరిగిందని నేతల ఆరోపణలు

హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి): ఎప్పుడెప్పుడా అని ఊరిస్తున్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కమిటీలను టీఆర్ఎస్ శుక్రవారం ప్రకటించింది. సింగరేణి కాలరీస్ కంపెనీలో అక్టోబర్‌లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ విజయం సాధించింది. గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ గెలుపొందినా కమిటీలు లేకపోవటంతో కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో మాట్లాడేవారే కరువయ్యారు. మరోవైపు కమిటీల్లో చోటు కోసం కొంతమంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ అధిష్టానం ప్రకటించిన కమిటీల పట్ల కార్మికులతో పాటు పలువురు సీనీయర్ నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ, ఎక్కడా లేనివిధంగా కమిటీలు వేయటం పట్ల బొగ్గు గనుల్లో సర్వత్రా చర్చా జరుగుతోంది. గతంలో కేంద్ర కమిటీతో పాటు యాజమాన్యంతో చర్చించే 11 మెన్ కమిటీ, ఏరియా ఉపాధ్యక్షులను మాత్రమే నియమించేవారు. తాజా కమిటీల్లో కేంద్ర కమిటీతో పాటు రీజనల్, ఏరియా, పిట్, సీఈఆర్‌క్లబ్ కమిటీలను ప్రకటించటం గమనార్హం. ఇలాంటి కమిటీలను ఎప్పుడూ చూడలేదని పలువురు టీబీజీకేఎస్ కార్యకర్తలు చెబుతున్నారు. కేంద్ర కమిటీ కూర్పుపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నీతి, నిజాయితీకి పట్టం కడ్తామని సీఎం కేసీఆర్‌తో పాటు యూనియన్ గౌరవాధ్యక్షురాలు ఎంపీ కవిత పలు సందర్భాల్లో పేర్కొన్నారు. అయితే, కొత్తగా ప్రకటించిన యూనియన్ కమిటీలో అధ్యక్షుడిగా వెంకట్రావ్‌ను, ప్రధాన కార్యదర్శిగా ఎం.రాజిరెడ్డిని ప్రకటించారు. వెంకట్రావు నిన్నమొన్నటి వరకు ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారని పలువురు కార్యకర్తలు చెప్పారు. యూనియన్ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణల నేపథ్యంలో రాజిరెడ్డి జైలుకెళ్లిన దాఖలాలున్నాయి. తర్వాత కేసును కొట్టి వేసినట్టుగా సమాచారం. ఐఎన్‌టీయూసీలో ఉన్న సమయంలో వెంకట్రావు యూనియన్ నిధులను స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. కాగా, సింగరేణిలో 2012లో జరిగిన గుర్తింపుసంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను గెలిపించటంలో సంఘం మాజీ అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య కృషి మరువలేనిది. తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణిలో 35 రోజుల సమ్మె విషయంలోనూ ఆయన కీలక భూమిక పోషించారు. యూనియన్‌లో అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన కనకరాజును పక్కన పెట్టటం గమనార్హం. కీలక బాధ్యతల్లో ఎస్సీ, ఎస్టీలను విస్మరించారనే విమర్శలు ఉన్నాయి. డివిజన్/ఏరియా కమిటీ ఉపాధ్యక్షులను మాత్రమే గతంలో అధిష్టానం నియమించేది. వారే ఏరియా, మైన్, పిట్ కమిటీలను వేసుకునే వారు. కాగా అధిష్టానమే ఏరియా నుంచి పిట్ స్థాయి కమిటీలను ప్రకటించటం సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. రీజనల్ కార్యదర్శి మాత్రమే గతంలో ఉండేవారని ప్రస్తుతం ఒక్కో ఏరియా నుంచి ఇద్దరిని రీజనల్ కమిటీలోకి తీసుకోవటం జరిగింది. పిట్, ఎస్అండ్‌పీసీ, స్పోర్ట్స్, సివిల్, స్టోర్స్, రెస్క్యూ, హస్పిటల్, వర్క్‌షాప్ వంటి విభాగాలకు అధిష్టానమే పేర్లు ప్రకటించటం గమనార్హం. యూనియన్ అభివృద్ధి కోసం నిత్యం పాటుపడిన వారికి అన్యాయం జరిగిందనే విషయాన్ని పలువురు కార్యకర్తలు పేర్కొంటున్నారు. పిట్, డిపార్ట్‌మెంట్ స్థాయి కమిటీలు ఆయా ఏరియా ఉపాధ్యక్షులు వెసుకుంటేనే బాగుంటుందని, యూనియన్ కోసం అహర్నిశలు కష్టపడ్తున్న వారిని పక్కనపెట్టారని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి పోచారంతో రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా

అన్నదాతను ఆదుకోవడంలో టీఆర్ఎస్‌దే తొలిస్థానం

- రైతన్నల సమస్యలను రూపుమాపుతాం: గుత్తా

హైదరాబాద్, మార్చి 9 (మనం ప్రతినిధి): దేశానికి అన్నం పెట్టె అన్నదాతను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని, ఈ విషయంలో దేశంలోనే టీఆర్ఎస్ ముందంజలో ఉందని రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ నెల 12న సమన్వయ సమితి చైర్మన్‌గా వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యా రు. బంగారు తెలంగాణ లక్ష్య సాధనలో తనవంతు పాత్రను సమర్ధ వంతంగా నిర్వహిస్తానని పేరొన్నారు. అన్నదాతలను రుణ విముక్తలను చేసి వారిని సమస్యల్లోంచి బయటపడేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

దళిత వ్యతిరేక ప్రభుత్వం

ముఖ్యమంత్రి కేసీఆర్ మోసకారి.. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్.. న్యాయవ్యవస్థపై నమ్మకం పోతోంది

- అసమానతలే విప్లవాలకు ఆవిర్భావం: భట్టి
- కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం
- కాంగ్రెస్ ఎస్సీ రాష్ట్ర ప్లీనరీలో నేతలు
- 'దళితుల కోసం కాంగ్రెస్'తో పర్యటనలు

హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మోసకారి.. దళిత వ్యతిరేకి అంటూ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో దళితులపై అణిచివేత కొనసాగుతోందని, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి జయలక్ష్మి గార్డెన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర ప్లీనరీలో ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ, మాల కులాలకు సంబంధించి ఒక్కరికీ రాష్ట్ర మంత్రివర్గంలో చోటులేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఎస్సీ అన్న హామీ నీటిమూటగా మారిందని మండిపడ్డారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్యను కేసీఆర్ అహంకారంతో తొలగించటం అన్యాయమన్నారు. రాష్ట్రపతి అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన మీరాకుమార్ కలిసేందుకు ప్రయత్నిస్తే కేసీఆర్ కనీసం స్పందించలేదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న ఇసుక మాఫియాకు కేసీఆర్, కేటీఆర్ అండదండలున్నాయని ఆరోపించారు. ఆ ప్రాంతంలోని ఇసుక రీచ్‌లలో ఎక్కువశాతం వారి బంధువుల ఆధీనంలోనే ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రజల డబ్బును తిని కండకావరంతో కేసీఆర్, కేటీఆర్ ఇష్టమొచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నేరెళ్ల ఘటనలో పోలీసులు ప్రైవేటు సైన్యంలా వ్యవహరించారన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టులు, ఇతరత్రా వాటి కోసం బలవంతపు భూసేకరణ చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూపంపిణీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఉత్తమ్ ఆందోళన వ్యక్తంచేశారు. చివరకు న్యాయవ్యవస్థపైనా నమ్మకం పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. నేరెళ్ల ఘటన కేసు మూడు నెలలు అయినా విచారణకు రాలేదన్నారు. దళిత వాడల్లో 'దళితుల కోసం కాంగ్రెస్' పేర పార్టీ ఆధ్వర్యంలో త్వరలో కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు మీడియా సహకరించని దుస్థితి ఏర్పడిందన్నారు. మీడియాను కేసీఆర్ నియంత్రిస్తున్నారని ఆరోపించారు.



ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కుంతియా, ఇతర నేతలు



ప్లీనరీకి హాజరైన దామోదర రాజనర్సింహ, సంపత్ కుమార్ తదితరులు

అసమానతలు, అవమానాలతోనే: భట్టి


అసమానతలు, అవమానాలతోనే విప్లవాలు పుట్టుకొస్తాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో అసమానతలతో పాటు దళితులు అవమానాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో అంబేద్కర్ పేరుందని భావించి టీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును చంపేసిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో, రైతాంగ సాయుధ పోరాటంలో నాడు దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలే కీలకంగా ఉన్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆయా వర్గాల పట్ల చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి అందని ద్రాక్షగానే మారిందని, డబుల్ బెడ్‌రూం జాడలేదని, రుణాలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను నిర్వీర్యంచేసే విధంగా సీఎం కేసీఆర్ వ్యవహరి స్తుండటం విచారకరమన్నారు. నాలుగేండ్ల కాలంలో సబ్‌ప్లాన్ ప్రకారం రూ.40 వేల కోట్ల నిధులు రావాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.4 నుంచి 5 వేల కోట్లతో ప్రభుత్వం సరిపెట్టుకుందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో దళితులు అవమానాలకు గురవుతున్నారన్నారు. దళితులు ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంభన సాధించే దిశగా కాంగ్రెస్ కృషి చేస్తుందని తెలిపారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో లక్ష మందితో దళిత సేన ఏర్పాటు చేస్తున్నట్టు ఆ విభాగం జాతీయ కన్వీనర్ కొప్పుల రాజు తెలిపారు. దళితులకు న్యాయం చేసేది కాంగ్రెస్ మాత్రమేనన్నా రు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలంతా ఐక్యంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు.


మోదీ, కేసీఆర్ మెజీషియన్లు: కుంతియా

పీఎం మోదీ, సీఎం కేసీఆర్ మెజీషియన్లంటూ ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి రామచంద్ర కుంతియా విమర్శించారు. మాయమాటలతో వారు ప్రజలను భ్రమల్లో ఉంచుతున్నారన్నారు. బంగారు తెలంగాణ కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. బస్సుయాత్రతో టీఆర్ఎస్‌కు భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టేందుకు మోదీ సూచనతోనే కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ అంటున్నారని విమర్శించారు.

రాజ్యసభ రేసులో కాంగ్రెస్

- అభ్యర్థులుగా అజారుద్దీన్, రవీంద్రనాయక్, నారాయణరెడ్డి !
- మద్దతు కోసం విప్ జారీ చేయనున్న హస్తం నేతలు





హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి): రాజ్యసభ ఎన్నికల బరిలో దిగాలని కాంగ్రెస్ నిర్ణయించింది. తెలంగాణలో ఖాళీ ఉన్న మూడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టాలని భావిస్తుంది.అసెంబ్లీలో శుక్రవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అభ్యర్థుల ఎంపిక బాధ్యతను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎల్పీ నాయకుడు జానా రెడ్డికి పార్టీ అప్పగించింది. మాజీ ఎంపీలు అజారుద్దీన్, రవీంద్ర నాయక్‌తోపాటు పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి రేసులో ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిందిగా మిగిలిన ప్రతిపక్షాలను కోరాలని సమావేశంలో నిర్ణయించారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీలో తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేయనుంది. కాంగ్రెస్ నుంచి ఆరుగురు శాసన సభ్యులు పార్టీ ఫిరాయించి టీఆర్ఎస్‌లో చేరారు. వీరు సాంకేతికంగా కాంగ్రెస్ సభ్యులుగానే పరిగణించబడతారు. ఈ సభ్యులు కూడా కాంగ్రెస్ విప్‌కు కట్టుబడి ఉండాల్సిందే. ఎన్నికల్లో విప్‌ను ధిక్కరిస్తే , వీరిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరాలని కాంగ్రెస్ నిర్ణయించింది. వీరిపై ఇప్పటికే స్పీకర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో కాంగ్రెస్ విప్‌గా ఉన్న సంపత్ ఫిరాయించిన సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టును కూడా ఆశ్రయించారు. వీరిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. తెలుగు దేశం సభ్యులు కూడా ఇదివరకే ఫిరాయించిన సభ్యులపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసి ఉన్నారు. అయితే టీడీఎల్పీ టీఆర్ఎస్‌లో విలీనం అయినట్లు స్పీకర్ కార్యాలయం ఓ ప్రకటన జారీ చేసింది. దీన్ని ఆ పార్టీ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ప్రస్తుతం ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి ఓటు వేయకుంటే వారిపై వెంటనే కాంగ్రెస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తుంది. దీనిపై చర్య తీసుకోక తప్పదని కాంగ్రెస్ భావిస్తోంది. రాజ్యసభ ఎన్నికలను టీఆర్ఎస్ పై రాజకీయంగా దెబ్బతీసేందుకు ఉపయోగించుకోవాలన్న ఆలోచనతోనే తగిన సంఖ్యా బలం లేనప్పటికీ పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అయితే శాసనసభలో సంఖ్యాబలం ప్రకారం ఈ మూడు స్థానాలను అధికార టీఆర్ఎస్‌కు సులువుగా దక్కించుకుంటుంది.

అసెంబ్లీలో తాడోపేడో తేల్చుకుంటాం

- బడ్జెట్ సమావేశాల్లో దూకుడుగా ఉండాలని కాంగ్రెస్ నిర్ణయం
- 25 అంశాలపై శాసనసభ పక్ష సమావేశంలో సుదీర్ఘ చర్చ
- రైతు సమస్యలు, పార్టీ ఫిరాయింపులపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం: సంపత్



హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి): తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో తాడోపేడో తేల్చుకుంటామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ నెల 12 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో దూకుడుగా వ్యవహరించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లోశుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ శాసన సభా పక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సీఎల్పీలో చర్చించినట్లు కాంగ్రెస్ పార్టీ విప్ సంపత్ కుమార్ విలేకరులకు చెప్పారు. మొత్తం 25 అంశాలపై మూడున్నర గంటలకుపైగా చర్చించామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా శాసన సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ప్రధానంగా రైతు సమస్యలపై చర్చించామని సంపత్ వివరించారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ టీఆర్ఎస్ అనుబంధ సంస్థగా మారిపోయిందని, పోలీస్ రాజ్యం నడుస్తోందని సీఎల్పీ విమర్శించింది. అధికార పార్టీ హత్యా రాజకీయాలపై కూడా చర్చించామని తెలిపారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేశారని, వీటిపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అని చెప్పారు. ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ చేస్తున్న మోసాన్ని ఎండగడతామన్నారు. నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తామన్నారు. కాగా ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని సీఎల్పీ నిర్ణయించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా టీఆర్ఎస్ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని ఆరోపించింది. ఈ అంశాన్ని దేశవ్యాప్తంగా ఫోకస్ చేసేందుకే రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిని పెట్టాలని నిర్ణయించినట్లు సంపత్ ప్రకటించారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ మూడో కూటమి అంటూ నాటకమాడుతున్నారని సీఎల్పీ అభిప్రాయపడింది. ప్రజా సమస్యల విషయంలోనూ, పార్టీ ఫిరాయింపుల విషయంలోనూ సభలో అన్ని పక్షాలను కలుపుకుని ప్రభుత్వాన్ని నిలదీయాలని సీఎల్పీ నిర్ణయించింది.

కేసీఆర్‌ది పూటకో మాట

- ప్రజల దృష్టి మరల్చేందుకే ఢిల్లీలో 'కోటా ధర్నా'
- కోటా పెంపు అధికారం రాష్ట్రాలకు హాస్యాస్పదం
- మత రిజర్వేషన్లను కోర్టులు కొట్టేశాయి: లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 9 (మనం ప్రతినిధి): టీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించేందుకు కేసీఆర్ రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు నడిపి పబ్బం గడుపుకోవడమే కేసీఆర్ లక్ష్యం, లక్షణమని విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ముస్లిం రిజర్వేషన్లపై ఢిల్లీలో ధర్నా చేస్తామని బెదరిస్తున్నారని, రాష్ట్రంలో ధర్నాచౌక్ ఎత్తేసిన ఆయన, ఢిల్లీలో మాత్రం ధర్నా చేయడానికి ఎలా పూనుకుంటాడని లక్ష్మణ్ ప్రశ్నించారు. కేసీఆర్ ఒక నీతి, రాష్ట్ర ప్రజలకు ఓ నీతా? అని ఆయన ప్రశ్నించారు? అమలుకు నోచుకుని రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి, మజ్లిస్ మెప్పు పొందడానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ల పెంపు అధికారం రాష్ట్రాలకు బదిలీ చేయాలనడం హాస్యాస్పదమన్నారు.

కేసీఆర్ ప్రతిపాదిస్తున్న రిజర్వేషన్లు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని, ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కోర్టులు వ్యతిరేకించాయని లక్ష్మణ్ చెప్పారు. ఇలాంటి తరుణంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ పూటకో మాట మాట్లాడుతున్నారని, రాజ్యాంగమన్నా, పార్లమెంటన్నా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గౌరవం లేదని వ్యాఖ్యానించారు. ముస్లిం రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి... బీసీల రిజర్వేషన్ల పెంపు గురించి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అసలు 9వ షెడ్యూల్‌తో సంబంధం లేకుండానే జీవో ద్వారా ఎస్టీల రిజర్వేషన్లు పెంచవచ్చు కదా..? అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, రావుల శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర మీడియా కన్వీనర్ వి సుధాకర శర్మ, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్, తదితరులు

మహిళలకు మోదీ పెద్దపీట: లక్ష్మణ్

భారతీయ మహిళలు..ముఖ్యంగా తెలంగాణ మహిళలకు విశిష్ట సంస్క తి,సంప్రదాయాలతో ప్రత్యేక గుర్తింపు ఉందని, మన మహిళలు ప్రపంచానికే ఆదర్శ మని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు.

చిక్కడపల్లిలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రివర్గంలో మహిళలకు కీలక బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ, ముషీ రాబాద్ తహసీల్దార్ శైలజ, కెనరా బ్యాంకు మేనేజర్ అరుణజ్యోతితో పాటు పలు రంగాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శనివారం, మార్చి 10

విభజన మూల్యం

ఉమ్మడి రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు, వివక్ష, అణచివేతలు కాదన లేకపోయినా, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు తగినంత ప్రజాప్రతినిధుల మూక బలం ఉండేదికదా అని కొందరు వగర్చుతున్నారు. వారి వగర్పాటు పట్టించుకోకపోయినా విభజన చట్టం హామీలకంటే అధికంగా మరెన్నో అవకాశాలతో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలకోసం పాటుపడతామని బీజేపీ అధినేతలు నాలుగేళ్ళ క్రితం చేసిన వాగ్దానాలు నీటిమీద రాతలుగానే మిగిలాయి. ప్రత్యేక ప్యాకేజీలతో ఉద్ధరించకపోతే పోనీ, కనీసం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని 94వ షెడ్యూలు ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామికాభ్యున్నతి కోసం పన్ను రాయితీలకు తోడుగా తప్పనిసరిగా చేపట్టవలసిన కొన్ని ఆర్థిక చర్యలనైనా కేంద్రం అమలు చేసేందుకు ప్రయత్నించాల్సి ఉంది. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నాటికీ విభజన చట్టంలోని కనీస అంశాలు, రాష్ట్రాల అవసరాలు తీర్చడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తెలుగు వారిలో ఆగ్రహం పెల్లుబికింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి వీలుగా భౌతిక, సామాజిక, మౌలిక సదుపాయాల విస్తృతి సహా మరికొన్ని అభివృద్ధి పథకాలకు కేంద్రం సహకారమందించాలని విభజన చట్టం హామీలను నెరవేరుస్తున్నామని కేంద్రం లెక్కలు చూపుతోంది. అయితే వెనకబడిన ప్రాంతాల్లో ఏర్పాటుచేసే పరిశ్రమలకు కేంద్రం అందిస్తున్న రాయితీలు, నిధులు కేవలం కంటితుడుపు చర్యలుగా మిగిలిన విషయంపై రెండు రాష్ట్రాల ప్రజల్లో అసంతృప్తి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఏడాది ఆర్థిక బడ్జెట్‌లను కేంద్రం నుంచి అందే అద్వైత సహకారంతో కూడిన ఊహాజనిత అంచనాలు, లెక్కలతో రెండు రాష్ట్రప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను ఆంధ్రప్రదేశ్ విత్తమంత్రి యనమల రామకృష్ణుడు గురువారం ప్రవేశపెట్టిన రూ.1.91 లక్షల కోట్ల భారీ బడ్జెట్ ఆద్యంతం నంబర్ గేమ్‌ను తలపింపచేసింది. కేంద్రం నుంచి విభజన హామీలు, ప్రత్యేక ప్యాకేజీలు అందక, ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతమైన రెవెన్యూ ఆదాయం విభజన తర్వాత లేకపోవడంతో ఆదాయపు వనరులు లేక, అనేక ఆర్థిక బాల్యారిష్టాలతో కునారిల్లుతున్న రాష్ట్రానికి కేంద్రం చేయూత అందించకపోవడం మరీ దారుణం. నవ నిర్మాణ దీక్ష, పునర్నిర్మాణ మహాయజ్ఞం తలపెట్టి నిధులు సక్రమంగా అందని తెలుగు రాష్ట్రాల పరిస్థితి దయనీయంగా తయారైంది.


మిషన్ భగీరథ తాగునీటి పథకం, మిషన్ కాకతీయ సాగునీటి పథకాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ ప్రభుత్వానికి నిధులు అందించకపోవడంతో తెలంగాణ ప్రభుత్వాన్ని అసహనానికి గురిచేస్తోంది. అదేవిధంగా విభజనలో పారిశ్రామిక వనరులను కోల్పోయి వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మారిన నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కేటాయించకుండా మోదీ ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాన్ని మాత్రమే చూసుకోవడం బాధ్యతా రాహిత్యం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాదాపు ముప్పై సార్లు ఢిల్లీకి వెళ్ళి కేంద్ర పాలకులతో మొరపెట్టుకున్నా పట్టించుకున్న కమలనాథుడే లేడు. నవ్యాంధ్రప్రదేశ్‌కు 5 ఏళ్ళు కాదు, పదేళ్ళ కాలం ప్రత్యేక హోదా కేటాయించాలని, కేంద్ర సంచిత నిధి నుంచి రూ. 10వేల కోట్లు నూతన రాష్ట్ర రెవెన్యూ లోటు భర్తీకోసం కేటాయించాలని ఘంటా భజాయించిన వెంకయ్యనాయుడు ప్రయత్నాలు ఏ ప్రయోజనాల్లో కరిగిపోయాయో తెలియడం లేదు. బిడ్డ కోసం తల్లిని చంపేశారని వ్యాఖ్యానిస్తూ నవ్యాంధ్రప్రదేశ్‌కు ఢిల్లీని మించిన రాజధాని నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరిస్తామని ప్రధాని మోదీ ప్రకటించినా, రాజధాని శంకుస్థాపన సమయంలో పిడికెడు మట్టి, కాసిన్ని యమునా నది నీళ్ళు తప్ప ఎలాంటి సహకారమూ అందించకపోవడం చారిత్రక అన్యాయం. చిట్టచివరి ఎన్నికల బడ్జెట్ వచ్చేంత దాకా ప్రతిసారీ బడ్జెట్ ప్రతిపాదనల్లో తెలుగు రాష్ట్రాలకు రావలసిన న్యాయమైన కేటాయింపులు ఉండకపోతాయాయని చెకోర పక్షుల్లా ఎదురుచూస్తూ, కేంద్ర పాలకుల్ని మచ్చిక చేసుకునే చర్యలతో రాష్ట్ర పాలకులు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం శూన్యం. పైగా అనుకున్నట్లుగానే వేల కోట్లు నిధులను తెలుగు రాష్ట్రాలకు అందిస్తున్నామని కేంద్రం లెక్కల ప్రచారం చేసింది. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కేటాయించకూడదని, ఆయా రాష్ట్ర అభివృద్ధి అవసరాలకు తగిన నిధులను కేటాయించే విధానం అమలులోకి వచ్చిందని ఆర్థిక మంత్రి జైట్లీ చెబుతుంటే అలాంటి నిర్ణయమేమీ తీసుకోలేదని ఆర్థిక సంఘం సభ్యులు అభిజిత్ సేన్ గతంలోనే స్పష్టం చేశారు. విభజన హామీలను నెరవేర్చకుండా ఇబ్బందిపెట్టడమే కాకుండా, పెద్దనోట్ల రద్దుతో ఏర్పడిన ద్రవ్య చలామణి గందరగోళం, జీఎస్టీ పేరుతో రాష్ట్రాల ఆదాయాన్ని సైతం కేంద్రం ఖాతాలోకి మళ్లించే చట్టాన్ని కేంద్రం రూపొందించడంతో గోరుచుట్టుపై రోకటి పోటులా తెలుగు రాష్ట్రాలు విలవిల్లాడిపోయాయి. ప్రత్యేక దృష్టి, ప్రత్యేక తోడ్పాటు పేరుతో నవ్యాంధ్రప్రదేశ్‌కు కేంద్రం పూర్తిగా అండదండలు అందిస్తుందని చెప్పిన మాటలన్నీ నీటి మూటలుగా మిగిలాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనకబడిన జిల్లాల అభివృద్ధి, పోలవరం, రాజధాని నిర్మాణాలకు ఆర్థిక సహాయం విషయంలో కేంద్రం అరకొర నిధులిచ్చి అంత చేశాం, ఇంత చేశాం అని ప్రకటనలు చేస్తోంది. గత బడ్జెట్‌లో బెంగళూరు మెట్రో, ముంబయి సబర్బన్ల విస్తృతికి వేల కోట్ల రూపాయలు కేటాయించిన కేంద్రం తెలుగు రాష్ట్రాల విషయంలో పక్షపాతంతో వ్యవహరించింది. ఈ నేపథ్యంలో నవ్యాంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కేంద్రంతో పోరాట వైఖరిని చేపట్టింది. ప్రభుత్వమే బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం వివక్షకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలతో కలసి రాష్ట్ర బంద్‌ను నిర్వహించాల్సి వచ్చింది. కేంద్ర మంత్రివర్గం నుంచి టీడీపీ మంత్రులు రాజీనామాలు చేశారు. ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీతో తలపడేందుకు చంద్రబాబు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేంద్రం విధానాలను తీవ్రంగా దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగానే వ్యవసాయం దివాలాతీసి, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన విమర్శలు ఎక్కుపెట్టారు. బడ్జెట్ కేటాయింపుల్లోను, విభజన హామీలను నెరవేర్చడంలోనూ తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వాన్ని అభిశంసించారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నిటినీ ఒక్క తాటిపై తెచ్చి సమాఖ్యస్ఫూర్తిని కొనసాగించే లక్ష్యంతో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుకు కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాజకీయ సమీకరణాలు ఎలా మారినా, వివిధ రాజకీయ పక్షాలు వంతుల ప్రకారం 'విభజన మూల్యం' చెల్లించక తప్పదు.

'మిలియన్ మార్చ్ స్ఫూర్తి' అనుమతికి వినతి


ప్రకటన

2011 మార్చి 10న మిలియన్ మార్చ్ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక లాంటిది. మిలియన్ మార్చ్ జాతీయ స్థాయిలో తెలంగాణ ఆకాంక్షలకు నిలువుటద్దం. మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తే బాగుండేది. మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమం ట్యాంక్‌బండ్‌పై నేడు మధ్యాహ్నం 1 నుండి 4 గంటల వరకు సాగుతున్నదని పోలీసుల అనుమతి కొరకు దరఖాస్తు చేశాం. గతంలో విధ్వంసాలు జరిగాయనే నెపంతో పోలీసులు అనుమతిని నిరాకరించారు. కావునా తమరు చొరవ తీసుకొని మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమానికి అనుమతి ఇప్పించగలరని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరుతున్నాం.

- చాడ వెంకటరెడ్డి
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి



మంచిమాట




డబ్బు ఏ పనైనా చేయిస్తుందను కునేవాడు చివరకు డబ్బు కోసం ఏమైనా చేస్తాడు.

- ఫ్రాంక్లిన్ బెంజిమన్

సాంఘిక రోగ నివారిణి సోషియాలజీ

ఇంగ్లాండ్‌లో 18వ శతాబ్దంలో ఉద్భవించిన పారిశ్రామిక విప్లవానంతరం జరిగిన నగరీకరణ, సాంకేతిక నైపుణ్య అభివృద్ధి వలన సమాజంలో మానవ సంబంధాల మధ్య సంఘర్షణ, పోటీ సమాజాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఇలాంటి మార్పులు ఎలా వచ్చాయి? భవిష్యత్తులో ఎలాంటి మార్పులు గురించి సంభవించకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో తెలియని అగమ్య గోచర పరిస్థితిలో సమాజం పడింది. ఈ మార్పులను శాస్త్రీయ దృక్ప థంతో అధ్యయనం, పరిశీలన చేసే సామాజిక లేక సాంఘిక శాస్త్రం అందుబాటులో లేదు. అలాగే ఫ్రెంచ్ విప్లవానంతరం సమాజంలో, కుటుంబంలో అనేక మార్పులు సంబంధించి స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం కూడా ప్రజలకు చేరువయ్యే అవకాశం లభించింది. ఇలా సమాజం పరివర్తన ఎందుకు చెందింది, ఈ మార్పుల వెనుక ఏమైనా నియమాలు ఉన్నాయా అనే ఆలోచనలో ఏదైనా సాంఘికశాస్త్రం ఈ మార్పులను, నియమాలను అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ విధంగా సమాజంలోని మార్పులను సమస్యలు, సంఘర్షణలను, మానవ సంబంధాలను అధ్యయనం కోసం ఉద్భవించిందే 'సమాజశాస్త్రం'.

మొట్టమొదట క్రీ.శ 1837లో ఆగస్ట్ కోమ్టే అనే ఫ్రెంచ్ తత్వవేత్త సమాజశాస్త్రం (సోషియాలజీ) అనే పదాన్ని సృష్టించాడు. ఆ తరువాత సమాజశాస్త్ర రూపాన్ని, స్వభావాన్ని, పరిధిని వివరించటంలో, అభివృద్ధికి దోహదపడిన వ్యక్తిగా ఆగస్ట్ కోమ్టేను సమాజశాస్త్ర పితామహుడుగా వ్యవ హరిస్తున్నారు. సమాజశాస్త్రం అంటే సమాజంలోని సమాజ నిర్మితి సామాజిక సంస్థలు, సామాజిక పర స్పర చర్యలు, సమాజ ప్రకార్యాలు, సమాజంలో త్వరితగతిన సంభవిస్తున్న మార్పులు, సామాజిక, సాంస్కృతిక సమస్యలను అధ్యయనం చేసే అత్యున్నత శాస్త్రం. సమాజశాస్త్రం అనేది సిద్ధాంతపరమైనది, నైతికమైనది కాదు, సమాజశాస్త్రం ఇతర సాంఘిక శాస్త్రాలైన చరిత్ర, ఆర్థిక, మానవ, రాజనీతి, తత్వ, మానసిక శాస్త్రాలతో అవినాభావ సంబంధం కలిగి ఉంటుంది. భారతదేశంలో ప్రప్రథమంగా 1919లో బొంబాయి విశ్వవిద్యాలయంలో సమాజశాస్త్రాన్ని ప్రవేశపెట్టారు. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అనేక విప్లవాత్మక మార్పులు సంభవించిన క్రమంలో అనేక సామాజిక సమస్యల పరిష్కారానికి సామాజిక విశ్లేషణ, అన్వేషణ ప్రారంభమైంది. కుల, మత ప్రభావాలున్న సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఉన్న మార్పుల ప్రభావం వివరించటంలోను, భారతదేశ సమాజ నిర్మితికి అనుగుణంగా అనేక సిద్ధాంతాలు, దృక్పథాలను వివరించటంలో సమాజశాస్త్రం సఫలీకృతమైంది. ప్రపంచవ్యాప్తంగా సమాజ శాస్త్ర నిర్మితి, అభివృద్ధిలో ఆగస్ట్ కోమ్టే, కారల్ మార్క్స్, హెర్బర్ట్ స్పెన్సర్, పార్సన్స్, రాబర్ట్ కె. మార్టన్, జార్జ్ సిమ్మెల్, మెన్స్, చార్లెస్ కూలే, హెర్బర్ట్ మీడ్, బ్లుమార్, గార్ఫెంకల్, మలి నోస్కి మొదలగు సామాజికతత్వ, శాస్త్రవేత్తలు కృషిచేయగా మనదేశంలో యం.యన్.శ్రీనివాస్, ఘుర్యే, యస్.సి.దూబే, కె. యం.కపాడియా తదితర సామాజిక శాస్త్రవేత్తలు వివిధ సిద్ధాంతాలు, దృక్పథాల ద్వారా సమాజశాస్త్ర అభివృద్ధికి కృషిచేశారు. 1951లో ఇండియన్ సోషియోలజికల్ సొసైటీ బొంబాయిలో స్థాపించిన భారతదేశ అత్యున్నత సమాజశాస్త్ర సంస్థ. ఈ సంస్థ సమాజ శాస్త్రానికి సంబంధించిన వివిధ అంతర్జా తీయ, జాతీయ సదస్సులు, పరిశోధన వర్క్‌షాపులు, పరిశోధన పత్రాలు ద్వారా సమాజశాస్త్ర విద్యార్థు లకు, పరిశోధకులకు, అధ్యాపకులకు మధ్య అనుసంధానంలా దేశంలో సమాజ శాస్త్ర అభివృద్ధికి కృషిచేస్తోంది.



సమాజశాస్త్ర పరిధి చాలా విస్తృతమైనది. సమాజ శాస్త్రంలో గ్రామీణ, నగర, ఆరోగ్య, రాజకీయ, పర్యా వరణ, నేర, క్రీడా తదితర అనేక సమాజశాస్త్ర ఉప శాఖలున్నాయి. నేటి ఆధునిక భారతదేశంలో అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలు, సామాజిక సమస్యలు, రుగ్మతలు మన దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. వీటివల్ల జరిగే మార్పులు, చర్యలు కాకుండా సమాజంలోని సంస్కృతి, సామా జిక విలువలు, సామాజిక విభేదీకరణ, స్థిరీకరణ, గతిశీలత వంటి అంశాలను విద్యార్థి దశ నుంచే తెలుసు కొని సమాజం పట్ల అవగాహన, విశ్లేషణను నేర్చుకో వాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం సమాజశాస్త్రంతోనే ఉంది. మనదేశంలోని సామాజిక సమస్యలైన పేదరికం, కులతత్వ, మతతత్వ, ప్రాంతీయ సమస్యలు, బాల కార్మికులు, మహిళ, గిరిజన, పర్యావరణ, దళిత, వెనుకబడిన వర్గాల సమస్యలు, అక్రమ రవాణా ఇతర సమాజ సమస్యలు పట్ల ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే నేటి ఆధునిక, నగరీకరణ, సాంకేతిక అభివృద్ధి ముసుగులో మన సమాజ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, జానపద రీతులు, సామాజిక, నైతిక విలువలు, కట్టుబాట్లు మరచిపోతున్న తరుణంలో వీటి ఆవశ్యకతను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత సమాజానికి ఉంది. ఇది కేవలం సమాజశాస్త్రంతోనే సాధ్యం. నేటి సమాజంలో నైతిక, సామాజిక విలువలు తెలియకుండా మానవతావాదం కనుమరుగువుతున్న పరిస్థితుల్లో వీటి ఆవశ్యకతను తెలియజేసే సమాజశాస్త్రాన్ని బాల్య దశ నుంచే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సామాజిక వైద్యులు, సామాజిక శాస్త్రవేత్తలు మాత్రమే సమాజ సమస్యలను విశ్లేషించి తగిన విధానాలను రూపొందించి భవిష్యత్ మార్పుల నుంచి సమాజాన్ని కాపాడుతారు. స్కూల్ స్థాయి నుంచి ప్రతి విద్యార్థి ఆర్థిక, చారిత్రక, రాజకీయ, సాంకేతిక విద్యా అంశాలు, కోర్సుల కంటే సామాజిక నిర్మాణం, సామాజిక లక్షణాలు, సమాజ సమస్యలు గురించి తెలుసుకోవాలి. తెలుసుకోకపోవటం వల్లే మానవ, సామాజిక, నైతిక విలువలు, బంధుత్వాలు మరచి కట్టుబాట్లు విస్మరించి హత్యలు, అఘాయిత్యాలు చేస్తున్నారు. సమాజంలోని విలువలు పడిపోయినప్పుడు ఆత్మహత్యలు జరిగే ప్రమాదం ఉంది. మానవుడు సామాజిక జంతువు అన్న నానుడి నుంచి సామాజిక మృగం అనే పరిస్థితి వెళ్ళకుండా ఉండాలంటే సమాజంపై అవగాహన, స్పృహ కలిగించాలి. ఇది కేవలం సమాజశాస్త్రం వల్లే సఫలమవుతుంది. ప్రస్తుతం మన దేశంలో వివిధ జాతీయ, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉంది. ఉత్తర భారతదేశంలో ఇంటర్మీడియట్ నుంచి అందుబాటు లో ఉంటే మన తెలుగు రాష్ట్రాలలో డిగ్రీ స్థాయి నుంచి మాత్రమే కొన్ని కళాశాలలో అందుబాటులో ఉంది. సెంట్రల్, ఉస్మానియా, కాకతీయ, శాత వాహన, నిజాం, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల వంటి కొద్ది కళాశాలల్లో మాత్రమే సమాజశాస్త్రం అందుబాటులో ఉండటం భాదాకరం. సామాజిక శాస్త్రం ఎంత ఆవశ్యకం కాకపోతే ఇతర ప్రొఫెషనల్ కోర్సులైన బి.యస్సీ అగ్రికల్చర్, నర్సింగ్, ఫిజియో థెరపి, ఐదేళ్ళ ఇంటిగ్రేటెడ్ లా, కెమిస్ట్రీ, బి.ఎడ్, అఖిల భారత సర్వీస్, తెలంగాణా రాష్ట్ర పబ్లిక్ సర్వీ స్ కమిషన్ గ్రూప్ 1,2,3 అన్ని సర్వీస్‌లలో సమాజ శాస్త్రం ఒకభాగంగా ఉంది. తెలంగాణా రాష్ట్రంలో వీరికి విద్యాఉద్యోగ అవకాశా లు తక్కువగా ఉన్నాయి. ఇంత ఆవశ్యకం ఉన్న సమాజశాస్త్రాన్ని అన్ని విశ్వవిద్యాలయాల్లో, ములుగు లో ప్రవేశబెట్టబోయే జాతీయ గిరిజన విశ్వవిద్యాల యంలో కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రతి విద్యార్థి సమాజాన్ని చదువుతాడు. సామజిక అభివృద్ధిలో సమాజ శాస్త్ర సిద్ధాంతాలు, దృక్పథాలు, అధ్యయ నాలు, విశ్లేషణలు కీలకపాత్ర వహిస్తాయి అందుకే సమాజశాస్త్రం ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉంది. సమాజశాస్త్రం వల్ల నేటి ఆధునిక కాలంలోని మానవ, సామాజిక, నైతిక విలువలు బలపడతా యని ఆశిద్దాం.

> సామజిక అభివృద్ధిలో సమాజ శాస్త్ర సిద్ధాంతాలు, దృక్పథాలు, అధ్యయనాలు, విశ్లేషణలు కీలకపాత్ర వహిస్తాయి అందుకే సమాజశాస్త్రం ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉంది. సమాజశాస్త్రం వల్ల నేటి ఆధునిక కాలంలోని మానవ, సామాజిక, నైతిక విలువలు బలపడతా యని ఆశిద్దాం.

◆ కందగట్ల శ్రవణ్ కుమార్
జూనియర్ రీసెర్చ్ ఫెలో,
సమాజ శాస్త్ర విభాగం
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

ఆదర్శ మహిళ

మహనీయుల రాష్ట్రం మహారాష్ట్రలో జన్మించావు
మహిళా లోకానికి మణిపూసవైనావు
ఖండోజి, లక్ష్మిభాయిల బిడ్డగా పుట్టావు
సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలేను వరించావు
మొదటి ఉపాధ్యాయునిగా చరిత్రలో నిలిచావు
స్త్రీలకై ప్రథమపాఠశాల పెట్టి చరిత్ర సృష్టించావు.
మహిళాహక్కుల కోసం పాటు పడ్డావు
మానవ హక్కులకై నిరంతరం పోరాడావు
స్త్రీ ప్రగతికై సేవా మండలిని స్థాపించావు.
వితంతువుల సమస్యల్ని పరిష్కరించావు
అంటరాని జనానికి అండగా, తోడుగా నిలిచావు
అనాథ స్త్రీలకు ఆశ్రయాన్ని, రక్షణ నిచ్చావు
బ్రాహ్మణాధిక్యతపై తిరుగుబాటు చేశావు
అసమానతల్ని తొలగించటానికి శ్రమించావు



మధ్యపాన నిషేధానికి చిత్తశుద్ధితో కృషిచేశావు
కార్మిక, కర్షక సమస్యలపై పోరుసల్పావు
పూలేతో కలిసి సత్యశోధక్ సమాజాన్ని స్థాపించావు
వ్యభిచార దురాచార అంతానికి పూనుకున్నావు
బాల్య వివాహల నిషేధానికి కృషి చేశావు
సతి సంప్రదాయాన్ని ఈసడించావు
వితంతు పునర్వివాహన్ని ప్రోత్సహించావు
కులాంతర వివాహల్ని స్వాగతించావు
కుల వ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించావు
'కావ్యపూలే','బవన్ కాషి సుబోధ్ రత్నాకర్'తో కవయిత్రివైనావు
కలం, గళంతో కులం కుళ్లను కడిగేశావు
నిద్రాణమైన స్త్రీ జాతిని మేలుకొల్పినావు
అట్టడుగు వర్గాల సేవకి జీవితాన్ని అంకితం చేశావు
స్వార్థ శక్తుల దొంగదాడులను భరించావు
దోపిడిదారుల ఎత్తుగడలను ఎండగట్టావు
సంస్కరణ వ్యతిరేకుల ఆటల్ని అడ్డుకున్నావు
అసాంఘిక శక్తులను ధైర్యంగా ఎదిరించావు
విద్య అనే ఆయుధంతో ముందు కెళ్లావు
చదువుకున్న స్త్రీగా ప్రగతిబాట నడిచావు
పాతుకుపోయిన దురాచారాన్ని పాతరవేశావు
స్త్రీ స్వేచ్ఛ, సమానత్వానికి ఊపిరి పోశావు
స్త్రీ జాతికి విద్యను అందించిన విద్యా ప్రదాతవు
యావత్ నారి లోకానికి స్ఫూర్తి ప్రధాతవు.

- ఆచార్య గిడ్డి వెంకటరమణ
(మార్చి 10 సావిత్రి ఫూలే వర్ధంతి)

మధూ... మన్నించు!

ఇప్పుడు బక్కచిక్కిన దేహమొకటి దేశాన్ని కుదిపేస్తుంది. వేల ప్రశ్నలు సమాజాన్ని చుట్టుముడుతున్నాయి. ఆకలి, మానవత్వం, ప్రజల మానసిక స్థితి అనే అంశాలని చర్చకి పెట్టాయి. దేశంలో కేరళ అత్యధిక అక్షరాస్యత శాతం కల్గిన రాష్ట్రం . 'దేవుని దేశం'. ఇది కేరళకున్న పేరు. ఎంత దేవుని దేశమైనా ఆకలి ముందు గెలవలేకపోయింది. మానవుడిలో తాను మనిషనే స్వభావం మరుగైపోతున్న విషయాన్ని ఈ సంఘటన మరలా తెరమీదకి తెచ్చింది. ఇటీవల ఆకలికి తట్టుకోలేక బియ్యం దొంగిలించాడని ఆదివా సీ బిడ్డ మధును కొట్టి చంపడం మానవునిలోని క్రూరస్వభావాన్ని మరలా లోకానికి చూపించింది. అన్న నానుడి నిజమే అనిపిస్తుంది. ఈ హత్యలో భాగస్థులందరూ తమ లోని సాంఘిక జంతువుని ప్రపంచానికి పరిచ యం చేసుకున్నారు. ఈ సంఘట నను కొందరు మతంతో ముడి పెడితే కొందరు దీన్ని పాలనా వైఫల్యంగా పేర్కొన్నారు.



ఇందులో మతమూ లేదు, పాలనా వైఫల్యమూ లేదు. ఉన్నదల్లా మనిషిలోని మృగ స్వభావం. అసలు దేవుడు, పేదలు కూడు అన గానే మహాకవి గుర్రం జాషువా పద్యం ఒకటి గుర్తొస్తుంది. అదేంటంటే-

''ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయింతురేగానీ / దుఃఖిత మతులైన పేదల పకీరుల సూన్యములైన పాత్రలన్ మెతుకు విదల్పదీ భరతమేదీ / ముప్పది మూడు కోట్ల దేవతలెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులారునే'' (గబ్బిలం) .

అర్థం లేని భక్తిలోని మూఢత్వాన్ని, మూర్ఖత్వాన్ని అన్నార్తుల దీనత్వాన్ని ఒక్క పద్యంలో ఆవిష్కరించారు జాషువా. బొమ్మల పెళ్లిళ్లకు, వందలు వేలు ఖర్చు పెట్టే ఈ దేశంలో అన్నార్తుల ఆకలి తీర్చేవాడు లేడు. వేల కోట్ల దేవతలు ఎగవడ్డ ఈ దేశంలో ఈ పేదవాని ఆకలి తీరుతుందా అంటూ ప్రశ్నిస్తాడు జాషువా. ఇది మధుకి కూడా వర్తిస్తుంది. కోటి విద్యలు కూటి కోసమే అన్నట్టు మధు ఆకలికి తాళలేక, లేక తన కుటుంబం ఆకలి తీర్చడానికో చేసిన ప్రయత్నం ఆ దైవభూమిలో దారుణమయింది. తన మీద దాడి చేస్తున్నప్పుడు అమాయకంగా చూస్తున్న మధు చూపులకు కరగని హృదయముంటుందా?

దుఃఖం తన్నుకొచ్చి కన్నీళ్ల వీడ్కోలు పలకని ప్రాణముంటుందా? ఎంత హృదయవిదారకం ఆ దృశ్యం. ముప్పది మూడు కోట్ల దేవతలలో బహుశా కొందరు అక్కడ ఉండే ఉంటారు. చేతులు కట్టేసి రక్తం కారేలా హింసిస్తుంటే ఆ దైవభూమిలో ఏ దేవుడి గుండె కరగలేదు. తాను దొంగిలించిన బియ్యం మొత్తం రక్తమయ్యిం టుంది. ఇటీవల సినీతార శ్రీదేవి మరణం మీడియాకొక విందయింది. మధు మరణ వార్తకు చివరి పేజీలో చిన్న సందయినా కరువైంది.

శ్రీదేవి మరణించినప్పుడు అంత్యక్రియల్లో ఆమెకి పెదాలకు పూసిన లిప్‌స్టిక్ బ్రాండ్‌తో సహా వివరాలు సేకరించారు. ఆమె పెదవులకు అందం వన్నె తగ్గకుండా రాసిన లిప్‌స్టిక్ ఆమె అందాన్ని రెట్టింపు చేస్తుంటే, దుర్మార్గుల చేతిలో దెబ్బలు తిన్న మధు నోటి నుంచి కారుతున్న రక్తం ఇది రాతియుగమనే సంకేతాన్ని పంపింది.శ్రీదేవి నటనలో అమాయకత్వంతో కోట్లు సంపాదిస్తే అదే సహజమైన నిజ జీవిత అమాయకత్వం మధుని విగత జీవిని చేసింది. కుటుంబ విషయాలైన శ్రీదేవి ఆస్తి పంపక చర్చలు బజారెక్కితే మధు ఆకలి కేకలు స్మశానానికి చేరుకున్నాయి. ఆ చూపులింకా వెంటాడుతున్నాయి. కూటికి గతిలేక అడవి బిడ్డలు అల్లాడుతుంటే ఈ దేశ ప్రజల సొమ్ము తిన్న విజయ్ మాల్యా లాంటివారు లండన్ పుర వీధుల్లో హాయిగా తిరుగుతున్నారు. కోట్లు ఎగ్గొట్టి కోతలు కోసేవాడికి, రోజుకో కొత్త సూటు వేసే వారికి ఈ ఆకలి రోదన అర్థమవుతుందా?. ఆకలి తీర్చుకోవడం మానవుని హక్కు. అదిప్పుడు అమ్మకమైపోయింది. గరీబీ హటావోలు, హరిత విప్లవ నినాదాలు చేరని ప్రదేశాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయిగా. మన దేశంలో బియ్యం దుకాణాల కంటే మద్యం దుకాణాలు ఎక్కువ. అడవిలోకి కూడా మద్యం దుకాణాలు వెళ్ళాయి కానీ బియ్యం వెళ్ళలేదు. బహుశా బియ్యం రూపాయికే దొరికుంటే, అడవిలోకే చేరుంటే మధు ఆనందంగా కొనుక్కొని కుటుంబం అంతటితో ఆత్మీయంగా ఆరగించేవాడేమో. ఒకరినని లాభం లేదు. ఇది భారతీయులందరి ఉమ్మడి బాధ్యత.

మనిషికి ఆలోచించే బుద్ధి ఉంది. ఇది మరే జీవరాశిలో లేదు. బియ్యం దొంగిలించాడు అనగానే జనం బిత్తరపోయేలా కొట్టిన వారు మనుషులా? లేక మరేదైనా జాతి జీవులా? తాను దొంగిలించిన 200 రూపాయల విలువ చేసే బియ్యం ధర రెండు సెకన్లలో చెల్లించడానికి 125 కోట్ల భారతీయులు సిద్ధం. మరి పోయిన మధు ప్రాణాలు తేగలరా?

ఈ దశాబ్దపు అమానవీయ ఘటనల్లో ఈ సంఘటన చేరుతుంది అనడంలో సందేహం లేదు.

ఆకలికి అర్థం కొత్తగా నిర్వచించాల అనేట్టు జరిగింది ఈ సంఘటన. పౌరుల ప్రవర్తనలోని నైతిక స్థాయిని పెంచే పనిచేయాల్సిన మీడియా మొత్తం శ్రీదేవి బాత్ టబ్‌లో మునిగింది. మధు మాత్రం సోషల్ మీడియాలో బ్రతికాడు. 'కనబడలేదు దైవతము కానిదేదీ ఈ భూమి మీద' అని జాషువా అన్నట్టు మధు చనిపోయాక దైవభూమిలో ఆత్మకు శాంతి చేకూరాలి అన్న నినాదాలు వినబడ్డాయి కానీ మధులాంటి వారెంతో మంది ఆకలి తీర్చే నినాదమేమీ వినబడలేదు.

సిరియాలో తల్లితండ్రులకు దూరమై పాలకోసం తల్లడిల్లుతూ అమాయకంగా ఎందుకు చనిపోతున్నామో తెలియని పిల్లల మోములకు, మధు అమాయకపు మోముకి తేడా ఏముంది? పిల్లలకు పాలు ఇచ్చి వాళ్ళ ప్రాణాలు కాపాడుకోవడానికి తమ శీలాలను సైతం అక్కడి క్రూర సైనికులకు అప్పగించ డానికి వెనుకాడని తల్లులు, పిల్లల కోసం మాతృత్వ త్యాగాన్ని గుర్తు చేస్తుంటే, భారత దేశం మాతృభూమి భారతీయులందరూ నా సోదరులు అన్న ప్రతిజ్ఞ చేసిన వారం సోదరులం మధుని పొట్టనబెట్టుకున్నం.

ఇప్పటికైనా ఈ సంఘటనతో అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. 'ఆకలిని చంపొద్దు. ఆకలిని తీర్చుద్దాం'. ఆకలేసిన వాడికి, అన్నానికి మధ్య ప్రేమ విస్తరి పరుద్దాం. మన నైతిక బాధ్యత గుర్తిద్దాం. పౌరుని నైతిక అభివృద్ధే దేశాభివృద్ధి అన్న అంబేద్కర్ మాటలు నెరవేరినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

యంత్రాలతో బతకొద్దు. మంత్రాలతో బతకొద్దు. మనుషుల్లా బతుకుదాం. మానవత్వాన్ని మథిద్దాం . మనల్ని మన్నించమని మధుని కోరుకుందాం'. ప్రపంచ మానవులరా ఏకంకండి. రండి దుఃఖం తీరేదాక కన్నీళ్లు పెట్టుకుందాం.

◆ పచ్చల రాజేష్

శిల్పం

గాజుపువ్వులు

చిహులీ అద్భుత సృష్టి





భూమ్మీద అత్యంత సున్నితమైంది పువ్వు. తాకితే కందిపోతుంది, పొద్దు వాలితే వాడిపోతుంది. అయితే భూమ్మీద అంతకన్నా సున్నితమైంది మరొకటి ఉంది. అదే గాజు. పగిలితే అతకదు. ఈ రెండింటిలోనూ ఇమిడిన ఒకే ధర్మం సున్నితత్వం. గాజుతో పువ్వుల్ని, ఆకుల్ని, రెమ్మల్ని, కొమ్మల్ని ఒకానొక అధివాస్తవిక చిత్రణలో సజీవం చేసిన ఘనత అమెరికన్ శిల్పి డేల్ చిహులీదే! గాజుతో ఎన్నెన్నో శిల్పాల్ని, ప్రతిమల్ని తయారు చేయడం మనకు తెలుసు. గాజు కళాఖండాలకు రూపమివ్వడం అంత సులభమైన విషయమేమీ కాదు. గాజుశిల్పాల చరిత్రలోనే ఒకానొక వైవిధ్యభరిత శైలికి తెరతీశారు చిహులీ. 'బ్లోన్ గ్లాస్' శైలిలో చిహులీ గాజు కళాఖండాల్ని రూపొందిస్తారు. ఒకానొక లోహపు గొట్టంలో మానవ శ్వాస గాజుగోళంగా రూపొందే అద్భుత శైలి అది. ఈ గాజుగోళం లేదా గాజు ముద్ద కేవలం ఇసుకతో తయారైందంటే నమ్మశక్యం కాదు. ఇసుకను ద్రవరూపంలోకి మార్చి, కాల్చడం ద్వారా చిహులీ అత్యంత సుందరమైన శిల్పాకృతుల్ని తయారు చేస్తారు. తన శిల్పాలకు చిహులీ ప్రకృతి నుంచి ప్రేరణను పొందుతారు. అందుకే ఆయన గాజుతో ఉద్యానవనాల్ని అవలీలగా సృష్టించి ప్రపంచాన్ని అబ్బుర పరిచారు. తన చిన్ననాటి నుంచి చిహులీకి గాజు అంటే ప్రాణం. అరవై ఒక్కేళ్ళ క్రితం తన ఇంట్లో స్టెయిన్డ్ గ్లాస్‌ని ఒక గొట్టంతో ఊదడం ద్వారా గాజు బుడగల్ని సృష్టించాడట ఆయన. అప్పటి నుంచి గాజుతో ఆయన రకరకాల ప్రయోగాలు చేశారు. గాజును ఒక ప్రత్యేక గొట్టం ద్వారా ఊదడం వల్ల చిత్రవిచిత్రమైన కళాఖండాల్ని సృష్టించవచ్చునని ఆయన కనిపెట్టారు. అంతవరకు గాజుతో కళాఖండాలు తయారు చేసే సంప్రదాయిక శైలి నుంచి చిహులీ మరింత విభిన్నమైన, తనదైన శైలిని సృష్టించుకున్నారు. చిహులీ వాషింగ్టన్‌లోని టకొమాలో జన్మించారు. ఎన్నెన్నో కష్టనష్టాలకు ఓర్చి తనకు ఇష్టమైన గాజుతో పనిచేయడమే జీవితలక్ష్యంగా మలచుకున్నారు. ఒకసారి 1976లో జరిగిన కారు ప్రమాదంలో ఆయన తన కంటిని పోగొట్టుకున్నారు. కారు అద్దం పగిలి కంటిలో గుచ్చుకుంది. మరోసారి జరిగిన ప్రమాదంలో ఆయన భుజానికి పెద్ద గాయమైంది. దాంతో గాజు శిల్పాలు తయారు చేసేందుకు ఉపయోగించే పైప్‌ను పట్టుకోవడం అసాధ్యమైంది. అయినప్పటికీ చిహులీ వెనుకంజ వేయలేదు. చిహులీ కేవలం గాజుశిల్పి మాత్రమే కాదు. ఆయన చార్‌కోల్, యాక్రిలిక్, గ్రాఫైట్ వంటి పలు మాధ్యమాలతో పని చేయగలరు. జీవితం విసిరిన ప్రతిసవాలుకు చిహులీ గట్టి జవాబే ఇచ్చారు. లాస్ వెగాస్‌లోని బెల్లగియో హోటల్‌లో రెండువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండువేల గాజు శకలాలతో ఆయన సృష్టించిన అతిభారీ కళాఖండమే చిహులీ దీక్షకు నిదర్శనం. ప్రకృతిలో మనకు కనిపించే అనేకా వృక్షాలు, మొక్కలతో పాటు పలురకాల పుష్పాలకు కూడా ఆయన గాజుతో ప్రతిసృష్టి చేశారు. ఈయన కళాఖండాల్ని ప్రపంచవ్యాప్తంగా 200 మ్యూజియంలలో భద్రపరిచారు. సీటెల్ సెంటర్‌లో 2012 నుంచి 'చిహులీ గార్డెన్ అండ్ గ్లాస్' పేరిట ఆయన సృష్టించిన గాజు ఉద్యానవనం దీర్ఘకాలం ప్రదర్శితమైంది. పలు రకాల వృక్షాకృతులతో ఆయన సృష్టించిన కళాఖండాలు ప్రపంచవ్యాప్తంగా కళాభిమానుల ప్రశంసల్ని చూరగొన్నాయి.



-కల్కి

పూల బాసట

విత్తనం భవిష్యత్తుకు ఇచ్చే హామీ పువ్వుగా విరబూస్తుంది. మొలకెత్తడంతోనే విత్తనం కథ ముగిసిపోదు. విత్తనానికి అందమైన కొనసాగింపుగా పువ్వులు విచ్చుకుంటాయి. ప్రకృతికి రంగుల పాఠం నేర్పే గురువులుగా పువ్వులు మనుషులకు కూడా ఎన్నో పాఠాలు చెబుతాయి. ఇవాళ పూసి, రేపొద్దుటికల్లా వాడిపోయే పువ్వు మనిషి జీవితానుభవాన్ని ఒక్కరోజులో కాచివడబోస్తుంది. మనుషులుగా మనం కోల్పోయిన విలక్షణమైన, అందమైన మన అస్తిత్వం పువ్వుల్ని చూసినప్పుడు మనకు గుర్తుకు వస్తుంది. అవి మనలోని సానుకూల ప్రపంచాన్ని నిద్ర లేపుతాయి. పువ్వుల్ని అనుభూతించే కొద్దీ అవి మనలోని మనకి మరింత స్పష్టంగా బొమ్మకడతాయి. ప్రతి పువ్వుకీ తనదైన పరిమళం, రంగు ఉన్నట్టే జీవితంలోని ప్రతి మలుపుకీ తనదైన నిర్వచనం ఉంటుంది. సంతోషానికి పువ్వుల్నే బహూకరిస్తాం. విషాదానికీ పువ్వులతోనే వీడ్కోలు చెబుతాం. జీవితం పూలబాట కాకపోయినప్పటికీ మన బతుకుబాటలో పువ్వులు కాసిని నవ్వుల్ని, మరి కాసిని భావోద్వేగాల్ని వెంటబెట్టుకుని మనకు సదా తోడుగానే ఉంటున్నాయి. అందుకే ఇవాళ 'మైత్రి' పువ్వుల తాలూకు కొన్ని భిన్నమైన విశేషాల్ని మీముందుంచుతోంది. **- మీ 'మైత్రి'**

కవి కలాం



దివంగత రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలామ్ గురించి మనకు ఎన్నో విషయాలు తెలుసు. ఆయనను మనం ముద్దుగా 'మిస్సైల్ మ్యాన్' అని పిలుచుకుంటాం. భావితరానికి ఉత్తమ ఆలోచనా శైలిని పరిచయం చేసిన 'ఇగ్నైటెడ్ మైండ్స్'ను గురించి కూడా మనకు తెలుసు. కానీ ఆయనలో మనకు తెలియని మరో కోణం కూడా ఉంది. అబ్దుల్ కలామ్ గొప్ప కవి కూడా! ఆయన 28 మార్చి 207న 'ది క్రేన్ సమ్మిట్ సుప్రీమ్ క్రౌన్ మెడలియన్' అవార్డును తైవాన్‌కు చెందిన తమిళ కవి డాక్టర్ యూ సీ చేతుల మీదుగా అందుకున్నారు. సాహిత్య రంగంలో కలామ్ చేసిన సేవలకు గాను ఆయనను ఈ అవార్డు వరించింది. అవార్డు స్వీకరించిన సందర్భంలో కలామ్ వినిపించిన స్వీయకవిత ఇది.

సుమ 'భారం'

పువ్వు సౌందర్యానికి, సౌరభానికి నెలవు. మానసికోద్వేగాల్ని వ్యక్తం చేయడానికి మనం చాలా సందర్భాల్లో పువ్వుల మీదే ఆధార పడతాం. అయితే ఇక్కడ మనం చూస్తున్న పువ్వులు రూపంలో ను, సౌరభంలోను పూర్తిగా భిన్నమైనవి. అందమైన పువ్వు కోసం కొమ్మ దగ్గరికెళితే రెమ్మరెమ్మకూ పుర్రెలు వేలాడడాన్ని చూస్తే ఏమై పోతాం? అలాంటి విచిత్రమైన పువ్వుల గురించి తెలుసుకుందాం.

భిన్నత్వం

స్నాప్ డ్రాగన్



సాధారణంగా ఈ పూలను డ్రాగన్ ఫ్లవర్స్ అంటారు. ఈ మొక్క డ్రాగన్ ఆకారంలో ఉండడమే దీనికి ఆ పేరు రావడానికి కారణం. కాగా ఈ మొక్క చనిపోయే టపుడు విత్తనాల్ని కాయల్లో వదిలి వెళుతుంది. ఈ కాయలు చూడ్డానికి మనిషి పుర్రెల్ని పోలి ఉంటాయి.

హూకర్స్ లిప్

చూడ్డానికి అచ్చంగా దొండపండులాంటి పెదాలతో కనిపించే ఈ పువ్వు సైకోట్రియా ఎలాటా అనే వృక్ష జాతికి చెందింది. ఇది దక్షిణ, మధ్య అమెరికాల్లో పెరుగుతుంది. అయితే ఈ అధరాల ఆకృతి పువ్వు వికసించే ముందు కాసేపు మాత్రమే ఉంటుంది. హమ్మింగ్ బర్డ్స్, సీతాకోకచిలుకల వంటి వాటిని ఆకర్షించడానికే ఈ పుష్పం కాసేపు అధర సుధల్ని ఒలికిస్తూ నాటకాలాడుతుంది.



టైటన్ ఆరమ్



దీన్ని పువ్వులన్నింటికీ మాతృరూపంగా భావిస్తారు. అయితే ఇది చూడడానికి లావణ్యంగా ఉండదు. మూడుమీటర్ల ఎత్తు పెరిగి, పరమ దుర్గంధాన్ని వెదజల్లుతుంది ఈ పుష్పం.

నా పూదోట నవ్వు

కవిత్వం

నా పూదోట వసంతాన్ని స్వాగతిస్తూ నవ్వుతోంది
అందం, పరిమళం కలగలిసిన
ఎర్ర గులాబీల చుట్టూ
తేనెటీగల ఝంకారాలతో
ఎక్కడ చూసినా
నా పూదోట నవ్వుతూనే ఉంటుంది
ఈ సుందర దృశ్యం నాలోకి ప్రవహిస్తుంది,
నా శరీరమంతటినీ సంతోషంలో ముంచెత్తుతుంది
గాలికి సుగంధాల ధూపం వేస్తూ
రకరకాల గులాబీలు..., గులాబీల సందోహంతో
నా పూదోట నవ్వుతూనే ఉంటుంది
విరిసిన గులాబీలన్నీ నింగికేసి చూస్తుంటాయి,
నిజంగా అదొక అద్భుత దృశ్యం
గులాబీల సామూహిక బృందగానం
అదొక సుస్వరం
నేస్తమా, ఆకాశాన్ని చూడు,
వెన్నెల సోనల మధ్య మెరుస్తున్న నెలవంక
ఆ దాపునే తారాతోరణం
అదంతా మన పాలపుంతే కదా!
ఈ దృశ్యం నిజంగా అరుదైన వేడుక
నింగిలోని దేవతలు, నేల మీది గులాబీలు...,
నింగిలోకి చూసినా నా గులాబీలే
నేల మీద చూసినా నా పాలపుంతే
నేను నా తోటంతా కలియతిరుగుతాను
ఎక్కడ చూసినా గులాబీలే!
వెలుగులు, అందాలు కలిసిన ఒక చిత్రమైన వేడుక
ఈ దృశ్యం ఇంత విలక్షణంగా ఎందుకుంది?
నా పూదోటలో ఇంతటి హృద్యమైన క్షణం ఇదే!
నా పూదోట నవ్వుతూనే ఉంటుంది.
పూదోట వినిపించే మధురమైన సంగీతంలో
ఈ దృశ్యమంతా మమేకమై పోతుంది
'మా పాలపుంత నుంచి వచ్చిన కవి మిత్రమా, ఇదంతా
నీ రాక కోసం జరుగుతున్న దేవతా పుష్ప సంరంభమే,
సృజనకారుడా యూ సీ ఇదంతా నీ కోసమే'
మమ్మల్ని కలవడానికి సముద్రాల్ని దాటి వచ్చావు
దేవతలు నీకు ఇక్కడ స్వాగతం పలుకుతున్నారు నేస్తమా!
అందమైన గులాబీలతో, దివ్య సంగీతాన్ని ఆలపిస్తూ
నీ కోసం నా పూదోట నవ్వుతూనే ఉంటుంది.


- ఎపిజె అబ్దుల్ కలామ్ (అనువాదం: పసుపులేటి గీత)



కెమెరా

సుగంధాల 'క్లిక్కు'!

మనదేశంలో పువ్వులు లేకుండా రోజు గడవదంటే అతిశయోక్తి కాదు. రోజూ పక్కింటి గోడ మీద నుంచి మన వాటాలోకి తొంగి చూసే మందారం కొమ్మని కాస్త వంచి, ఒక్క పువ్వునైనా కోసి, దేవుడి ముందు పెట్టేసి, చేతులు జోడిస్తాం. పండగ, పబ్బం అంటూ వచ్చిందా ఇక పువ్వులమ్మే పిల్ల కోసం మన కళ్ళు బజారంతా గాలించేస్తాయి. అయితే రంగుల రంగవల్లిలాంటి పూలబజారు అందుబాటులో ఉంటే ఇక మనకు పట్టపగ్గాలే ఉండవు. సత్కారాలకైనా, సత్కార్యాలకైనా పూలదండలు కొనుక్కెళ్ళి, మెడలో వేసి మన గౌరవాన్ని చాటుకుంటాం. ఇవాళైతే బారు జడలు కనుమరుగు కావడంతో సరి పోయింది కానీ, ఓ ఇరవై ఏళ్ళ క్రితమైతే ఎండాకాలం వచ్చిందంటే చాలు మల్లెపూలతో, మొగలి పూలతో అమ్మాయికి జడనల్లే హడావిడీనే వేరు! పెళ్ళిళ్ళకీ, బారసాలలకీ, గృహప్రవేశాలకీ... అబ్బో, ఒకటేమిటి... వేడుక అంటూ ఒకటి మొదలవ్వాలే కానీ, పూల సంబరానికి కొదవేమీ ఉండదు. పూజ అంటే దేవుడి కన్నా మనకు ముందు గుర్తుకొచ్చేవి పూలే! మరి ఇన్ని అవసరాల్ని తీర్చేదీ పూలమ్మే వాళ్ళేగా! ఆసియాలోనే అతిపెద్ద పూలబజారు ఒకటి మనదేశంలో ఉంది. హుగ్లీ నదీతీరాన ఉన్న ఈ పూలబజారులో ప్రతి రోజూ రెండువేల మంది పూలమ్మే వాళ్ళు వ్యాపారం చేస్తుంటారు. అదే కోల్‌కతాలోని 'మాలిక్ ఘాట్ ఫ్లవర్ మార్కెట్'. ఏదో పని మీద మన దేశానికి వచ్చిన డానిష్ ఫోటోగ్రాఫర్ కెన్ హెర్మన్ మాలిక్ ఘాట్ ఫ్లవర్ మార్కెట్‌కు వెళ్ళారు. అక్కడ పూలమ్మే వాళ్ళు కెన్ హెర్మన్ కెమెరాను ఆకర్షించారు. ఈయన తీసిన ఈ ఫోటోలు కేవలం వ్యక్తుల్నే కాదు, వారి జీవన శైలిని, సంస్కృతిని కూడా ఏకమొత్తంగా ప్రతిబింబించాయి. రోజూ మనకు కనిపించే పూలమ్మే వాళ్ళని యధాతథంగా చూపెడుతూనే, పూలకీ, మనుషులకీ మధ్య ఉన్న అనుబంధాన్ని కెన్‌హెర్మన్ కవితాత్మకంగా తన కెమెరాలో బంధించిన వైనం విమర్శకుల మన్ననల్ని పొందింది. ఆయన తొలుత పూలమ్మే ఆడవాళ్ళను కూడా ఫోటోలు తీయాలని ప్రయత్నిస్తే, వాళ్ళు భృకుటి ముడివేయడంతో ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడు.











కఠినమైన పనులు అవలీలగా చేయగలిగే పురుషులు పువ్వులతో ఎంత సున్నితంగా వ్యవహరించగలరో వీళ్ళని చూశాకే తెలిసిందంటారు కెన్ హెర్మన్. బంతిపువ్వులమ్మే కుల్విందర్ తన పని మానుకుని, ఎర్రటి ఎండలో తన ఫోటోలకు ఓపిగ్గా పోజులిచ్చిన వైనాన్ని అభిమానంగా గుర్తు చేసుకుంటారు ఈ ఫోటోగ్రాఫర్. తాను తీసిన ప్రతి ఫోటోకి ఆయన వీళ్ళకి ప్రతిఫలాన్ని కూడా ముట్టజెప్పారట. రోజుకు 55 మంది పూలమ్మేవాళ్ళని ఆయన ఫోటోలు తీసే వారట. పూలమ్మే వాళ్ళు బెంగాలీ మాత్రమే మాట్లాడేవారు. దాంతో కెన్‌హెర్మన్ ఒక బెంగాలీని సహాయకునిగా నియమించుకుని, ఈ ఫోటోగ్రాపుల్ని తీశారట. కొన్ని దేశాల్లో భారతదేశమంటే పేదరికం తాండవిస్తుంటుందన్న భావన ఉందని, కానీ తాను తీసిన ఈ ఫోటోల్ని చూసిన తరువాత ఆ అభిప్రాయం మారిపోతుందని ఆయన అంటున్నారు.

పెట్టుబడి పథకం 'రైతులక్ష్మి'

పేరును ఆమోదించిన సీఎం కేసీఆర్!



హైదరాబాద్, మార్చి 9(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందస్తు పెట్టుబడి రైతులకు ఎకరాకు రూ.4వేలు అందజేయనున్న పథకానికి 'రైతు లక్ష్మి'గా నామకరణం చేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. దీనికి సీఎం కేసీఆర్ సైతం ఆమోదం తెలిపినట్టు తెలిసింది. రెండు మూడు రోజుల్లో ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించనుంది. ఈ నేపథ్యంలోనే చెక్కుల పంపిణీకి సంబంధించి వ్యవసాయ శాఖ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానంగా రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం రూ.50వేలు దాటితే రెండు చెక్కుల రూపంలో ఇవ్వాలని నిర్ణయించింది. ఒక్క చెక్కుపై రూ.49,999కి మించి నగదును ఇవ్వొద్దని పేర్కొంది. ఒకవేళ రైతుకు ఎక్కువ ఎకరాలు ఉండి పెట్టుబడి సాయం రూ.50 వేలకు మించితే రెండో చెక్కుపై ఇవ్వనున్నారు.

మే 15 నాటికి పంపిణీ పూర్తి..

రైతులకు ఆర్డర్ చెక్కులను ఏప్రిల్ 20వ తేదీ నుంచి అందజేస్తారు. రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రకారం.. రెవెన్యూ శాఖ ఒక్కో రైతుకు ఉన్న భూమి, అందాల్సిన సాయం వివరాలను సిద్ధం చేస్తోంది. ఈ వివరాల ఆధారంగా బ్యాంకులు రైతుల పేరు మీద చెక్కులను ముద్రిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 72 లక్షల మంది లబ్ధిదారుల వివరాలను శుక్రవారం సాయంత్రానికి సీసీఎల్ఏ అందజేయాల్సి ఉందని ఓ వ్యవసాయ అధికారి చెప్పారు. కానీ ఇంకా మండల స్థాయిలో రెవెన్యూ ఖాతాలపై సగం కూడా డిజిటల్ సిగ్నేచర్ ప్రక్రియ పూర్తికాలేదు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం..

రెవెన్యూ భూరికార్డుల ప్రక్షాళన ప్రకారం.. తేలిన వివరాల ఆధారంగా ప్రభుత్వం చెక్కులను అందజేయనుంది. అయితే క్షేత్రస్థాయిలో రైతులకు ఉన్న భూముల విస్తీర్ణంలో తేడాలు వచ్చే అవకాశం ఉంది. దీనికితోడు రైతులకు బ్యాంకు ఖాతాలో ఉండే పేరు, రెవెన్యూ ఖాతాలో ఉండే పేరుకు వ్యత్యాసాలు ఉండే వీలుంది. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రప్రభుత్వం చెక్కుల పంపిణీ సందర్భంగా వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. రైతులకు అందజేసిన చెక్కుల్లో అక్షర దోషాలు, భూవిస్తీర్ణంలో తేడా వంటి ఫిర్యాదులను 30 రోజుల్లోగా పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ యంత్రాంగాన్ని అందుబాటులో ఉంచనున్నట్టు సమాచారం.

రైతుకు బ్యాంకు ఖాతా తప్పనిసరి

బ్యాంకు అధికారులు చెబుతున్న ప్రకారం.. ప్రతి రైతుకు తప్పనిసరిగా ఖాతా ఉండాల్సిందే. ఎందుకంటే.. బ్యాంకులు రెవెన్యూ అధికారులు ఇచ్చిన డిజిటలైజేషన్ వివరాల ప్రకారమే చెక్కుల ముద్రణ జరుగుతుంది. ఈ లెక్కన రెవెన్యూ రికార్డు ఖాతాలో ఉండే పేరు మీద మాత్రమే చెక్కు ముద్రణ జరుగుతుంది. రైతుకు అర ఎకరం ఉన్నా.. అతనికి వచ్చే రూ.2వేల చెక్కు నగదు తీసుకోవాలంటే.. ఆ రైతుకు బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ బ్యాంకు ఖాతాలు లేని రైతుల సంఖ్య పది లక్షల వరకు ఉంది. 72 లక్షల మంది రైతుల్లో సగం మంది రైతులకు పైగా ఎకరం, అరెకరం, పది గుంటల భూమి ఉన్నవారు ఉన్నారు. వారికి వచ్చే రూ.2వేలు, రూ.వెయ్యి చెక్కుల కోసం ప్రత్యేకంగా రూ.వెయ్యి పెట్టి ఖాతాను తేరవాల్సి వస్తుందని పలువురు అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే.. చెక్కుల ముద్రణ, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ వివరాలు అందడం చాలా ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. దీనిమూలంగా రైతులకు జూన్ నెల చివరి నాటికి చెక్కులు అందవచ్చని ఓ రెవెన్యూ అధికారి పేర్కొన్నారు.

వ్యవసాయ శాఖ కమిషనర్ పేరుతో ఖాతాలు..

రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులకు చెక్కులు అందించాల్సి ఉంది. బ్యాంకు నిబంధనల ప్రకారం.. ఒక్క బ్యాంకు ఖాతా నుంచి కేవలం 9,99,999 చెక్కులను మాత్రమే ఇచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని చెక్కులను ముద్రించే ఆరు బ్యాంకుల్లో ఒకటి కంటే ఎక్కువ ఖాతాలను వ్యవసాయ శాఖ కమిషనర్ పేరు మీద తెరవనున్నారు. ఇదే అంశాన్ని ఇటీవల జరిగిన బ్యాంకర్ల సమావేశంలోనూ బ్యాంకు ప్రతినిధులు వెల్లడించారు. అధిక శాతం చెక్కులను ఎస్‌బీఐ, ఆంధ్రాబ్యాంకుల్లోనే ముద్రించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కమిషనర్ పేరు మీద రెండు మూడు ఖాతాలు తెరవడం అనివార్యమైంది.

మండలాల వారీగా జాబితా..

రైతులకు అందజేసే చెక్కులను మొదటి విడతగా ఏప్రిల్ 20నుంచి, రెండో విడత చెక్కులను ఏప్రిల్ 30 నుంచి, మూడో విడత చెక్కులను మే 15 తేదీలుగా అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు. మొత్తంగా మూడు దఫాలుగా చెక్కులను అందజేయనున్నారు. ఈ చెక్కులను గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా జాబితాను రూపొందిస్తారు. అలా ముద్రించిన చెక్కులన్నీ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి చేరుతాయి. అక్కడి నుంచి తిరిగి చెక్కులు గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా రైతులకు చేరతాయి. ఈ ప్రక్రియలో ఏలాంటి లోపాలు లేకుండా చూసేందుకు వ్యవసాయ శాఖ అధికారులకు పనిని విభజించి అప్పగించారు. ఈ చెక్కులపై పట్టాదారు పాస్‌బుక్ నంబర్ ఉండనుంది.

డిజిటలైజేషన్‌లో జాప్యం..

రాష్ట్రంలో 72 లక్షల ఖాతాలకు డిజిటల్ సిగ్నేచర్ చేయాలి. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ వేగాన్ని అధికారులు పెంచారు. ఓ రెవెన్యూ ఉన్నతాధికారి చెప్పిన వివరాల ప్రకారం.. మార్చి ఐదో తేదీ నాటికి 8.12లక్షల ఖాతాలకు మాత్రమే డిజిటల్ సంతకం పూర్తయ్యింది. సాంకేతిక సమస్యల వల్ల ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతుందని తెలిసింది. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న కంప్యూటర్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం సరిగ్గా లేకపోవడమే సమస్యకు కారణం. ఎంత లేదన్న డిజటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేసరికి మరో నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉంది.

'ఫేక్'బుక్ ప్రేమ!

- అమ్మాయిలకు టోకరా
- ఏలూరులో ఏడుగురి అరెస్టు



ఏలూరు సిటీ, మార్చి 9 (మనం న్యూస్): ఫేస్‌బుక్ పరిచయాలు.. ఫేక్ ప్రేమలు.. పెట్టుబడిగా అమ్మాయిలకు టోకరా వేస్తున్న ముఠా గుట్టురట్టయింది. పరిచయాలు పెంచుకుని ప్రేమ పేరుతో దగ్గరవడం.. ఆపై డబ్బు కోసం వారిని బెదిరిస్తూ విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్న ఏడుగురు యువకులను ఏలూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ. కోటి విలువైన బంగారం, ఒక కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఓ బాధిత యువతి ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఏలూరుకు చెందిన దత్తి బాలాజీ (24), సింహాద్రి బాలచందర్ అలియాస్ బాలు, పిల్లా సాయి దేవేంద్ర నాయుడు, విపర్తి ఫ్రాన్సిస్, కొండి రాజేష్, దెందులూరు మండలం వీరభద్రరావుపురానికి చెందిన గుజ్జుల రాజీవ్, చాణక్యపురి కాలనీకి చెందిన తుమ్మలపల్లి అశోక్‌కుమార్‌లు కొన్నేళ్లుగా స్నేహి తులు. వీరంతా విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి.. ఈజీ మనీ కోసం దారులు వెతుక్కున్నారు. నగరంలోని ధనవంతులైన యువతులకు ఫేస్‌బుక్ ద్వారా దగ్గరవడమే మార్గంగా ఎంచుకున్నారు. జనసేన పార్టీలో కార్యకర్తమని చెప్పుకున్నారు. ముఖ్యంగా బాలాజీ, బాలచందర్, సాయి దేవేంద్రలు ధనవంతులైన కుటుంబీకుల యువతులకు ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపి ఆపై వారితో పరిచయం పెంచుకున్నారు. నగరానికి చెందిన ఓ నగల వ్యాపారి కుమార్తెకుతో బాలాజీ రెండేళ్ల క్రితం ఫేస్‌బుక్‌లో పరిచయం పెంచుకుని దగ్గరయ్యాడు. ఆపై వారిరువురి మధ్య జరిగిన ప్రైవేటు సంభాషణలు, ఫోటోలను బయటపెడతానని బెదరించి.. ఆమె దగ్గర పలు దఫాలుగా బంగారు ఆభరణాలను పెద్ద మొత్తంలో తీసుకున్నాడు. వాటిని తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో స్నేహితులంతా కలిసి 40 సార్లు గోవా వెళ్లి జల్సాలు చేసి వచ్చాడు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం ఆ నగల వ్యాపారి కుమార్తె ఏలూరు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు గురువారం రాత్రి ఆ ఏడుగురిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి కోటి రూపాయల విలువైన 3,424 గ్రాముల బంగారం, ఎనిమిది లక్షల విలువ చేసే కారు, నాలుగు లక్షల విలువ చేసే రెండు ద్విచక్రవాహనాలు, రెండు లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాదీనం చేసుకున్నారు.

దేశానికి ఎజెండా

(మొదటిపేజీ తరువాయి)

పద్ధతులు, చట్టాలను సంపూర్ణంగా అధ్యయనం చేసి.. అవసరమైన మార్పులు, సంస్కరణలు తెచ్చే విషయంపై వివిధ రంగాలకు చెందిన నిపుణులు, సీనియర్ అధికారులు మార్గనిర్దేశనం చేయాలని చెప్పారు. ఈ ప్రయత్నంలో దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన అన్ని వర్గాల వారు పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి కావాల్సిన ఎజెండాను రూపొందించడంతోపాటు, ఇప్పుడున్న విధానాల మంచి చెడులపై సీఎం కేసీఆర్ శుక్రవారం ప్రగతిభవన్ లో వివిధ రంగాల ప్రముఖులు, సీనియర్ అధికారులతో మాట్లాడారు. ''దేశానికి స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలు వచ్చినా అనుకున్న పురోగతి రావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ప్రగతిపథంలో దూసుకుపోతున్నా, మన దేశంలో ప్రజలు ఇంకా ప్రాథమిక అవసరాలు తీరకుండా ఉన్నారు. చాలా సమస్యలు పరిష్కారం కావడం లేదు. దేశ ప్రజలందరికీ మంచినీరు, విద్యుత్, సాగునీరు అందడం లేదు. ఇంకా చాలా అవసరాలు తీరడం లేదు. మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదు. చాలా రాష్ట్రాల మధ్య జల వివాదాలున్నా, అవి పరిష్కారం కావడం లేదు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో కూడా అనేక కమిషన్లు, నిపుణులు సూచించిన సంస్కరణలు అమలు కావడం లేదు. ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తి పూర్తిస్థాయిలో ప్రతిబింబించడం లేదు. ఈ పరిస్థితుల్లో దేశాభివృద్ధికి కావాల్సిన ఎజెండాను రూపొందించాలి. సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాల్లో తెలంగాణ రాష్ట్రం అనేక మైలురాళ్లను అధిగమించింది. ఇతర రాష్ట్రాలకు, కేంద్రానికి కూడా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఆదర్శంగా నిలిచాయి. ఈ పథకాలను దేశ వ్యాప్తంగా అమలు చేయడంతో పాటు, ఇంకా ఆయా రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కావాల్సిన కార్యక్రమాల రూపకల్పన జరగాలి. దేశంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలున్నాయి. ఏ శాఖ ఎవరివద్ద ఉండాలనేది నిర్ణయం జరగాలి. ఉమ్మడి జాబితా అమలులో ఉండటం వల్ల ఒకే శాఖకు సంబంధించి వేర్వేరు పథకాలు, కార్యక్రమాలు అమలవుతున్నాయి. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని పరిష్కరించాలి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు సామాజిక పరిస్థితులున్నాయి. వాటికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించుకోవాలి. ఈ విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ, అధికారం కావాలి. న్యాయ, పాలన, శాసన వ్యవస్థలలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. దేశంలో తీసుకురావాల్సిన మార్పులు, సంస్కరణలు, చట్ట సవరణలు, రాజ్యాంగ సవరణలు తదితర అన్ని విషయాల్లో స్పష్టమైన ఎజెండా రూపొందాలి. ఈ విషయంలో దేశంలోని అధికారులు, రాజకీయ నాయకులు, రిటైర్డ్ అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు తమ సూచనలు ఇవ్వాలి. ఈ ప్రయత్నంలో భాగస్వాములు కావాలి'' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ, క్రియ స్వచ్ఛంద సంస్థ సీవోవో డాక్టర్ బాలాజీ ఊట్ల, పలువురు రిటైర్డ్ అధికారులు, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు.

నా పుట్టుక.. చావు టీఆర్ఎస్‌లోనే!

(మొదటిపేజీ తరువాయి)



ప్రచారేం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి మంత్రి ఫిర్యాదు చేశారు. ఓ ప్రైవేటు ఛానల్ ప్రసారంచేసిన వార్త అంటూ ఆ ఛానల్ లోగోతో తనపై సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను క్రియేట్ చేసి కొందరు తనపై బరదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఇలాంటి తప్పుడు పనులు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు హరీశ్ రావు తెలిపారు. ఇకపై అలాంటి పుకార్లు ఎవరు ప్రచారంచేసినా చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన కుటుంబంనుంచి తాను వచ్చానన్నారు. శుక్రవారం టీఆర్ఎస్ భవన్‌లో మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను సమర్థంగా నిర్వహిస్తామని చెప్పారు. తమ ప్రభు త్వంపై అసంతృప్తి ఉంటే ప్రజల్లో స్పందన వస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదనే విషయం ఆ పార్టీ నాయకులకు తెలుసునన్నారు. కాంగ్రెస్ హయాంలో విద్యుత్ కోతలు ఉంటే తెరాస హయాంలో విద్యుత్ సౌకర్యంగా మారిందని తెలిపారు. తెరాస ప్రభుత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసం కలిగి ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పెండింగ్ ప్రాజెక్టులుగా మారిస్తే.. తాము రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని తెలిపారు. గతంలో సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన విద్య, భోజనం అందించలేదని ఆక్షేపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వం విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం పెడుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెరాసనే అధికారంలోకి వస్తుందని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష స్థానం, ఇప్పుడున్న సీట్లు కూడా దక్కవన్నారు. ఈ భయంతో రాష్ట్రంలో ఉనికిని కాపాడుకునేందుకు కాంగ్రెస్ బస్సుయాత్ర చేపట్టిందని అన్నారు. ఈ యాత్ర సందర్భంగా కాంగ్రెస్ నేతలు తమ నాలుకలకు నరం లేదన్నట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు బస్సు యాత్రలు చేసినా మోకాళ్ళ యాత్రలు చేసినా పాదయాత్రలు చేసినా మళ్ళీ టీఆర్ఎస్‌దే అధికారమని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మేదెలా?

'కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రాదు. అధికారంలోకి రాదు కాబట్టే ఇష్టం వచ్చినట్టు కాంగ్రెస్ నేతలు హామీలు ఇస్తున్నారు. 2004లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కటన్నా అమలుచేయని కాంగ్రెస్‌ను ప్రజలు ఎలా నమ్ముతారు. తొమ్మిది గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి.. చివరకు కంటితుడుపు చర్యగా కరెంటు ఇచ్చారు. ఉద్యమ కాలంలో రాజీనామాలు అంటే పారిపోయారు. మీరు కరెంట్ ఇవ్వలేదు. మేం ఇచ్చి నం, మీరు నీళ్ల ఇవ్వలేదు.. మేం నీళ్ల ఇచ్చినం. మీ హ యాంలో ఆడపిల్ల భారం.. మా పాలనలో లక్ష్మీ. మీరు ఒత్తిడిలో ఉన్నారని మీ మాటలే చెబుతున్నయి. మంత్రి ఈటల రాజేందర్ మీద విమర్శలు నిరాధారం' అని హరీశ్ రావు తెలిపారు.

బస్సుయాత్ర కాదు పిక్నిక్ యాత్ర: తలసాని

తెలంగాణ కాంగ్రెస్ నేతలు బస్సు యాత్రను తమ పిక్నిక్ యాత్రగా మార్చుకున్నారని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ విమర్శించారు. అడ్డగోలుగా అందరినీ ఏకవచనంతో తిడుతున్న కాంగ్రెస్ నేతలు వచ్చే ఎన్నికలలో ఇపుడున్న ఎమ్మెల్యే సీట్లలో సగమైనా గెలుస్తారో చెప్పాలని తలసాని ప్రశ్నించారు. కాంగ్రెస్, ఎపుడో ప్రజల విశ్వాసం కోల్పోయిందని చెప్పారు. అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ నేతలు ఇపుడు ఇచ్చే హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని నిలదీశారు. బీసీల సంక్షేమం గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే అర్హతేలేదన్నారు. అసెంబ్లీకి సరిగా హాజరుకాని చరిత్ర కాంగ్రెస్ నేతలదేనని మంత్రి తలసాని విమర్శించారు.

నిప్పుల కొలిమి

(మొదటిపేజీ తరువాయి)

మేరకు టాప్-10లో ఏపీ, తెలంగాణలకు చెందిన మూడు నగరాలు ఉండడం గమనార్హం. దేశంలోనే అత్యధికంగా కర్నూలు, అనంతపురంలలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.6 డిగ్రీలుగా నమోదైంది. ఆ తర్వాతి స్థానాల్లో కేరళలోని కొట్టాయం, త్రిసూర్‌లలో 38.5 డిగ్రీలు, మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో 38.4, గుజరాత్‌లోని వడోదర, కర్ణాటకలోని బళ్లారి, తెలంగాణలోని మహబూబ్‌నగర్, మహారాష్ట్రలోని నందుర్బార్, సోలాపూర్‌లలో 38 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు స్కైమెట్ తెలిపింది.

ఈ వారంలో వడగాలులు అధికం

మార్చి 8 నుంచి 14 మధ్య వడ గాడ్పులు అధికమయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ వారంలో తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వడగాలులు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే ఉత్తర, తూర్పు, మధ్య భారతంలోని రాష్ట్రాల్లో సాధారణం కన్నా 4 నుంచి 6 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, మార్చి 3న మహారాష్ట్రలోని నందుర్బార్‌లో గరిష్టంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వచ్చే వారం నుంచి భానుడి ప్రతాపం

వచ్చే వారం నుంచే ప్రచండ భానుడు ప్రతాపం చూపించబోతున్నాడు. ఈ ఏడాది వేసవి మునుపెన్నడూ లేనంతగా మండిపోబోతోంది. ఓ వైపు ఎండ తీవ్రత.. మరోవైపు వడగాలులు.. తీవ్ర ఉక్కపోత ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేయబోతోంది. రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారిపోబోతోంది. గరిష్ఠ ఉష్ణోగ్రత అసాధారణంగా 52 నుంచి 54 డిగ్రీల వరకు చేరే ప్రమాదం ఉంది. ఈ మేరకు రాష్ట్ర వాతావరణ శాఖ సంచాలకుడు వైవీ రెడ్డి హెచ్చరించారు. విజయవాడ సమీపంలోని కుంచనపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ కార్యాలయంలో 'ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం' అనే పేరుతో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏపీలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగనున్నాయని చెప్పారు. వాతావరణంలో వచ్చే మార్పులపై 30 సంవత్సరాల నివేదికలను అధ్యయనం చేసి తాజా అంచనాలు రూపొందించామని ఆయన పేర్కొన్నారు. మార్చి రెండో వారం నుంచి జూన్ మూడో వారం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వెల్లడించారు.

పెళ్లింట విషాదం



(మొదటిపేజీ తరువాయి)

కూడా గడవకముందే మృత్యువు వారిద్దరినీ వేరుచేసింది. కోటి ఆశలతో ఇంటికి తిరిగొస్తున్న పెళ్లికొడుకు అక్కడికక్కడే మరణించగా.. అత్తవారింటికి వస్తున్న ఆనందంలో ఉన్న పెళ్లికూతురు చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వరుడితో సహా ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. పెళ్లి కుమార్తెతో పాటు.. వరుడి బావ కూడా ఆస్పత్రిలో విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు.

తెలంగాణలోని వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన అచ్చెం రామకృష్ణప్రసాద్(38)కు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన దుర్గాభవానితో గురువారం రాత్రి 9 గంటలకు పెళ్లి జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని కేశవస్వామి ఆలయంలో ఈ వివాహం వైభవంగా అయ్యింది. పెళ్లి తంతు అంతా ముగిసిన తర్వాత నూతన వధూవరులతో కలిసి వరుడి కుటుంబసభ్యులు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మొత్తం రెండు ఇన్నోవాలు, ఒక టవేరా, ఒక మినీబస్సులో వర్ధనపేటకు బయలుదేరారు. వధూవరులు వెళ్తున్న కారు అన్నింటికంటే ముందుంది. వేగంగా వస్తున్న కారు కొణిజర్ల పరిధిలోని పల్లిపాడు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో రహదారి మొత్తం పొగమంచు కప్పేసింది. ఈ ప్రమాదంలో పెళ్లి కుమారుడు రామకృష్ణప్రసాద్, అతని అక్క పద్మ, చెల్లి కొమండూరి శ్రేదేవి (36), బావ కొమండూరి శరత్ (38)తో పాటు కారు డ్రైవర్ వి.వేణు (36) అక్కడికక్కడే మృతిచెందారు. వధువు దుర్గాభవాని, వరుడి బావ (పద్మ భర్త) శేషం చలపతిరావులకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న చిన్నారులు మహితి, రామన్, నిషిత్‌లకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అమ్మానాన్నలిద్దరినీ కోల్పోయిన చిన్నారులు వాళ్లెక్కడ అని అడగడం.. అందరినీ కన్నీరు పెట్టించింది

తల్లడిల్లిన బంధువులు

వెనక వేరే వాహనాల్లో వస్తున్న బంధువులు ప్రమాదం గురించి తెలిసి తల్లడిల్లిపోయారు. ప్రమాదస్థలితో పాటు ఆస్పత్రి వద్ద ఉద్విగ్న వాతావరణం నెలకొంది. కొత్తగూడెం ఎస్పీ అంబర్‌కిషోర్ ఝా, వైరా ఏసీపీ ప్రసన్నకుమార్, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మదన్‌లాల్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. రోడ్డు ప్రమాద వివరాలు పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

గౌరవ మరణం!



(మొదటిపేజీ తరువాయి)



తీర్పు చెప్పింది. 'పరోక్ష కారుణ్య మరణాన్ని' ఆమోదిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా సహా ఐదుగురు న్యాయమూర్తులు శుక్రవారం తీర్పునిచ్చారు. అలాగే భవిష్యత్తులో తాము చికిత్స లేని కోమా స్థితిలోకి వెళ్లిపోయినా, తమకు లైఫ్ సపోర్ట్ (వెంటిలేటర్లు) పెట్టొద్దంటూ బతికుండగానే వీలునామా రాయడానికి కూడా కోర్టు ఆమోదించింది. వెంటిలేటర్ లేదా మరేదెనా కృత్రిమ వ్యవస్థల ద్వారా తమ జీవితకాలాన్ని పొడిగించకుండా ముందుగానే ఎవరైనా 'సజీవ వీలునామా' రాయచ్చని, అది చెల్లుబాటు అవుతుందని కూడా న్యాయమూర్తులు తెలిపారు. ప్రధాన న్యాయమూర్తితో పాటు ఈ ధర్మాసనంలో జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్ ఉన్నారు. 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసిన పిటిషన్‌ను విచారించిన తర్వాత కోర్టు ఈ ఉత్తర్వులిచ్చింది.

ఎవరికి.. ఎలా?

కారుణ్యమరణం ప్రసాదించాలన్న విషయంలో ఇన్నాళ్లూ చాలా అభ్యంతరాలుండేవి. దాదాపుగా అవయవాలలో ఏవీ పనిచేయని స్థితిలో ఉండే వారికి వెంటిలేటర్ లాంటి లైఫ్ సపోర్ట్ పరికరాలను అమర్చినంతసేపు ప్రాణం ఉంటుంది. ఆ పరికరాలను తీసేస్తే కొద్ది నిమిషాల్లోనే ప్రాణం పోతుంది. కాకపోతే.. ఎన్నాళ్లు ఇలా లైఫ్ సపోర్ట్ ఇవ్వాలన్నదే అతిపెద్ద ప్రశ్న. ఇలాంటి సందర్భాలలో రోగి దాదాపుగా జీవచ్ఛవంలా ఉన్నాడా.. లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి ఒక మెడికల్ బోర్డు సలహా కూడా తీసుకోవాలని కోర్టు ప్రస్తావించింది. సజీవ వీలునామా విషయంలో బంధువుల మధ్య ఆస్తి తగాదాలు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల ఈ విషయంలో తలెత్తే వివాదాల గురించి కూడా తమకు తెలుసని సుప్రీంకోర్టు తెలిపింది. అందువల్ల.. సజీవ వీలునామా రాయని వ్యక్తికి పరోక్ష కారుణ్య మరణం ప్రసాదించాలంటే, అప్పుడు వాళ్ల బంధువులు హైకోర్టులను ఆశ్రయించవచ్చని సుప్రీం తెలిపింది.

జడ్జిలకు నాలుగు రకాల భిన్నాభిప్రాయాలున్నా, అందరూ 'సజీవ వీలునామా' ఉండాలని ఏకగ్రీవంగా తీర్పుచెప్పారు. శరీరమంతా చచ్చుబడిపోయి, దాదాపు జీవచ్ఛవంలా ఉన్నప్పుడు వాళ్లు బతకాలని అనుకోనప్పుడు ఇంకా బలవంతంగా బతికించడం సరికాదని అన్నారు. అయితే, ఇలా 'సజీవ వీలునామా' రాయడానికి కచ్చితమైన కొన్ని నియమ నిబంధనలను మాత్రం సుప్రీంకోర్టు విధించింది. కానీ దాన్ని అమలుచేయడానికి ఎవరికి అధికారం ఉంటుందో చెప్పలేదు.

సజీవ వీలునామాలను గుర్తించాలని, ఈ విషయంలో తగు మార్గదర్శకాలు ఇవ్వాలని కామన్ కాజ్ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎవరైనా వ్యక్తులు ప్రాణాంతక వ్యాధితో బాధపడుతూ, ఇక నయం కాని స్థితికి చేరుకున్నారని వైద్యులు నిర్ణయించినపుడు.. వాళ్లను బలవంతంగా లైఫ్ సపోర్ట్ మీద ఉంచడం కంటే, మరణించే హక్కు ఇవ్వాలని కామన్ కాజ్ వాదించింది. ''తన శరీరాన్ని చిత్రహింసలు పెట్టొద్దని అడిగే హక్కు అతడికి/ఆమెకు లేదని ఎలా చెప్పగలరు? జీవించే హక్కు అంటే.. గౌరవంగా మరణించే హక్కు కూడా ఉంటుంది. వెంటిలేటర్ మీదే బతకాలని ఎవరినీ బలవంతం చేయకూడదు. ఎవరినైనా ఒకరిని కృత్రిమంగా ఇలా వెంటిలేటర్ సాయంతోనే బతికిస్తున్నారంటే, వాళ్ల శరీరం మీద దాడి చేసినట్లే'' అని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు.

పరోక్ష కారుణ్య మరణం అంటే..

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించింది. సాధారణ కారుణ్య మరణంలో అవసరమైతే విషాన్ని ఇంజెక్షన్‌గా ఇవ్వడం ద్వారా అయినా జీవితాన్ని ముగించవచ్చు. కానీ పరోక్ష కారుణ్య మరణం అంటే.. లైఫ్ సపోర్ట్ తీసేయడం మాత్రమే. అంటే ప్రత్యక్షంగా ప్రాణాలు తీయడం కాకుండా, అప్పటివరకు అందిస్తున్న వెంటిలేటర్ లాంటి లైఫ్ సపోర్ట్ తీసేసి వారికి గౌరవప్రదమైన మరణాన్ని ప్రసాదించడం అన్న మాట.

ప్రభుత్వం ఏమంది..

ఆత్మహత్యాయత్నాన్ని కూడా నేరం కాదని చెప్పడానికి సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం ఆత్మహత్యాయత్నం చేస్తే వారికి ఐపీసీ సెక్షన్ 309 ప్రకారం ఏడాది వరకు జైలు శిక్ష విధించవచ్చు. కొన్ని రకాల రక్షణ చర్యలతో పరోక్ష కారుణ్య మరణాలను ఆమోదించాలనే న్యాయ కమిషన్ 241వ నివేదిక చెబుతోందని 2016 జనవరి 15వ తేదీన కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ టెర్మినల్లీ ఇల్ పేషెంట్ (ప్రొటెక్షన్ ఆఫ్ పేషెంట్స్ అండ్ మెడి కల్ ప్రాక్టీషనర్స్) బిల్లు పేరుతో ఒక కొత్త చట్టం తేవాలని కూడా అనుకుంటున్నట్లు చెప్పింది.



కాలేజీ ముందే విద్యార్థిని హత్య

- కత్తితో దాడిచేసిన దుండగుడు
- తీవ్ర రక్తస్రావంతో కన్నుమూత

చెన్నై, మార్చి 9: చెన్నైలో ఓ కాలేజి విద్యార్థినిపై దుండగుడు కత్తితో దాడి చేశాడు. కాలేజీ నుంచి ఇంటికి వెళుతున్న యువతిని అటకాయించి కత్తితో పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై యువతి అక్కడికక్కడే కుప్పకూలింది. అనంతరం దుండగుడు తప్పించుకు పారిపోయే ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. చెన్నై కేకేనగర్‌లో జరిగిన ఈ ఘటన వివరాలు.. స్థానిక మీనాక్షి కాలేజీలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న అశ్విని రోజులాగే క్లాసులు అయిపోయాక బయటికి వచ్చింది. ఇంటికెళ్లేందుకు నడుస్తుండగా అలగేశన్ అనే యువకుడు ఆమెను అటకాయించాడు. ఇంతలో ఏమైందోగానీ వెంటతెచ్చుకున్న కత్తితీసి అశ్వినిపై దాడిచేశాడు. చుట్టుపక్కల వాళ్లు స్పందించి అక్కడికి చేరుకుని అలగేశన్‌ను బంధించి దేహశుద్ధి చేశారు. రక్తమోడుతూ కుప్పకూలిన అశ్వినిని ఆస్పత్రికి తరలించగా.. తీవ్ర రక్తస్రావం కారణంగా అశ్విని దారిలోనే మరణించిందని వైద్యులు తెలిపారు.

తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం

- ఇండోర్‌లోని షాపింగ్‌మాల్‌లో ఘటన

ఇండోర్, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మధ్యప్రదేశ్‌లో దారుణం జరిగింది. ఇండోర్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో తొమ్మిదేళ్ల బాలిక అత్యాచారానికి గురయ్యింది. ఆ షాపింగ్ మాల్‌లోని గేమింగ్ జోన్‌లో పని చేసే ఓ యువకుడు ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఇండోర్‌లో మహాత్మా గాంధీ రోడ్డులో ఉన్న ఓ షాపింగ్ మాల్‌కు బాధిత బాలిక గురువారం కుటుంబంతో సహా వచ్చింది. ఆ బాలిక మాల్‌లోని గేమింగ్‌జోన్‌లో ఆడుకుంటుండగా అక్కడ పని చేసే అర్జున్ రాథోడ్(19) అనే యువకుడు ఆ బాలికను అక్కడి ట్రెజర్ ఐలాండ్‌లోనికి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. కొద్దిసేపటికి బయటకు వచ్చిన ఆ బాలిక జరిగిన విషయాన్ని ఆమె తల్లికి వివరించింది. దీంతో ఆమె అర్జున్ రాథోడ్‌ను పట్టుకుంది.



వాయిదాల పర్వం!


- లోక్‌సభలో 5 రోజులుగా ఇదే తంతు
- రాజ్యసభలోనూ సేమ్.. 12కు వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 9: పార్లమెంటు ఉభయ సభలు 5 రోజులుగా నిరసనలు, నినాదాలతో దద్దరిల్లాయి. పలు సమస్యలు, అంశాలపై పలు పార్టీల ఎంపీలు ఆందోళన బాటపట్టడం, ఒకసారి వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభ కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఐదో రోజు శుక్రవారం కూడా లోక్‌సభలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండానే సోమవారానికి వాయిదా పడింది. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం టీడీపీ, వైసీపీ, తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంపు కోసం టీఆర్ఎస్, కావేరి నీటి యాజమాన్య బోర్డు ఏర్పాటు, విగ్రహాల ధ్వంసంపై అన్నాడీఎంకే నిరసన బాటపట్టాయి. బడ్జెట్ సమావేశాల రెండో విడతలో ఆర్థిక బిల్లు సహా కీలక బిల్లులు ఆమోదం పొందాల్సి వుంది. కాగా నిరసనలు, నినాదాలతోనే వారం గడిచిపోయింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై టీఎంసీ ఎంపీలు ఆందోళన కొనసాగించారు. కాంగ్రెస్, ఆప్, లెఫ్ట్ పార్టీల ఎంపీలు గళమెత్తారు. ఈ సమావేశాల సందర్భంగానే కేంద్ర వైఖరికి నిరసనగా టీడీపీ కేంద్ర మంత్రులు అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి పదవులకు రాజీనామా చేశారు. టీడీపీ ఎంపీలతో కలసి అశోక్ గజపతి రాజు నిరసన తెలిపారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పలు అంశాలపై విపక్ష సభ్యులు ఆందోళనతో రాజ్యసభ కార్యకలాపాలను స్తంభింపజేశారు. విభజన హామీలు నెరవేర్చాలని టీడీపీ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. డిప్యూటీ చైర్మన్ కురియన్ సభ్యులకు ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

ఒత్తిడి కూడా అంటువ్యాధే!

- ఒకరి నుంచి మరొకరికి పాకుతుంది

టొరంటో, మార్చి 9: అంటువ్యాధుల్లాగే ఒత్తిడి కూడా ఒకరి నుంచి మరొకరికి పాకుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైందని శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఇలా మరొకరి నుంచి ఒత్తిడికి లోనైన వారి మెదడులో వాస్తవంగా ఒత్తిడి వల్ల కలిగే మార్పులు యథాతథంగా జరుగుతాయని తెలిపింది. ఈమేరకు ఎలుకలపై జరిపిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైందని కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ కాల్‌గెరీ శాస్త్రవేత్తలు వివరించారు. వర్సిటీకి చెందిన భారత సంతతి శాస్త్రవేత్త జైదీప్ బైన్స్ ఈ విషయాన్ని కనుగొన్నారు. ఒత్తిడి కారణంగా మెదడులో మార్పులు చోటుచేసుకుని మానసిక అనారోగ్యాలు చోటుచేసుకుంటాయని జైదీప్ వివరించారు. ఇందులో పీటీఎస్‌డీ సహా పలు ఆందోళన సంబంధిత వ్యాధులు, మానసిక కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ఇటీవలి అధ్యయనాలలో ఒత్తిడి సహా ఇతరత్రా భావోద్వేగాలు కూడా అంటువ్యాధుల్లాగే ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయని తేలిందని చెప్పారు. అయితే, వీటివల్ల మెదడుపై దీర్ఘకాలంలో పడే ప్రభావం ఎలా ఉంటుందనే విషయంపై ఇప్పటికి స్పష్టతలేదని జైదీప్ వివరించారు.



నాగ్‌పూర్‌లో శుక్రవారం 'అఖిల భారతీయ ప్రతినిధి సభ' సమావేశాలను ప్రారంభిస్తున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

చావు కోసం.. 42 ఏళ్ల ఎదురుచూపు!

- అరుణా షాన్‌బాగ్‌పై అత్యాచారం
- మర్నాడే కోమాలోకి వెళ్లిన నర్సు
- 42 ఏళ్లు మంచానికే పరిమితం
- అప్పుడే పరోక్ష కారుణ్య మరణం ప్రస్తావన





న్యూఢిల్లీ, మార్చి 9: కారుణ్య మరణం అనేగానే గుర్తుకొచ్చే పేరు.. అరుణా రామచంద్ర షాన్‌బాగ్. న్యూఢిల్లీలోని కేఈఎమ్ ఆస్పత్రి నాలుగో నెంబరు వార్డులో జీవచ్ఛవంలా 42 ఏళ్ల పాటు ఆమె తనకు ఎప్పుడు చావు ప్రసాదిస్తారా అని ఎదురు చూసి.. చూసి.. మరణించింది. ఆస్పత్రిలో నర్సుగా పనిచేసే అరుణ 1973 నవంబరు 27వ తేదీన తన విధులు ముగించుకుని, యూనిఫాం మార్చుకుంటుండగా ఒక వార్డు బోయ్ ఆమెపై దారుణంగా అత్యాచారం చేశాడు. ఆ సమయంలో ఆమె అరవకూడదని.. మెడకు ఒక కుక్క చైను కట్టేశాడు. మర్నాటి తెల్లవారు జాము వరకు ఆమెను ఎవరూ గమనించలేదు. ఉదయం చూసేసరికి అరుణ రక్తపు మడుగులో పడి ఉంది. మెడచుట్టూ చైన్ కట్టడం వల్ల ఆమె మెదడుకు దాదాపు 8 గంటల పాటు ఆక్సిజన్ సరఫరా ఆగిపోయింది. అత్యాచారం జరగడానికి ముందు అదే ఆస్పత్రిలోని ఒక డాక్టర్ ఆమెను పెళ్లి చేసుకుందామనుకున్నారు. ఆమె మెదడుకు, వెన్నెముకకు కూడా గాయాలు కావడంతో అప్పటి నుంచి తర్వాత నాలుగు దశాబ్దాల పాటు ఆమె కోమాలోనే ఉంది. కేఈఎం ఆస్పత్రిలో ఆమె సహోద్యోగులు, ఆ తర్వాత వచ్చిన నర్సులు కూడా ఆమెను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఆమె చనిపోకుండా చూశారు. 40 ఏళ్ల కోమాలో ఉన్నా.. ఆమెకు ఒక్కసారి కూడా బెడ్‌సోర్ రాలేదు. ఆమెపై అత్యాచారం చేసిన వార్డుబోయ్ సోహన్‌లాల్ భర్తా వాల్మీకిని అరెస్టు చేసినా.. అతడిపై దొంగతనం, దాడి లాంటి కేసులు పెట్టారు తప్ప అత్యాచారం కేసు పెట్టలేదు. రెండేళ్ల జైలుశిక్ష అనుభవించి చక్కా బయటకు వచ్చాడు.

కారుణ్య మరణం కోసం పోరాటం

ప్రముఖ ఉద్యమకారిణి, పాత్రికేయురాలు, రచయిత్రి అయిన పింకీ విరానీకి అరుణా షాన్‌బాగ్ గురించి తెలిసింది. దాంతో ఆమెకు కారుణ్యమరణం ప్రసాదించాలని కోరుతూ 2009లో పింకీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అరుణ 1973 నవంబరు 27నే మరణించిందని ఆమె వాదించారు. కానీ, అరుణను చూసుకుంటున్న ఆస్పత్రి నర్సులు మాత్రం.. ఆమెను చంపడానికి వీల్లేదని, ఆమెకు కొన ఊపిరి ఉన్నంతవరకు తాము ఆమెను చూసుకుంటామని వాదించి.. కారుణ్య మరణాన్ని వ్యతిరేకించారు. దాంతో 2011లో సుప్రీంకోర్టు పింకీ విరానీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఆస్పత్రి సిబ్బంది మనసు మార్చుకుంటే బాంబే హైకోర్టు అనుమతితో లైఫ్‌సపోర్ట్ తీసేయొచ్చని చెపపింది.

న్యుమోనియాతో మరణం..

ఈ వివాదం ఇలా ఉండగానే 2015 మే 15వ తేదీన అరుణాషాన్‌బాగ్ న్యుమోనియాతో మరణించారు. అయితే.. ఆమె మరణం తర్వాత దేశవ్యాప్తంగా గౌరవముతో కూడిన మరణంపై తీవ్ర చర్చ జరిగింది. తిరిగి స్పృహలోకి రాలేని కోమాలోకి వెళ్లిన పేషెంట్లకు గౌరవపూర్వకమైన మరణం ప్రసాదించాలని వాదనలు వచ్చాయి. అప్పుడే తొలిసారిగా సుప్రీంకోర్టు కూడా 'పరోక్ష కారుణ్య మరణం' గురించి ప్రస్తావించింది.

విపక్షాలు ఏకమవ్వాలి

విభేదాలు పక్కనపెట్టాలి

- జాతిహితం కోసం 'చేయి' కలపాలి
- త్వరలో కాంగ్రెస్‌కు కొత్తరూపు
- ప్రజాస్వామ్యంలో అసమ్మతికి స్థానం
- నియంతృత్వ పోకడలకు చోటు లేదు
- రాహుల్‌కు సలహాలివ్వను..
- 'ఇండియా'టుడే సదస్సులో సోనియా



సదస్సులో ప్రసంగిస్తున్న సోనియాగాంధీ

ముంబై, మార్చి 9: ప్రజాస్వామ్యంలో అసమ్మతికి, చర్చకు స్థానం ఉంటుందని, ఏకఛత్రాధిపత్యానికి, నియంతృత్వ పోకడలకు ఎలాంటి స్థానం లేదని కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ సుస్పష్టం చేశారు. పరోక్షంగా ప్రధాని నరేంద్రమోదీ వైఖరిని తూర్పారబట్టారు. శుక్రవారం ముంబైలో నిర్వహించిన 'ఇండియా టుడే సదస్సు'లో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయాలు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, తన పిల్లలు, తనలోని లోపాలు, భారత్‌లో ప్రజాస్వామ్యం, ప్రధానిగా మన్మోహన్‌సింగ్ నియామకం, రాజీవ్‌గాంధీతో అనుబంధం తదితర అంశాలపై స్పందించారు. భారత దేశ నవ నిర్మాణంలో మహనీయుల పాత్రపై స్పందిస్తూ ఇప్పుడు వారి ప్రతిష్ఠకు మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో తమ పార్టీ సాధించిన విజయాలను మరుగునపర్చేందుకు అధికార బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోందని, ఆ మేరకు నిరంతరం ఆరోపణలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకోసం అనేక కుయుక్తులు పన్నుతోందని అన్నారు. దేశ భవిష్యత్తు కోసం భావసారూప్యమున్న పార్టీలన్నీ ఏకమవ్వాలని, ప్రాంతీయ లేదా స్థానిక విభేదాలను పక్కనపెట్టాలని అన్నారు. జాతి హితం కోసం ఏకమవ్వాలని అన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 13న విపక్షాలకు విందు ఇవ్వనున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ సరికొత్త రూపును సంతరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ సంస్థాగతంగా ప్రజలకు చేరువయ్యేందుకు నూతన శైలిని సంతరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తన కుమారుడే అయినప్పటికీ రాహుల్‌గాంధీకి సలహాలిచ్చే ప్రయత్నం చేయబోనని అన్నారు. పార్టీకి నూతన జవసత్వాలు తేవడానికి యువ నేతలు, సీనియర్ నేతలతో సమతుల్యత సాధించాలనుకుంటున్నట్లు తెలిపారు. అయితే అది అంత సులువు కాదని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల శాసనసభ ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు సమయంలో రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్ళిపోవడంపై స్పందిస్తూ.. ఎన్నికల ప్రచారం తర్వాత తన అమ్మమ్మను చూసేందుకు మూడు రోజులపాటు ఇటలీ వెళ్ళారన్నారు. ప్రస్తుతం ప్రియాంక గాంధీ తన పిల్లల బాధ్యతను నిర్వహిస్తున్నారని, భవిష్యత్తు గురించి ఎవరూ చెప్పలేరని అన్నారు.

మన్మోహన్ సమర్థుడు

ప్రధాని పదవికి నాకన్నా మన్మోహన్‌సింగే సమర్థుడని తెలుసని, అందుకే ఆ పదవికి ఆయనను ఎంపిక చేశామని సోనియా పేర్కొన్నారు. ''నా పరిధి నాకు తెలుసు. నాకన్నా ప్రధాని పదవికి మన్మోహన్ సమర్థుడైన వ్యక్తి అని నాకు తెలుసు'' అని సోనియా పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచే ఎంపీగా పోటీ చేస్తారా? అనే ప్రశ్నకు స్పందిస్తూ.. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాఅని పేర్కొన్నారు.

మూవీలు చూస్తున్నా..

''ఇప్పుడు నాకు చాలా ఖాళీ సమయం దొరుకుతోంది. పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదు. రాహుల్‌కు బాధ్యతలేమిటో తెలుసు. అవసరమైనప్పుడు మాత్రమే నేను అండగా ఉంటా. అంతేగానీ.. ప్రతి అంశంలోనూ జోక్యం చేసుకోను. సీనియర్లతో సహా పార్టీని సంపూర్ణంగా మార్చాలని కోరుకుంటున్నాను. ఇప్పుడు ఖాళీ సమయం దొరుకుతుండటంతో పుస్తకాలు చదువుతున్నాను. సినిమాలు చూస్తున్నాను. మా అత్తగారు (ఇందిరా గాంధీ), భర్త (రాజీవ్‌గాంధీ)కి చెందిన కీలక పత్రాలను సేకరిస్తున్నాను. వాటిని డిజిటలైజ్ చేస్తాం. ఇందులో ఇందిరాగాంధీ.. రాజీవ్‌గాంధీకి రాసిన లేఖలు ఉన్నాయి. అవి నాకు చాలా విలువైనవి. నాకు ఎంతో సెంటిమెంట్'' అని సోనియా పేర్కొన్నారు. కూతురు ప్రియాంక వాద్రా రాజకీయ ప్రవేశంపై స్పందిస్తూ.. ప్రియాంక ఎన్నికల సమయంలో రాయ్‌బరేలి, అమేథి వరకే పరిమితమయ్యారని చెప్పారు.

రాజీవ్‌ను కోరింది నిజమే..

తన భర్త రాజీవ్‌ను రాజకీయాల్లోకి రావద్దని కోరింది నిజమేనని సోనియా గాంధీ చెప్పారు. ఇందిర లాగే రాజీవ్ కూడా హత్యకుగురవుతారనే ఆందోళన ఎప్పటి నుంచో ఉండేదని, భయపడ్డట్లే విషాదాన్ని చూడాల్సివచ్చిందన్నారు. ''రాజకీయాల్లో ఉన్నప్పుడు ప్రజాసేవ తప్ప మిగతావన్నీ రెండో ప్రాధాన్యాలే అవుతాయి. రాజీవ్ కూడా కుటుంబానికి దూరమవుతారని ఆందోళన చెందా. కానీ అత్త(ఇందిరా గాంధీ) హత్య తర్వాత ఆయన రాజకీయాల్లోకి రాకతప్పలేదు. బహుశా రాజీవ్‌ను (రాజకీయాల్లోకి) వద్దనడం నా స్వార్థమే కావచ్చు, అయితే, ఆయన్ను చంపేస్తారేమోనని భయంకూడా మాలో ఉండేది. నా చుట్టుపక్కల అలా మాట్లాడుకోవడం చాలాసార్లు నాచెవినడేవి. చివరికి దేనిగురించైతే భయపడ్డామో అదే జరిగింది'' అంటూ ఉబికివచ్చిన కన్నీళ్లను తుడుచుకుంటూ పేర్కొన్నారు.

అందుకే ఓటమి..!

2014లో పార్టీకి సంభవించిన ఓటమిపై సోనియా స్పందిస్తూ..''రెండు దఫాలుగా అధికారంలో ఉన్నాం. ప్రజా వ్యతిరేకత ఉండటం సహజం. అయినా.. మమ్మల్ని మేం మార్కెట్ చేసుకోలేకపోయాం. నరేంద్రమోదీ ప్రచారాన్ని ఎదుర్కోలేక పోయాం'' అని అన్నారు. ప్రధాని మోదీతో సంబంధాలను ప్రస్తావిస్తూ..''మోదీతో వ్యక్తిగతంగా నాకు పరిచయం లేదు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి హయాంతో మేమిద్దరం బద్ధ శత్రువులం. అయినా.. మేం కలిసే పనిచేశాం'' అని వివరించారు.

బీజేపీకి వ్యతిరేకం కాదు.. పార్టీల దిగజారుడు తనానికే..

- ఇండియా టుడే సదస్సులో కమల్‌హాసన్



సదస్సులో కమల్‌హాసన్

ముంబై, మార్చి 8: అందరూ అనుకుంటున్నట్లుగా తాను బీజేపీకి వ్యతిరేకం కాదని, దిగజారిపోతున్న పార్టీల వైఖరికి, అతివాదానికే తాను వ్యతిరేకమని నటుడు, రాజకీయ నేత కమల హాసన్ స్పష్టం చేశారు. చెత్త విషయాలు అమోదయోగ్యమవతున్నాయని, తమిళనాడులో చోటు చేసుకుంటున్న రాజకీయాలను చూస్తుంటే బాధ కలుగుతోందని పేర్కొన్నారు. శుక్రవారం ముంబైలో నిర్వహించిన 'ఇండియా టుడే' సదస్సులో కమల్ పాల్గొని మాట్లాడారు. ''నేను బుద్ధిహీనమైన, దిగజారుడు రాజకీయాలకు తీవ్ర వ్యతరేకం. నేను వీటినే సవాలు చేస్తున్నాను. ప్రస్తుతమున్న పార్టీలు పూర్తిగా దిగజారిపోయాయి'' అని కమల్‌హాసన్ అన్నారు. తమిళనాడులో పెరియార్ విగ్రహ ధ్వంసం అతివాదానికి నిదర్శమని, కావేరి నదీ జలాల పంపకం తదితర సమస్యల నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకే ఈ దుశ్చర్యకు పాల్పడి నట్లుగా తాను భావిస్తున్నానన్నారు. ఇతర పార్టీలతో పొత్తులపై స్పందిస్తూ.. '' ఎవరితో చేతులు కలుపుతామో వేచి చూడాల్సిందే. మేమేమి ఇప్పుడు షాపింగ్ మాల్‌లో లేము'' అని పేర్కొన్నారు.

కిమ్‌తో భేటీకి ట్రంప్ ఓకే



ఉత్తరకొరియా ప్రతినిధుల బృందంతో ట్రంప్

- మే నెలలో ముఖాముఖి సమావేశం
- త్వరలో వేదిక నిర్ణయం: వైట్‌హౌజ్
- 2 దేశాల మధ్య అనూహ్య పరిణామం

వాషింగ్టన్, మార్చి 9: ఇప్పటివరకు ఉప్పునిప్పులా ఉన్న అమెరికా- ఉత్తరకొరియా సంబంధాల్లో నవశకం ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నారు. ఉత్తర కొరియా పూర్తిస్థాయిలో అణు ప్రయోగాలకు స్వస్తి పలికే విషయమై.. ఆ దేశ అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీ అయ్యేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకారం తెలిపారు. దక్షిణ కొరియా బృందం ద్వారా ట్రంప్‌నకు కిమ్ ఆహ్వానం పంపారు. ఈ మేరకు వచ్చే మే నెలలో ఇద్దరు నేతలు తొలిసారి సమావేశంకానున్నట్లు దక్షిణా కొరియా దౌత్యాధికారి వెల్లడించారు. అణ్వాయుధాల నిషేధంతో పాటు.. అణ్వస్త్రాలు, క్షిపణులను నిలిపివేసేందుకు కిమ్ కట్టుబడి ఉన్నారని, కిమ్‌తో సమావేశం వివరాలను ట్రంప్‌నకు దక్షిణ కొరియా ఉన్నతాధికారుల బృందం వివరించిన అనంతరం వైట్‌హౌస్ వద్ద దక్షిణా కొరియా నేషనల్ సెక్యూరిటీ ఆఫీస్ హెడ్ చుంగ్ యుంగ్ విలేకరులతో మాట్లాడారు.

వీలైనంత త్వరగా ట్రంప్‌తో సమావేశం కావాలని కిమ్ ఎదురుచూస్తున్నారని ఆయన చెప్పారు. సమావేశానికి సంబంధించి వివరించిన తీరును ట్రంప్ మెచ్చుకోవడంతోపాటు అణ్వాయుధాల నిర్మూలన సాధించడానికి వచ్చే మే నెలలో కిమ్‌ను కలిసి చర్చలు జరుపుతానని ట్రంప్ చెప్పినట్లు ఆయన వివరించారు. భేటీకి అంగీకారం తెలిపిన విషయాన్ని ట్రంప్ స్వయంగా ట్విటర్‌లో ప్రస్తావించడం గమనార్హం. అయితే ఎప్పుడు ఎక్కడ వీరు సమావేశం కాబోతున్నారన్నది త్వరలో వెల్లడిస్తామని వైట్‌హౌస్ తెలిపింది. కాగా..ఇద్దరి సమావేశం పూర్తయ్యేవరకు ఇప్పటివరకు ట్రంప్ ఉత్తరకొరియాపై విధించిన ఆంక్షల్లో ఎలాంటి మార్పులు ఉండవని పేర్కొంది. ఒకవేళ ఇరు దేశాల మధ్య భేటీ జరిగితే.. ఉత్తర కొరియా అధ్యక్షుడిని కలవనున్న తొలి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ నిలువనున్నారు. 70 ఏళ్లుగా అమెరికా, ఉత్తర కొరియా మధ్య ఎలాంటి స్నేహపూర్వక సత్సంబంధాలు లేవు. ఎన్నిసార్లు హెచ్చరించినా ఉత్తరకొరియా అణు, క్షిపణి ప్రయోగాలకు పాల్పడుతూనే ఉండడంతో ఇరు దేశాల మధ్య శత్రుత్వం పెరుగుతూ వచ్చింది. కిమ్‌పై ఆగ్రహంతో ట్రంప్ 'అణు' దేశంపై ఆంక్షలు విధించారు.


హర్షం వ్యక్తం చేసిన జపాన్..

చర్చలకు రావాలని అమెరికాను కిమ్ ఆహ్వానించడంపై జపాన్ ప్రధాని షింబో అబే హర్షం వ్యక్తం చేశారు. ''ఇది అనూహ్య పరిణామం. ఉత్తరకొరియా వైఖరిలో మార్పు వచ్చింది. ఇది చాలా మంచి పరిణామం. అణ్వస్త్ర నిరాయుధీకరణ లక్ష్యంగా వారి మధ్య చర్చలు జరగాలి'' అని అబే అభిప్రాయపడ్డారు.

విప్లవ్ దేవ్ ప్రమాణ స్వీకారం


- త్రిపుర ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- మోదీ.. అద్వానీ.. మాణిక్ హాజరు
- ఎన్నడూ చూడని అభివృద్ధి చేస్తా: విప్లవ్
- కేంద్ర సహకారం ఉంటుంది: ప్రధాని మోదీ





అగర్తల, మార్చి 9: త్రిపుర ముఖ్యమంత్రిగా విప్లవ్ కుమార్ దేవ్ ప్రమాణ స్వీకారం చేశారు. పాతికేళ్ల అప్రతిహతంగా సాగిన వామపక్ష ప్రభుత్వాన్ని దించి రాష్ట్రంలో తొలి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 11వ ముఖ్యమంత్రిగా విప్లవ్ కుమార్ దేవ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అగర్తలలోని అసోం రైఫిల్స్ మైదానంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తథాగథ రాయ్ నూతన మంత్రివర్గంతోనూ ప్రమాణం చేయించారు. బీజేపీ నేత జిష్ణు దేవ్ వర్మ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అలాగే మరో ఏడుగురు మంత్రులతో కేబినెట్ ఏర్పాటు చేశారు. ఇందులో బీజేపీతో కలిసి మిత్రపక్షంగా పోటీ చేసిన ఐపీఎఫ్‌టీ చీఫ్ ఎన్‌సీ దేవ్ వర్మాన్ సహా ఆ పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యేకి మంత్రిగా అవకాశం కల్పించారు. బీజేపీకి చెందిన ఓ మహిళా సభ్యురాలు శాంతన చక్మాను మంత్రిగా తీసుకున్నారు. కాగా, బీజేపీకి చెందిన మహామహుల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, పార్టీ సీనియర్ నేతలు అద్వానీ, మురళీ మనోహర్ జోషి, కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం నేత మాణిక్ సర్కార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అద్వానీ, జోషిల మధ్య ఆయన ఆసీనులయ్యాయరు. గురువారం నాడు బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌తో కలిసి విప్లవ్ దేవ్ ఆయన ఇంటికి వెళ్లి ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అలాగే బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు విజయ్ రూపానీ (గుజరాత్), శివరాజ్ సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్), శర్వానంద సోనోవాల్ (అసోం), రఘువర్ దాస్ (జార్ఖండ్) కూడా విప్లవ్ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. కాగా, త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 35, ఐపీటీఎఫ్ 8, సీపీఎం 16 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. త్రిపురలో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వానికి కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తాము సహకరిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు.

ఐ లవ్ మాణిక్‌జీ



త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ అంటే తనకు ఎంతో అభిమానమని విప్లవ్ దేవ్ అన్నారు. సీఎంగా ప్రమాణం చేయడానికి కొద్ది నిమిషాల ముందు విప్లవ్ దేవ్ మీడియాతో మాట్లాడారు. 'త్రిపుర ప్రజలే నాకు స్ఫూర్తి. వారినే సర్వస్వంగా భావిస్తా. నా ప్రజలు మునుపెన్నడూ చూడని అభివృద్ధిని తప్పక చేసి చూపిస్తా. సీపీఎం అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. నేను మాత్రం త్రిపురయే శ్వాసగా జీవిస్తాను. నాకు కమ్యూనిస్టులన్నా.. మాణిక్ సర్కార్ అన్నా కూడా ప్రేమే. ఐ లవ్ మాణిక్ సర్కార్‌జీ' అని చెప్పారు.



చైనాలో 'సైరా' అనబోతున్న చిరంజీవి

చిరంజీవి కథానాయకుడిగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై హీరో రామ్‌చరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. స్వాతంత్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులోని కొన్ని కీలక సన్నివేశాలను చైనాలో చిత్రీకరించాలని చిత్ర యూనిట్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అంతే కాకుండా ఈ సినిమాని చైనాలో కూడా భారీగా రిలీజ్ చేస్తారని సమాచారం. తెలుగు ప్రేక్షకులతో పాటు చైనా ప్రేక్షకులనూ మెప్పించేలా సినిమాను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ కేరళలోని కొచ్చిలో జరగనుంది. 200 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్.. సైరా గురువు పాత్రలో కనిపిస్తారు. విజయ్ సేతుపతి, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిరంజీవికి జోడీగా నయనతార నటిస్తున్నారు. ఈ సినిమా చైనాలో షూటింగ్ జరుపుకోవడంతోపాటు అక్కడ కూడా రిలీజ్ చెయ్యాలని యూనిట్ భావించడం మెగా అభిమానులకు ఆనందాన్ని కలిగించే విషయమే.

ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి

– ఆర్.నారాయణమూర్తి



డిజిటల్ సర్వీస్ రేట్లు తగ్గించాలంటూ సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీ అంతా ఒక తాటిమీద కొచ్చి మార్చి 2వ తేదీ నుండి థియేటర్స్ బంద్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వారు, తెలుగు ఫిలిం చాంబర్ వారు సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం ఈ శుక్రవారం నుండి థియేటర్స్ బంద్‌ని విరమింపజేశారు. ఈ సందర్భంగా తెలంగాణా ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ ఈరోజు ఫిలించాంబర్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ ''తమిళం, మలయాళం, కన్నడ భాషల చిత్ర పరిశ్రమల్లో ఇంకా థియేటర్స్ బంద్ కొనసాగుతుంటే మన తెలుగు ఫిలించాంబర్ వారు అప్పుడే థియేటర్స్ బంద్‌ను ఎందుకు ఆపాల్సి వచ్చింది. ఐదేళ్ల తర్వాత ఫ్రీగా ఇస్తామంటూ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఇచ్చిన హామీలు అమలు కాకముందే ఎందుకు హఠాత్తుగా బంద్ విరమించు కున్నారు. మీ ప్రయోజనాలకోసం, మీ స్వార్థం కోసం బంద్‌ని హఠాత్తుగా ఆపేస్తారా? ఈ బంద్ వల్ల సాధించింది ఏంటి? దీనికోసమైతే సురేష్ బాబు, జెమిని కిరణ్ , అల్లు అరవింద్‌లాంటి పెద్దలు బంద్ వరకు వెళ్లకుండా ముందే మాట్లాడి సెటిల్ చేస్తే సరిపోయేది కదా? థియేటర్స్ బంద్ దాకా వెళ్లాల్సిన పనేంటి? గతంలో డా.రామా నాయుడు గారు, దాసరి నారాయణ రావు వంటి పెద్దలు పదిమంది నిర్మాతల మంచి కోరేవారు తప్ప తమ స్వార్థం కోసం ఎప్పుడూ ఆలోచించలేదు. ఇకనైనా తెలుగు రాష్ట్రాల సినిమాటో గ్రఫీ మంత్రులు ఈ విషయంలో చిన్న చిత్రాల నిర్మాతలకు న్యాయం చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ''పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థ మీద పోరాడుతున్నాం. పెద్దల సపోర్ట్ లేక మేము సక్సెస్ కాలేకపోయాం. ఫ్రీగా ఇచ్చే దాకా థియేటర్స్ బంద్ ఆపబోమని చెప్పి ఇలా రెండు వేల రూపాయలు తగ్గించగానే థియేటర్స్ బంద్ ఆపేసారు. ఇది కాదు మేము కోరుకున్నది. మొత్తం ఫ్రీగా ఇవ్వాలి లేదా మీరు తప్పుకుంటే మేము వేరే కంపెనీలతో ముందుకెళ్తాం. ఇద్దరు ముగ్గురి ప్రయోజనాల కోసం ఇలా బంద్ విరమించుకోవడం కరక్ట్ కాదు. దీనిపై ఒకసారి పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే ప్రభుత్వం కూడా ఈ విషయంలో జోక్యం చేసుకొని అందరికీ మంచి జరిగేలా చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు.



● వెంకటేశ్ కొత్త లుక్





మనం రివ్యూ

చిత్రం: 'ఏ మంత్రం వేసావె'

మంత్రం పారలేదు

'పెళ్ళి చూపులు'తో సోలో హీరోగా తొలి విజయాన్ని అందుకున్న విజయ్ దేవరకొండ.. గతేడాది విడుదలైన 'అర్జున్‌రెడ్డి'తో ఓవర్ నైట్ స్టార్ అయిపోయారు. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న యువ కథానాయకులలో విజయ్ ఒకరు. ఇదిలా ఉంటే.. 'పెళ్ళి చూపులు' కంటే ముందు.. హీరోగా నిలదొక్కుకోవాలనే ప్రయత్నంలో విజయ్ చేసిన సినిమాలలో 'ఏ మంత్రం వేసావె' ఒకటి. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ సినిమా.. చాలా ఆలస్యంగా తెరపైకి వచ్చింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం..

కథాంశం

నిఖిల్ (విజయ్ దేవరకొండ) ఆన్‌లైన్ గేమింగ్స్ తప్ప మరో లోకం తెలియని యువకుడు. నిమిషానికో కొత్త ప్రపంచం.. సెకనుకో థ్రిల్ ఇచ్చే ఈ గేమింగ్స్‌లో ఉండే ఎగ్జయిట్‌మెంట్స్ రియల్ లైఫ్‌లో ఉండవన్నది అతని ఫీలింగ్. అతన్ని ఈ ప్రపంచంలోకి తీసుకురావడానికి తల్లిదండ్రులు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం ఉండదు. అలాంటి నిక్కీ.. గేమ్ డిజైనర్ రాగ్స్ అలియాస్ రాగమాలిక (శివానీ సింగ్)ను ఆన్ లైన్‌లో చూసీ చూడగానే ప్రేమలో పడిపోతాడు. ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపితే.. రాగ్స్ యాక్సెప్ట్ చేయదు. మరికొన్ని ప్రయత్నాలు చేశాక.. రాగ్స్ ఛాటింగ్‌లోకి వస్తుంది. రియల్ గేమ్ ఒకటి ఆడుదాం.. అందులో గెలిస్తే నీతో నేరుగా మాట్లాడతాను అని కండీషన్ పెడుతుంది. నిక్కీ కూడా అందుకు ఒప్పుకుంటాడు. తీరా రాగ్స్‌ను కలిసే సమయంలో.. ఆమె ఓ ప్రమాదంలో ఉందని నిక్కీకి అర్థమవుతుంది. ఇంతకీ ఆ ప్రమాదం ఏమిటి? చివరికి నిక్కీ, రాగ్స్ కలుసుకుంటారా? ఆన్‌లైన్ గేమింగ్ ప్రపంచం నుంచి నిక్కీ బయటపడ్డాడా? లేదా? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం.

విశ్లేషణ

యువతపై సోషల్ మీడియా ప్రభావం, ఆన్‌లైన్ గేమింగ్స్, సైబర్ క్రైమ్స్.. ఇలా పలు అంశాలతో రూపుదిద్దుకున్న చిత్రమిది. ఎంచుకున్న కథాంశం బాగున్నా.. తెరపై ఆవిష్కరించిన విధానం మాత్రం మెప్పించలేకపోయింది. హీరోయిన్ ఇచ్చే క్లూస్ ఆధారంగా ఆమెని కలుసుకోవడానికి హీరో చేసే ప్రయత్నం బాగున్నప్పటికీ.. సుదీర్ఘంగా సాగి విసిగిస్తుంది. ఇక ఇంటర్వెల్, క్లైమాక్స్ మినహా హీరో హీరోయిన్లు కలిసే సందర్భాలు సినిమాలో మరెక్కడా ఉండవు. వాటిని కూడా ఆసక్తికరంగా చెప్పలేకపోయాడు దర్శకుడు. సినిమాలో సందేశం ఉన్నా.. అది బలవంతంగా రుద్దుతున్నట్లుగా ఉంటుంది. ప్రధానంగా యువతని లక్ష్యంగా చేసుకుని తెరకెక్కించిన సినిమా అయినప్పటికీ.. వారిని కూడా ఆకట్టుకోవడంలో విఫలమైందనే చెప్పాలి. మొత్తానికి షార్ట్ ఫిల్మ్‌కు ఎక్కువ.. సినిమాకు తక్కువ అన్నట్లుగా ఈ చిత్రం ఉందని చెప్పొచ్చు.

నటీనటుల విషయానికి వస్తే.. ఈ సినిమాకి ఏకైక ఆకర్షణ కథానాయకుడు విజయ్ దేవరకొండ అనడంలో ఎలాంటి సందేహం లేదు. కెరీర్ ప్రారంభించిన కొత్తల్లో చేసిన సినిమా అయినప్పటికీ.. తన నటనతో మెప్పించాడు విజయ్. కథానాయిక శివానీ సింగ్ కొన్ని చోట్ల కత్రినా కైఫ్‌లా కనిపిస్తుంది. నటన పరంగా ఫర్లేదని పిస్తుంది. మిగిలిన నటీనటుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే.. అబ్బుత్ సమత్ సంగీతంలో టైటిల్ సాంగ్ వినసొంపుగా ఉంది. నేపథ్య సంగీతం అక్కడక్కడా ఓకే అనిపిస్తుంది. శివారెడ్డి కెమెరా వర్క్ ఆకట్టుకోవడంలో విఫలమైంది. ఈ సినిమాలో గుర్తుంచుకోదగ్గ డైలాగ్ ఒక్కటీ లేదు. నిర్మాణ విలువలు నాసి రకంగా ఉన్నాయి.

చివరగా: మంత్రం పారలేదు

రేటింగ్ : 1.5/5



● సిమ్రాన్

'హాస్యనట బ్రహ్మ'నందం

1100 చిత్రాల్లో కమెడియన్‌గా నటించి మెప్పించిన నటుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత, డా. బ్రహ్మానందంకు హాస్యనట బ్రహ్మ అనే బిరుదును కాకతీయ కళావైభవ మహోత్సవంలో ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో..టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ''కాకతీయ లలిత కళాపరిషత్తు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వైభవంగా అప్పటి కాకతీయుల ఖ్యాతిని తెలియజేయాలనే ఉద్దేశంతో మహబూబ్ నగర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సభాపతి సిరికొండ మధుసూదనాచారి, ఎస్.జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతుంటే.. జూపల్లి కృష్ణారావు, డా.సి.లక్ష్మారెడ్డి తదితరులు గౌరవ అతిథులుగా హాజరు కానున్నారు. పలువురిని కాకతీయ అవార్డులతో సత్కరిస్తాం'' అన్నారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ''బ్రహ్మానందం గురించి తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారుండరు. మహబూబ్‌నగర్ లో జరుగనున్న ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తాం'' అన్నారు. డా.బ్రహ్మానందం మాట్లాడుతూ ''కళలకు ఎల్లలు లేవు. ఆ దేవుడి దయ వల్ల ఎన్నో అవార్డులను స్వీకరించినప్పటికీ.. రేపు నేను తీసుకోబోయే అవార్డు విశిష్టమైనదిగా నాపూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను'' అన్నారు. ఈ కార్యక్రమంలో త్రివిక్రమ్ శ్రీనివాస్, అలీ తదితరులు పాల్గొన్నారు.

శౌర్యతో మరో కిరాక్ భామ

రీసెంట్‌గా రిలీజైన 'ఛలో'తో యువ కథానాయకుడు నాగశౌర్య హీరోగా, నిర్మాతగా సక్సెస్ అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు నాగశౌర్య తన తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో శౌర్య సరసన సిమ్రాన్ పరింజ హీరోయిన్‌గా నటించనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇంతకు ముందు 'కన్నడ కిరాక్ పార్టీ' హీరోయిన్ రష్మిక మండన్నాతో కలిసి 'ఛలో' చిత్రంలో నటించారు శౌర్య. ఇప్పుడు తెలుగు 'కిరాక్ పార్టీ' హీరోయిన్ సిమ్రాన్ పరింజతో కలిసి నటించనున్నారు. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక సమాచారం వెలువడనుంది. శ్రీనివాస చక్రవర్తి ఈ చిత్రానికి దర్శకుడు.

ఛల్ ఛల్ గుర్రం



● నిరూప్ భండారి, అవంతిక

'రాజరథం' చిత్రానికి సంబంధించిన మూడో పాట విడుదలైంది. 'చల్ చల్ గుర్రం' అంటూ సాగే ఈ పాటను శుక్రవారం విడుదలైంది. ఎంతో మంది నటులకు డబ్బింగ్ చెప్పిన బొమ్మాళి రవిశంకర్ ఈ పాట పాడడం విశేషం. ఈ పాటని మహాబలేశ్వర్, పూణేలోని మాల్షెజ్ ఘాట్ వంటి అందమైన ప్రదేశాలలో కనువిందుగా చిత్రీకరించారు. దర్శకుడు అనూప్ భండారి సహజమైన మంచు కోసం మాల్షెజ్ ఘాట్‌ని ఎంచుకున్నారు. 'రాజరథం' కోసం దిలీప్‌రాజ్ ప్రత్యేకంగా డిజైన్ చేసి తయారు చేసిన పాతకాలపు సైడ్ కార్ ఉండే స్కూటర్ ఈ పాటకి అదనపు ఆకర్షణ. ఈ స్కూటర్ మనల్ని పాత జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లడం ఖాయం. ఇప్పటి వరకు విడుదలైన రెండు పాటల ట్యూన్లతో సరిపోయేలా ఉండే ఈ 'చల్ చల్ గుర్రం' సాహిత్యంలో చాలా అరుదైన తెలుగు పదాలని సినిమా కథకి సరిపోయేలా ఉపయోగించారు. రామజోగయ్యశాస్త్రి పదాల అల్లిక, అనూప్ భండారి స్వరపరిచిన బాణీ వలన ఈ పాట వీనుల విందుగా ఉంటూ సాహిత్య పరంగా ప్రత్యేకతని చాటుకుంది. జాలీ హిట్స్ నిర్మాణంలో తెరకెక్కిన 'రాజరథం' మార్చి 23న విడుదల కానుంది.

వేసవిలో నాలో ప్రేమ నువ్వేనా



జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై వాసు దేవ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం ''నాలో ప్రేమ నువ్వేనా''. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇటీవల ఈ చిత్ర లోగోను ప్రముఖ సినిమాటోగ్రఫర్ చోటా కె.నాయుడు ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు వాసుదేవ్ మాట్లాడుతూ '''నాలో ప్రేమ నువ్వేనా' న్యూ ఏజ్ లవ్ స్టోరీ. ప్రేమ కథా చిత్రాల్లో వైవిధ్యంగా ఉంటుంది. ఛోటాగారు చిత్ర లోగోను ఆవిష్కరించారు. త్వరలోనే పాటలను విడుదల చేస్తాం. నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. వేసవిలో సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.



'దెయ్యం చెప్పిన కథ' ఏమిటి?

బేబి చైత్ర సమర్పిస్తోన్న చిత్రం దెయ్యం చెప్పిన కథ. ఆరాధ్య ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. శివ, సుప్రియ, సురేశ్ జెండా, సునీల్, పద్మ కీలక పాత్రధారులు. పెనాక దయాకర్‌రెడ్డి నిర్మాత. ప్రదీప్ రాజ్ దర్శకుడు. ఈ చిత్రం ఆడియో హైదరాబాద్‌లో గురువారం ఉదయం విడుదలైంది. సాగర్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయివెంకట్, ఎస్వీ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని బిగ్ సీడీని విడుదల చేశారు. సాగర్ మాట్లాడుతూ ''అప్పట్లో దెయ్యం చెప్పిన సాక్ష్యం అని ఒక సినిమా వచ్చింది. ఈ సినిమా పేరు వినగానే నాకు అది గుర్తుకొచ్చింది'' అన్నారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ ''దెయ్యం చెప్పిన కథ అనే టైటిలే వెరైటీగా ఉంది. ఇంకా కష్టపడి పబ్లిసిటీ చేసుకుని విడుదల చేసుకోవాలి'' అని అన్నారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ ''కొత్త సబ్జెక్ట్‌తో తెరకెక్కించిన చిత్రమిది. అందరినీ కొత్తవారిని ఈ సినిమా ద్వారా పరిచయం చేశాం'' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ ''మంచి ప్రయత్నం చేశాం. అందరూ ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాం'' అని అన్నారు.

వరసిద్ధి వినాయకుడి సాక్షిగా..

- మంత్రిగా ఎలాంటి అవినీతికీ పాల్పడలేదు
- కాణిపాకంలో కామినేని సత్యప్రమాణం



చిత్తూరు, మార్చి 9: రాష్ట్ర మంత్రిగా తాను ఎలాంటి అవినీతికి, అక్రమాలకు పాల్పడలేదంటూ కామినేని శ్రీనివాస్.. చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో సత్య ప్రమాణం చేశారు. శుక్రవారం ఆయన కాణిపాకం ఆలయాన్ని సందర్శించి ప్రమాణం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాణం చేయడంతో తన ఆత్మస్థయిర్యం మరింత పెరిగిందని అన్నారు. మంత్రి పదవిలో ఉండగా ఎలాంటి అవినీతికి, అక్రమాలకు పాల్పడలేదని చెప్పేందుకు కాణిపాకం వచ్చానని కామినేని శ్రీనివాస్ చెప్పారు. బీజేపీ అధిష్ఠానం నిర్ణయం మేరకే మంత్రి పదవికి రాజీనామా చేశామని కామినేని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం నుంచి వైదొలిగినా టీడీపీ ఇంకా ఎన్డీయేలో కొనసాగుతోందని స్పష్టం చేశారు. తాజా రాజకీయ పరిణామాల్లో కేంద్రం నుంచి టీడీపీ మంత్రులు అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి, రాష్ట్రం నుంచి బీజేపీ మంత్రులు కామినేని శ్రీనివాస్, మాణిక్యాల రావు వైదొలిగిన సంగతి తెలిసిందే.

జనసేనలోకి మాదాసు గంగాధరం

పవన్ సమక్షంలో మాజీ ఎమ్మెల్సీ చేరిక.. పార్టీ ఆవిర్భావ సభ బాధ్యతల అప్పగింత



హైదరాబాద్, మార్చి 9 (మనం ప్రతినిధి): ఏపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం జనసేనలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో అధినేత పవన్ కల్యాణ్ ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 14న గుంటూరులో నిర్వహించే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ పర్యవేక్షణ బాధ్యతను ఆయనకు అప్పగించామని పవన్ వెల్లడించారు. 'మాదాసు గంగాధరం మా కుటుంబ మిత్రులు. 30 ఏళ్లుగా ఆయనతో పరిచయం ఉంది. ఎమ్మెల్సీగా, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. జనసేనలోకి రావాలని ఆయన్ను ఆహ్వానించగా, అంగీకరించారు. ఆయన అనుభవం, సలహాలు, సూచనలు పార్టీకి అవసరం'' అని పవన్ అన్నారు. ఈ సందర్భంగా మాదాసు గంగాధరం మాట్లాడుతూ.. పవన్ నిబద్ధత తనకు తెలుసని అన్నారు. పవన్ తండ్రి వెంకట్రావు నెల్లూరులో ఉద్యోగంలో చేస్తున్న నాటి నుంచే వారి కుటుంబంతో పరిచయం ఉందని, అలా చిన్నతనం నుంచే తెలుసని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశానని, పవన్‌తో కలసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఏ బాధ్యత అప్పగించినా పనిచేస్తానని చెప్పారు.

రాజీపడేది లేదు

నేను ఎవరితోనూ విభేదించను.. యూసీలు పంపలేదని కేంద్రం సాకులు

- రైతుల త్యాగనిరతికి గౌరవం ఇవ్వలేదు
- హేతుబద్ధత లేకుండా రాష్ట్ర విభజన
- ఆరంభంలో చాలా కష్టాలు పడ్డాం
- ఉండేందుకు కార్యాలయాలే లేవు
- కష్ట సమయంలో బాగా పనిచేశారు
- పనిచేసేవారికి పూర్తి ప్రోత్సాహం
- అదనపు బాధ్యతలు అప్పగిస్తాం
- హెచ్‌ఓడీలతో చంద్రబాబు వీసీ



అమరావతి, మార్చి 9 (మనం ప్రతినిధి): కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు తీసుకొచ్చే విషయంలో రాజీలేకుండా పోరాటం చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఆయా శాఖల ఉన్నతాధికారులతో (హెచ్‌ఓడీ) చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విభజన నాటి పరిస్థితులు, ఇప్పుడు జరుగుతున్న రాజకీయ పరిణామాలను అధికార యంత్రాంగానికి ఆయన వివరించారు. ''విభజన తర్వాత హేతుబద్ధత లేని పంపకాల వల్ల కష్టాలు పడ్డాం. ఆరంభంలో అధికారులు కూడా చాలా ఇబ్బంది పడ్డారు. ఉండేందుకు కార్యాలయాలే లేవు. మూడున్నరేళ్లుగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నాం. జరిగిన అన్యాయంపైనా కేంద్రంతో పోరాడాం. విధిలేని పరిస్థితుల్లోనే కేంద్రమంత్రులతో రాజీనామా చేయించాం. నేను ఎవరితోనే విభేదించదలుచుకోవడం లేదు'' అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రానికి పంపించిన నిధుల గురించి ఎప్పటికప్పుడు తాను యూసీలను కేంద్రానికి పంపుతూనే ఉన్నామని, అయితే ఇప్పుడు కేంద్రం, రాష్ట్రం యూసీలు పంపలేదని సాకులు చెబుతోందన్నారు. ఈఏపీల ద్వారా నిధులు ఇస్తామని చెప్పిన కేంద్రం, ఏడాదిన్నర అయినా ఇప్పటివరకు ఏమీ ఇవ్వలేదని ఆరోపించారు.

33 వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేసి ఇస్తే వారి త్యాగనిరతికి కనీస గౌరవం ఇవ్వకుండా రాజధానికి నిధుల కేటాయింపులో మొండిచెయ్యి చూపించిందని విమర్శించారు. రాష్ట్రానికి సాయం చేయాల్సింది పోయి ఎదురుదాడికి దిగుతున్నట్టుగా కేంద్రం వైఖరి ఉందన్నారు. హుద్ హుద్ తుపానుకు ప్రధానమంత్రి రూ. వెయ్యి కోట్ల సాయం ప్రకటిస్తే అందులో రూ.650 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు.

భూధార్ వేగవంతం చేయాలి...

ప్రజాసాధికార సర్వే, భూధార్, ఈ-ప్రగతి, రియల్‌టైమ్ గవర్నెన్స్, కాంప్రిహెన్సివ్ ఫైనాన్స్ సిస్టమ్ తీసుకురావడంతో అనూహ్య ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. జీఏడీ కార్యదర్శి శ్రీకాంత్ బాగా పనిచేసి అంతర్గత వ్యవహారాల్లో ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారంటూ ముఖ్యమంత్రి ప్రశంసించారు. భూధార్‌ను వేగవంతంగా అమలుచేయాలని అధికారులను కోరారు. అటవీశాఖ గ్రీన్ కవర్‌లో మంచి ఫలితాలు సాధించిందన్నారు. 2,150 చ.కి. విస్తీర్ణంలో పచ్చదనాన్ని అదనంగా పెంచి దేశంలోనే రాష్ట్రాన్ని ముందు నిలిపిందన్నారు. దేశంలో ఉన్న అత్యుత్తమ పంచాయతీల్లో మనవే ఎక్కువ ఉన్నాయని తాజా గణాంకాలను వివరించారు.

గ్లోబల్ బెంచ్‌మార్కులు పెట్టుకోవాలి

''అన్ని అంశాల్లో గ్లోబల్ బెంచ్ మార్కులు పెట్టుకోవాలి. థర్డ్ పార్టీ ఎవాల్యుయేషన్ చేయించాలి. జాతీయ, అంతర్జాతీయ సంస్థల అక్రిడిటేషన్ సాధించాలి. మనం తీసుకుంటున్న చర్యలు, చేపట్టిన కార్యక్రమాల వల్ల వ్యవసాయ రంగంలో అత్యధిక వృద్ధిని సాధించే అవకాశం ఉంది. సేవలు, పరిశ్రమల రంగంలో కాస్త వెనుకబడి ఉన్నాం. వ్యవసాయంలో వచ్చిన అత్యధిక వృద్ధితో మొత్తంమీద రెండంకెల వృద్ధి సాధించాం. మూడేళ్ల 9 నెలల్లో తలసరి ఆదాయం రూ. 50 వేలు పెంచగలిగాం'' అని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు.

కష్టకాలంలో అధికారుల అండ


పాలనా వ్యవహారాల్లో కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా తీసు కుంటున్న చర్యల వల్ల పని సామర్థ్యం పెరిగిందని చంద్రబాబు అన్నారు. పని చేసేవారిని పూర్తిగా ప్రోత్సహించి, అదనపు బాధ్యతలు అప్పగిస్తామని వెల్లడించారు. కష్ట సమయంలో అధికారులు బాగా పనిచేస్తున్నారంటూ అభినందనలు తెలిపారు. ఆక్వాకల్చర్, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రంలో ప్రగతి కనిపిస్తోందని.. ఇదంతా మన విజన్, మన పట్టుదల వల్లే సాధ్యమైందన్నారు. నరేగా నిధులను సం పూర్ణంగా వినియోగించుకోవడంలోనూ దేశంతో తామే ముందున్నా మన్నారు. ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా సమర్థుడైన నాయకుడు ఉండే ఫలితాలు అవే కనిపిస్తాయన్నారు. కేంద్రం నుంచి తగిన ఊతం లేకపోయినా నాయకత్వం సమర్థంగా ఉన్నప్పుడు ఫలితాలు బాగానే వస్తాయనటానికి ఇదే నిదర్శనమన్నారు. ఒకరికొకరు శాఖల సమన్వయం చేసుకుని పనిచేయడంలో టీమ్ ఏపీ విజయవంతమవుతోందన్నారు.



మోదీ.. మూడిందా?

తెలుగువారి ఆత్మగౌరవ నాడి తెలియదా?

- ఇలానే ఉంటే మీ పని అవుట్: శివప్రసాద్
- పార్లమెంట్ ఆవరణలో టీడీపీ ఎంపీల ధర్నా
- వైసీపీ ఎంపీలు రాజీనామా చేసి ప్రజల్లోకి రండి
- నేను రాజీనామాకు సిద్ధం: జేసీ దివాకర్ రెడ్డి



న్యూఢిల్లీ, మార్చి 9: విభజన హామీలు అమలు చేయాలని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఎంపీలు వరుసగా ఐదో రోజు శుక్రవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట ఎంపీలు ధర్నాకు దిగారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్‌గజపతిరాజు టీడీపీ ఎంపీలతో కలసి ధర్నాలో పాల్గొన్నారు. రోజుకో వేషధారణలో వినూత్నరీతిలో నిరసన తెలుపుతున్న టీడీపీ ఎంపీ శివప్రసాద్.. కోయదొర వేషంతో పార్లమెంటుకు వచ్చారు. ''కొండదొర ఆన.. కుర్రో కుర్రు.. నా మాట వినకపోతే అంతే. ఇందిరా గాంధీకి చెప్పినా.. ఎన్టీఆర్‌తో పెట్టుకోవద్దని. నా మాట వినలేదు. ఏం జరిగిందో అందరికీ తెలుసు. సోనియా గాంధీతో చెప్పినా.. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని.. నా మాట వినకుండా విభజన చేశారు. ఇప్పుడు ఆ పార్టీ ఎన్ని కష్టాలు పడుతుందో అందరికీ తెలుసు. మోదీ.. సఖ్యంగా ఉండేది ఇష్టం లేదా? మీకు మూడిందా ఏంది? తెలుగు ప్రజల ఆత్మగౌరవ నాడి తెలియలేదా ఏంది? ఇలానే ఉంటే మీ పని పుర్రోపుర్రు. దీని అర్థం ఇంగ్లీష్‌లో అవుట్' అని ఎంపీ శివప్రసాద్ అన్నారు.

విజయసాయి రెడ్డి రాజీనామా చేయాలి: జేసీ

ఎంపీ పదవికి రాజీనామా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని జేసీ దివాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ ఎంపీలు రాజీనామా చేసి రావాలని, ప్రజల్లోకి వెళ్దామని సవాల్ విసిరారు. మొదట వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఎంపీల వ్యాఖ్యలు మీడియా కోసం మాట్లాడినవేనని, వారిలో చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. కేంద్రంతో తలాఖ్ అయిపోయిందని.. ప్రధాని మోదీని కలిసి ప్రయోజనం లేదని అన్నారు. అయితే భార్యాభర్తలు విడిపోయినంత మాత్రాన పిల్లల అతీగతీ చూడద్దా అని దివాకర్ రెడ్డి అన్నారు. అప్పుడప్పుడు పోయి మాట్లాడుకుంటారని, పిల్లల కోసం ఏం చేయాలో ఇద్దరూ కలిసి ఆలోచిస్తారని, అలాంటి సంసారమే తమదని టీడీపీ, బీజేపీ పొత్తుపై ఆయన వ్యాఖ్యానించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు


- కందులు, మినుములు, శెనగలు
- ప్రతి రైతు నుంచి 25 క్వింటాళ్లు
- మంత్రి ఆదినారాయణ రెడ్డి



అమరావతి, మార్చి 9: రాష్ట్రంలో రైతుల సమస్యలను గుర్తించి, వారికి కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి వెల్లడించారు. కందులు, మినుములు, శెగలు పండించిన ప్రతి రైతు నుంచి 25 క్వింటాళ్ల వరకూ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఏప్రిల్ 15 వరకూ ఈ కొనుగోళ్లు కొనసాగేలా ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి వివరించారు. కొనుగోళ్లకు నిర్ణయించిన గడువును అవసరాన్ని బట్టి సమీక్షించి పొడిగిస్తామని తెలిపారు. ప్రభుత్వం రైతుల పట్ల ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందని, రైతు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. రైతు సమస్య ఏదైనా పరిష్కారానికి ప్రభుత్వం ముందుంటుందని చెప్పారు.

పురావస్తు అధ్యయనాలపై సెమినార్

12 నుంచి నాగార్జున వర్సిటీలో: వాణీమోహన్



విజయవాడ, మార్చి 9 (మనం న్యూస్): దక్షిణా సియా దేశాలలో పురావస్తు శాఖ తవ్వకాలలో కనుగొన్న నాగరికతపై ఈ నెల 12 నుంచి 14 వరకూ నాగార్జున యూనివర్సిటీలో జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్ కమిషనర్ వాణీ మోహన్ తెలిపారు. శుక్రవారం బాపు మ్యూజియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నాగార్జున వర్సిటీలోని ఆచార్య వేణుగోపాల్ రెడ్డి హాల్‌లో నిర్వహించే ఈ సెమినార్‌లో దక్షిణాసియాలో ఇటీవలి కాలంలో జరిగిన తవ్వకాలలో లభించిన ఆధారాలను బట్టి ఆయా ప్రాంతాలలో నాగరికత ఆచార వ్యవహారాల గురించి ప్రసంగిస్తారని తెలిపారు. నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతంతో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాలలో అనేక వస్తువులు లభించాయని, వాటిపై పరిశోధనలు జరిగాయన్నారు. ఆ వివరాలు కూడా సెమినార్ తెలియజేస్తారని చెప్పారు. సెమినార్‌లో నాగార్జున వర్సిటీ చరిత్ర పరిశోధకులు కె. పెద్దయ్య, డక్కన్ కళాశాల ఉపకులపతి వసంత షిండే, వివిధ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, దక్షిణ కొరియా, శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ తదితర దేశాలకు చెందిన పరిశోధకులు పాల్గొంటారని ఆమె వివరించారు.

వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ మృతి

- ఎమ్మెల్యేగా ముక్త్యాల రాణి సేవలు
- పాఠశాలలు, దేవాలయాల స్థాపన
- బలహీన వర్గాల అభివృద్ధికి కృషి



జగ్గయ్యపేట, మార్చి 9 (మనం న్యూస్): ముక్త్యాల రాజు, గెంటేల శకుంతలమ్మ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు వి.ఆర్.జి.కె.యం ప్రసాద్ సతీమణి, జగ్గయ్య పేట మాజీ ఎమ్మెల్యే వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ మృతిచెందారు. ముక్త్యాల సంస్థానం చివరి మహారాణిగా, ఎమ్మెల్యేగా ఆమె ఎనలేని సేవలు అందించారు. సామాజిక, విద్య, ఆధ్యాత్మిక రంగాల్లో ఎంతో కృషి చేశారు. ఆమె మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఎస్.జి.ఎస్ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సంతాప సభలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య శెట్టి, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ మృతి పట్ల ఆర్యవైశ్య సంఘ సభ్యులు సంతాపం తెలిపారు. వేదాద్రి గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ముక్త్యాల గ్రామంలోని శ్రీ భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయాల వంశపారంపర్య ధర్మకర్త అయిన వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ మృతికి స్థానికులు సంతాపం తెలిపారు. ఆలయాల ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ మృతి ఈ ప్రాంతానికి తీరనిలోటని ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను సంతాపం తెలిపారు. రాజ్యవంశీయులైన రాజ్యలక్ష్మమ్మ నియోజకవర్గ స్థాయిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి మన్ననలను పొందారని, ఆమె మృతి నియోజకవర్గానికి తీరనిలోటన్నారు. నియోజకవర్గంలోని ప్రసిద్ధ దేవాలయాలు, పలు పాఠశాలల స్థాపనకు విశేష కృషి చేసిన రాజ్యలక్ష్మమ్మ మృతి తీరనిలోటని మాజీమంత్రి నెట్టెం రఘురాం అన్నారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఆమె ఎంతో కృషి చేశారని కొనియాడారు. రాజ్యలక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందటం పట్ల ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సంతాపాన్ని తెలియజేశారు.

రేపు టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం

అమరావతి, మార్చి 9 (మనం ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం ఆదివారం జరగనుంది. ఈ సమావేశంలో రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక, తాజా రాజకీయ పరిణామాలు, కేంద్రంతో వైదొలగడం వంటి అంశాలపై చర్చించనున్నారు. రాజ్యసభ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి రెండు సీట్లు వస్తాయని.. మూడో అభ్యర్థిని రంగంలోకి దించటమా? లేదా అన్న విషయంలో ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి.. విభజన హామీలు అమలు చేయకపోవడం వంటి పరిణామాలపై కూడా చర్చలు జరపనున్నారు.

'షీ ఆటో'లో సునీత!



ఆటోలో కూర్చుని సాధారణ మహిళలా ప్రయాణిస్తున్న ఆ వ్యక్తిని గుర్తుపట్టారా? నిత్యం భారీ బందోబస్తు.. పార్టీ నేతలు.. ప్రభుత్వాధికారుల హడాహుడి మధ్య కనిపించే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత శుక్రవారం ఇలా కనిపించారు. తన హోదాను పక్కనపెట్టి సాధారణ మహిళలా ఆటోలో ఇంటికెళ్లారు. అనంతపురం డీఆర్‌డీఏ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన 'షీ ఆటో' కార్మికులతో ముఖాముఖిలో ఆమె పాల్గొన్నారు. వచ్చేటప్పుడు అధికారిక కారులోనే వచ్చారు. అక్కడ కాసేపు మహిళా కార్మికులతో మాట్లాడి.. వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. అనంతరం ఓ కార్మికురాలి ఆటో ఎక్కి అరవిందనగర్‌లోని తన ఇంటికి మంత్రి సునీత బయలుదేరి వెళ్లారు. ఆమె నిరాడంబరతను చూసి పలువురు నేతలు, ప్రజలు ప్రశంసించారు.

-అనంతపురం, మనం న్యూస్

కోల్డ్ స్టోరేజీలో సిట్ నివేదిక!

విశాఖలో వేల కోట్ల భూకుంభకోణం.. నివేదిక బయటపెట్టని ప్రభుత్వం


- నిందితులపై చర్యలు తీసుకోని వైనం
- కేసులో మంత్రులు, అధికార పార్టీ నేతలు?



విశాఖపట్నం, మార్చి 9 (మనం న్యూస్ బ్యూరో): వేలాది కోట్ల రూపాయల విలువైన విశాఖ భూకుంభకోణంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక ఇక రహస్యమేనా? దీన్ని బహిర్గతం చేయరా? సిట్ నివేదిక కోల్డ్ స్టోరేజీకి చేరిందా? అంటే అవుననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖలో వందల ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జాపై విచారణ జరిపిన వినీత్ బ్రిజాల్ నేతృత్వంలోని బృందం నెల రోజుల క్రితం నగర పోలీస్ కమిషనర్ టి.యోగానంద్‌కు నివేదికను సమర్పించింది. 20 రోజుల తరువాత ఆయన ఈ నివేదికను సీఎస్‌కు పంపారు. అసెంబ్లీ సమావేశాలకు ముందే నివేదికను బహిర్గతం చేయాలని వివిధ పార్టీలు డిమాండ్ చేశాయి. సమావేశాల్లో ఈ నివేదిక ఆధారంగా చర్చకు పలువురు సిద్ధమయ్యారు. అయితే, ప్రభుత్వం మాత్రం నోరు మెదపడం లేదు. నివేదిక గురించి ప్రస్తావన తీసుకురావడంలేదు. ఈ లోగా మరో రూ.300 కోట్ల ప్రభుత్వ భూములను విశాఖ ఆర్డీవో వెంకటేశ్వర్లు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పరం చేసేశారు. సిట్ విచారణ కొనసాగినంతకాలం ఈ భూముల వ్యవహారాల్లో తలదూర్చకుండా, ఆర్డీవో కోర్టులో తీర్పులివ్వకుండా కాలక్షేపం చేసిన ఆయన.. సిట్ నివేదిక కోల్డ్ స్టోరేజీకి చేరిందని తెలియగానే విజృంభించారు. 40 ఎకరాలకుపైగా ప్రభుత్వ, ఇనాం భూములను ప్రైవేటు పరం చేస్తూ తన పరిధికి మించి ఆదేశాలు జారీచేశారు. దీంతో, సిట్ విచారణ, నివేదిక పెద్ద బోగస్ అంటూ గతంలో ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణలు నిజమేనన్న అభిప్రాయాలను నగర వాసులు వ్యక్తం చేస్తున్నారు. సిట్ విచారణ పూర్తి కావడం, నివేదిక బయటకు పొక్కకపోవడం, కనీసం ఆ నివేదిక ఆధారంగా చర్యలేమీ లేకపోవడం ఇప్పుడు కబ్జాదారులు, అక్రమార్కులకు వరంగా మారింది. ఆరు నెలల పాటు వేల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన సిట్.. డిసెంబరు చివరివారంలో నివేదికను సిద్ధం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేసేందుకు పలు పర్యాయాలు ప్రయత్నించినా ఆయన అపాయింట్‌మెంట్ దొరకలేదు. దీంతో చివరకు సిట్‌కు మార్గదర్శిగా వ్యవహరించిన విశాఖ నగర పోలీసు కమిషనర్ యోగానంద్‌కు అందజేశారు. ఈ నివేదికను బహిరంగ పరుస్తారా లేదా అన్నది మొదటినుంచి పెద్ద ప్రశ్నగా మారింది. అధికార పార్టీకి చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు భూకబ్జాల్లో ఉండటమే ఇందుకు కారణమని విమర్శలు వస్తున్నాయి. నిరుడు జూన్ 28న రంగంలోకి దిగిన సిట్ బృందాలు రెండు పర్యాయాలు గడువును పెంచిన తరువాత ఆరు నెలల పాటు పనిచేశాయి. విశాఖలో ముదపాక, కొమ్మాది, పరదేశీపాలెం భూములతో పాటు మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూములపై విచారణకు ప్రభుత్వం సిట్‌ను నియమించింది. ఫిర్యాదులు వేల సంఖ్యలో రావడంతో గడువు పెంచింది. వినీత్ బ్రిజాల్ నేతృత్వంలోని సిట్ ప్రాథమిక నివేదికల ఆధారంగా.. రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. విశాఖ రూరల్ మండలంలోనే 600 ఎకరాల భూమి రికార్డులు ట్యాంపరింగ్‌కు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపారు. ట్యాంపరింగ్ భూముల్లో ప్రస్తుత మంత్రులు, మాజీ మంత్రులు, శాసనసభ్యులు ఉన్నట్లు సమాచారం. మొత్తం 2873 ఫిర్యాదులు రాగా వాటిలోని 337 కేసులపై సిట్ దర్యాప్తు జరిపింది. ఈ భూముల కుంభకోణంలో పెద్ద తలకాయలు ఉండడంతో ప్రతికేసును నివేదికలో విడివిడిగా పొందుపర్చినట్లు తెలిసింది. అక్రమాలపై విచారణ, చర్యలపై సమగ్రంగా నివేదిక పొందుపరిచినట్లు తెలిసింది. ఈ నివేదికపై తుది నిర్ణయం మాత్రం ప్రభుత్వమే తీసుకోవాల్సివుంది. గతంలో వచ్చిన ఫిర్యాదులపై బహిరంగ విచారణ జరుపుతామని ఉపముఖ్యమంత్రి కూడా అయిన రెవిన్యూ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రకటి ంచారు. అయితే, రాజకీయ ఒత్తిడితో అది రద్దయ్యింది. దాని స్థానంలో వచ్చిన సిట్ విచారణ పక్కాగానే చేసినా ప్రభుత్వం దీని ఆధారంగా చర్యలు తీసుకుంటుందా లేక మిగిలిన నివేదికల మాదిరిగానే అటకెక్కిస్తుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. నివేదిక బహిర్గతం కాకపోవడంతో విశాఖ నగరంలో కబ్జాదారులు మళ్లీ విజృంభిస్తున్నారు. భూకుంభకోణం కేసుల్లో విశాఖ ఆర్డీవోను ప్రభుత్వానికి సరెండర్ చేయాల్సి వచ్చింది. రావికమతం తహశీల్దార్ సిద్ధయ్యకు గురువారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. మరికొంత మందిపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది.




సెన్సెక్స్ మార్చి 2018 9



పెరిగినవి	%	తగ్గినవి	%
టీసీఎస్	1.10	టాటా స్టీల్	-4.66
హెచ్‌డీఎఫ్‌సీ	0.89	యాక్సిస్ బ్యాంకు	-2.85
ఇన్ఫోసిస్	0.58	అదానీ పోర్ట్స్	-2.21
హెచ్.యు.ఎల్	0.56	సన్ ఫార్మా	-1.67
లార్సెన్	0.54	ఐసీఐసీఐ బ్యాంకు	-1.43

నిఫ్టీ మార్చి 2018 9



పెరిగినవి	%	తగ్గినవి	%
టెక్ మహీంద్రా	1.98	టాటా స్టీల్	-4.58
బజాజ్ ఫైనాన్స్	1.61	యాక్సిస్ బ్యాంకు	-2.92
హెచ్‌డీఎఫ్‌సీ	1.10	అదానీ పోర్ట్స్	-2.59
టీసీఎస్	1.00	యస్ బ్యాంకు	-1.72
ఐషర్ మోటార్	0.91	సన్ ఫార్మా	-1.52


టాప్ లూజర్స్ 9 మార్చి

33,307.14


పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
605.60	టాటా స్టీల్	-4.66%
505.35	యాక్సిస్ బ్యాంకు	-2.85%
380.00	అదానీ పోర్ట్స్	-2.21%
506.80	సన్ ఫార్మా	-1.67%
292.70	ఐసీఐసీఐ బ్యాంకు	-1.43%
303.45	యస్ బ్యాంకు	-1.41%
253.15	ఎస్‌బిఐ	-1.40%
341.70	టాటా మోటార్స్	-1.21%
163.90	ఎన్‌టీపీసీ	-0.85%
8664.45	మారుతి సుజుకి	-0.79%

-44.43

బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



చివర్లో అమ్మకాలకు తలొగ్గిన సూచీలు



ముంబయి: ట్రేడింగ్ చివరలో చోటుచేసుకున్న అమ్మకాలతో ఈక్విటీలు ఓ మోస్తరు నష్టాలతో ముగిసాయి. లోహ రంగ కంపెనీల షేర్లు అధిక అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. కొన్ని ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకాలు విధించడంతో అంతర్జాతీయంగా వాణిజ్య ఘర్షణ వాతావరణం నెలకొనవచ్చనే భయాలు రేకెత్తాయి. బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి శుక్రవారం 43 పాయింట్లు క్షీణించి 33,307.14 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' స్వల్పంగా 16 పాయింట్లు కోల్పోయి 10,226.85 పాయింట్ల వద్ద ముగిసింది.

పంతం నెగ్గించుకున్న ట్రంప్

కొన్ని రకాల ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలు విధిస్తున్న రెండు ఆదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకాలు చేయడంతో ఇతర దేశాలు ప్రతి చర్యలకు దిగవచ్చనే భయాలు రేకెత్తాయి. శుక్రవారంనాటి సెషన్‌లో బి.ఎస్.ఇ మెటల్ ఇండెక్స్ ఎక్కువ నష్టపోయినదిగా నిలిచింది. 'సెన్సెక్స్' సెషన్‌లో అత్యధిక భాగం సానుకూల మండలంలోనే కొనసాగి 33,519.49 పాయింట్ల గరిష్ఠ స్థితిని కూడా చూసింది. కానీ, చివరలో సంభవించిన అమ్మకాలకు తలొగ్గి 44.43 పాయింట్లు కోల్పోయి, 33,307.14 పాయింట్ల వద్ద ముగిసింది. యాభై షేర్ల ధరల్లో హెచ్చు తగ్గులను ప్రతిబింబించే 'నిఫ్టీ' 10,296.70 పాయింట్ల నుంచి 10,211.90 పాయింట్ల మధ్య ఊగిసలాడి చివరకు 15.80 పాయింట్ల నష్టంతో 10,226.85 పాయింట్ల వద్ద ముగిసింది.

కొనసాగుతున్న ఎఫ్.పి.ఐల అమ్మకాలు

తాత్కాలిక డాటా ప్రకారం గురువారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 364.80 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 675.26 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశాయి.

సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా రెండవ వారంలోనూ నష్టాలతో ముగిసినట్లైంది. వారం మొత్తంమీద సెన్సెక్స్ 739.80 పాయింట్లు కోల్పోగా, నిఫ్టీ 231.50 పాయింట్లను నష్టపోయింది.



బి.హెచ్.ఇ.ఎల్‌కు థర్మల్ ప్లాంట్ ఏర్పాటు ఆర్డరు

న్యూఢిల్లీ: జార్ఖండ్‌లో రూ. 11,700 కోట్లతో 3800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పాదన కేంద్ర ఏర్పాటు ఆర్డరును కైవసం చేసుకున్నట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ పరికరాల తయారీ సంస్థ (బి.హెచ్.ఇ.ఎల్) శుక్రవారం వెల్లడించింది. పత్రాటు సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ విస్తరణ మొదటి దశ (3800 మెగావాట్లు) ఆర్డరు తమకు దక్కిందని బి.హెచ్.ఇ.ఎల్ తెలిపింది. పత్రాటు విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ ఆ ఆర్డరు ఇచ్చింది. ఎన్.టి.పి.సి, జార్ఖండ్ బిజ్లీ వితరణ్ నిగమ్ లిమిటెడ్ కలసి సంయుక్త రంగంలో ఆ సంస్థను నెలకొల్పాయి. జార్ఖండ్‌లో రామ్‌గఢ్ జిల్లాలోని పత్రాటులో ఈ కేంద్రాన్ని నెలకొల్పుతారు.

రేణుక షుగర్స్ వైస్ చైర్మన్ రాజీనామా



న్యూఢిల్లీ: శ్రీ రేణుక షుగర్స్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర మర్కంబి రాజీనామా చేసినట్లు కంపెనీ బి.ఎస్.ఇకి తెలియజేసింది. డైరెక్టర్ల బోర్డు ఆయన రాజీనామాను ఆమోదించింది. నోటీసు గడువు(90 రోజుల) వరకు లేదా విల్మర్ షుగర్ హోల్డింగ్స్ ఓపెన్ ఆఫరు పూర్తయ్యేంత వరకు (ఆ రెండింటిలో ఏది ముందు పూర్తయితే అప్పటి వరకు) నరేంద్ర పదవిలో కొనసాగుతారని కంపెనీ పేర్కొంది. విల్మర్ షుగర్ హోల్డింగ్‌కు 481,843,884 ఈక్విటీ షేర్లను కేటాయించినట్లు రేణుక షుగర్స్ మరో నివేదనలో బి.ఎస్.ఇకి తెలిపింది. విల్మర్ షుగర్ హోల్డింగ్స్ తనవద్దనున్న కంపల్సరీ కన్వెర్టిబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఈక్విటీ షేర్లుగా మలచుకుందని కంపెనీ తెలిపింది. రుణ పునర్నిర్మాణ ప్యాకేజీ అమలుకు సంబంధించి అది ఆ అవకాశాన్ని ఉపయోగించుకుందని రేణుక షుగర్స్ తెలిపింది. శ్రీ రేణుక షుగర్స్‌లో విల్మర్ షుగర్ హోల్డింగ్స్ (డబ్ల్యు.ఎస్.హెచ్) అదనపు వాటా కైవసం చేసుకునేందుకు కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) గత నెలలో ఆమోదం తెలిపింది. శ్రీ రేణుక షుగర్స్ ప్రమోటర్లలో విల్మర్ షుగర్ హోల్డింగ్స్ ఒకటిగా ఉంది. ఒక్కొక్కటి రూ. 16.27 చొప్పున 50 కోట్ల కంపల్సరీ కన్వెర్టిబుల్ ప్రిఫరెన్స్ షేర్ల (సి.సి.పి.ఎస్)ను విల్మర్ ,షుగర్ హోల్డింగ్స్‌కు జారీ చేస్తున్నట్లు రేణుక షుగర్స్ గత ఏడాది ప్రకటించింది. రేణుక షుగర్స్‌లో డబ్ల్యు.ఎస్.హెచ్ అదనంగా రూ. 783.96 కోట్ల పెట్టుబడులు సమకూరుస్తోందని, అప్పులు తీర్చేందుకు, చర మూలధన అవసరాలకు ఆ మొత్తాన్ని ఉపయోగించుకుంటామని రేణుక షుగర్స్ గత ఏడాది వెల్లడించింది. డబ్ల్యు.ఎస్.హెచ్‌కి ఉన్న 27.24 శాతం వాటాతో కలుపుకొని కంపెనీలో ప్రమోటర్ల వాటా 2017 డిసెంబరు త్రైమాసికం అంతానికి 54.47 శాతంగా ఉంది. విల్మర్ ఇంటర్నేషనల్‌కి సింగపూర్‌లోని డబ్ల్యు.ఎస్.హెచ్ అనుబంధ సంస్థగా ఉంది. విల్మర్ గ్రూప్‌నకు చెందిన ప్రపంచ చక్కెర, ఇథనాల్ వ్యాపారాలకు, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, మొరాకో, మైన్మార్‌లలోని ఆస్తులకు హోల్డింగ్ కంపెనీగా ఉంది.

ట్విట్టర్ సి.టి.ఓగా పరాగ్



న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫాం ట్విట్టర్ ఛీఫ్ టెక్నాలజీ అధికారిగా పరాగ్ అగ్రావాల్‌ను నియమించుకుంది. కంపెనీ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ ద్వారా ఈ సంగతి వెల్లడైంది. ఐ.ఐ.టి-బాంబే పూర్వ విద్యార్థి అయిన పరాగ్ స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌లో పిహెచ్‌డి పొందారు. ఆడం మెసింజర్ స్థానంలో పరాగ్‌ను నియమించారు. ఆడం 2016 చివరలో సంస్థ నుంచి నిష్క్రమించారు. సి.టి.ఓగా పరాగ్ కంపెనీ టెక్నికల్ వ్యూహానికి నేతృత్వం వహిస్తారు. సంస్థలోని ప్రాడక్టు, మౌలిక వసతుల బృందాలలో మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లను పర్యవేక్షిస్తారు. పరాగ్ యాడ్స్ ఇంజనీర్‌గా 2011లో ట్విట్టర్‌లో చేరారు. ట్విట్టర్‌లో చేరడానికి ముందు ఆయన మైక్రోసాఫ్ట్ రిసెర్చ్, యాహూ రిసెర్చ్, ఎ.టి అండ్ టి ల్యాబ్స్‌లో పనిచేశారు.

ప్రపంచ వాణిజ్య మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ: భారత్ మార్చి 20న ఇక్కడ ఏర్పాటు చేసిన డబ్ల్యు.టి.ఓ మినీ-మినిస్టీరియల్ సమావేశంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైట్‌హైజర్ పాల్గొనే అవకాశం కనిపించడం లేదని భారత ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ప్రపంచ వాణిజ్య సంస్థలో ముఖ్యమైన అంశాలను ముందుకు తీసుకెళ్ళే మార్గాల గురించి చర్చించేందుకు ఇండియా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. వ్యవసాయం, సేవలు వంటి రంగాలకు చెందిన కీలక అంశాల గురించి చర్చించేందుకు అమెరికా, చైనా, పాకిస్తాన్‌లతో సహా 50కి పైగా దేశాల వాణిజ్య మంత్రులను భారత్ ఆహ్వానించింది. ఇంతవరకు 15 దేశాల వాణిజ్య మంత్రులు తమ రాకను ధ్రువీకరించారు. ఇది డబ్ల్యు.టి.ఓ సభ్యుల ఇష్టాగోష్టి సమావేశం. డబ్ల్యు.టి.ఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజిజుడుతో సహా, ప్రతి దేశానికి చెందిన ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొంటారని భారత్ భావిస్తోంది. ఆ బహుళ దేశీయ సంస్థలో చర్చల్లో పురోగతికి అవరోధాలు సృష్టిస్తున్న అంశాలపై సభ్యులుగా ఉన్న దేశాలు చర్చించుకోవచ్చునని భారత అధికారి చెప్పారు. ఆహార భద్రత ప్రయోజనాలకు ఒక శాశ్వత పరిష్కారాన్ని కనుగొనవలసి ఉంది. సేవల రంగంలో వర్తకాన్ని ముందుకు తీసుకెళ్ళేందు వర్తక వెసులుబాటు చర్యలు తీసుకోవాల్సి ఉంది. డబ్ల్యు.టి.ఓలోని వివాద పరిష్కార సంస్థలో సభ్యులను నియమించవలసిన అంశం కూడా చర్చకు రానుంది.

డి.బి.ఎల్‌కు రూ. 770 కోట్ల ఆర్డరు



న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌లో రూ. 770.04 కోట్ల విలువైన రోడ్డు నిర్మాణ ప్రాజెక్టు ఒకటి లభించినట్లు హైవే డెవలపర్ దిలీప్ బిల్డ్‌కాన్ (డి.బి.ఎల్) శుక్రవారం వెల్లడించింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్.హెచ్.ఎ.ఐ)తమను ఎల్-1 బిడ్డర్‌గా ప్రకటించిందని కంపెనీ చెప్పుకుంది. ఇది ఎన్.హెచ్-7లో దగమగ్‌పూర్-లాల్‌గంజ్ సెక్షన్‌లో రెండు లేన్‌ల రహదారిని నాలుగు లేన్‌ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేసే పనికి సంబంధించినదని డి.బి.ఎల్ తెలిపింది. ఈ ప్రాజెక్టు పనులు 30 నెలల లోగా పూర్తి చేయవలసి ఉంటుంది.

రెపో రేటు పెరగవచ్చు



ముంబయి: రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) ఈ ఏడాది కీలక వడ్డీ రేట్లను 0.25 శాతం పెంచే అవకాశం ఉందని కేర్ రేటింగ్స్ ఒక నివేదికలో తెలిపింది. ద్రవ్య లోటు విస్తృతమవడం, చమురు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు అధికంగా ఉండడం వల్ల ద్రవ్యోల్బణం హెచ్చు స్థాయిలో ఉంటుందని భావిస్తున్నారు. వినియోగ వస్తువుల ద్రవ్యోల్బణం 6 శాతం మించేంత స్థితికి వెళ్ళకపోవచ్చు. కానీ, దాన్ని 4 శాతం మించనివ్వకుండా చూడాలన్న లక్ష్యం నెరవేర్చడం కూడా కష్టమేనని ఆ నివేదిక తెలిపింది. డిమాండ్, సరఫరా రెండు వైపుల నుంచీ ఇబ్బందులున్నాయని పేర్కొంది. ప్రస్తుతం ఆర్.బి.ఐ 6 శాతం వడ్డీకి బ్యాంకులకు అప్పులిస్తోంది. ఈ ఏడాది (2018లో) రెపో రేటు 0.25 శాతం పెరగవచ్చని కేర్ రేటింగ్స్ అంచనా వేసింది.

'వారానికో విమానం అందిస్తాం'

హైదరాబాద్: భారతీయ విమానయాన సంస్థలకు వచ్చే 10 ఏళ్ళలో సగటున వారానికి ఒక విమానం చొప్పున అందజేయగలమని భావిస్తున్నట్లు యూరోపియన్ విమానయాన దిగ్గజం ఎయిర్‌బస్ ప్రకటించింది. రానున్న 20 సంవత్సరాలలో భారతదేశానికి 1750 కొత్త విమానాలు అవసరమవుతాయని అంచనా వేసినట్లు ఎయిర్‌బస్ కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇండియా విభాగ అధ్యక్షుడు శ్రీనివాసన్ ద్వారకానాథ్ చెప్పారు. భారతదేశానికి 2017-2036 మధ్య కాలంలో 255 బిలియన్ డాలర్ల విలువ చేసే 1320 సింగిల్ ఐల్, 430 వైడ్-బాడీ విమానాలు అవసరమవుతాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న విమానయాన కార్యక్రమం వింగ్స్ ఇండియా ప్రదర్శన సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రయాణికుల సంఖ్యలో వృద్ధికి వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న సంపద, నగరీకరణ దోహదపడతాయని భావిస్తున్నారు. వచ్చే 20 ఏళ్ళలో దేశంలో విమాన ప్రయాణికులు అమెరికాలో ఇప్పుడున్నట్లుగా ఐదున్నర రెట్లు వృద్ధి చెందుతారని అంచనా. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో ఇండియా ఒకటి అవుతుంది. ఎయిర్‌బస్ వద్ద 530 విమానాల తయారీకి ఆర్డర్లు సిద్ధంగా ఉన్నాయని ద్వారకానాథ్ తెలిపారు. ఇతరులతో కలసి ఈ వృద్ధిని పంచుకునేందుకు ఎయిర్‌బస్ సుముఖంగా ఉందని ఆయన వెల్లడించారు.

వ్యవస్థాపక సామర్థ్యంతోనే మార్పు సాధ్యం

న్యూఢిల్లీ: రానున్న ఏడాదిలో గ్రామ స్థాయి మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల (వి.ఎల్.ఇల) సంఖ్యను రెండింతలకన్నా ఎక్కువ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కామన్ సర్వీస్ సెంటర్ల (సి.ఎస్.సిల) ద్వారా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 46,597 మంది మహిళలు వి.ఎల్.ఇలుగా పనిచేస్తున్నారు. ''నేడు, భారతదేశమంతటా 47000 మంది మహిళా వి.ఎల్.ఇలు ఉన్నారు. మన దేశంలో వారి సంఖ్య లక్షకు పైగా పెరగాలని నేను కోరుకుంటున్నాను'' అని ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ గురువారం నాడిక్కడ ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'స్త్రీ స్వాభిమాన్-మహిళల హెల్త్ అండ్ హైజీన్‌ను పెంపొందించే సి.ఎస్.సి కృషి' అనే అంశంపై వర్క్‌షాపును సమాచార, ప్రసార, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి స్మృతి ఇరానీతో కలసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రవి శంకర్ ప్రసాద్ ప్రారంభించారు. భారతదేశంలో పేదలు, బడుగు వర్గాలలో సి.ఎస్.సిల ద్వారా మహిళల హెల్త్, హైజీన్ పెంపొందించడంలో మహిళా వి.ఎల్.ఇలు సాధించిన ప్రగతి, ప్రభావానికి ఈ వర్క్‌షాపు అద్దం పట్టింది. మహిళా వి.ఎల్.ఇలు చేస్తున్న కృషిని ప్రసాద్ ఈ సందర్భంగా అభినందించారు. ''డిజిటల్ ఇండియా అగ్ర భాగంలో మహిళలు పాలుపంచుకునేట్లు చేస్తే, నూతన సామాజిక వ్యవస్థ రూపుదిద్దుకుంటుంది. వారు మార్పు తెచ్చే వ్యక్తుల పాత్రను పోషించి ఏ విధమైన వివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో కీలక పాత్ర వహిస్తారు. డిజిటల్ పరంగా సాధికారత సాధించిన మహిళలు గ్రామీణ వర్గాలను ప్రోత్సహించడంలో, సాధికారత సాధించేట్లు చేయడంలో పూర్తి మార్పు తీసుకురాగలగుతారు'' అని రవి శంకర్ ప్రసాద్ అన్నారు.

స్త్రీ స్వాభిమాన్ ప్రాజెక్టు

స్త్రీ స్వాభిమాన్ ప్రాజెక్టు కింద శానిటరీ న్యాప్‌కిన్‌ల తయారీ యూనిట్లను నెలకొల్పిన మహిళలను మంత్రి అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సాధికారతను పెంపొందించడంతోపాటు, ఆరోగ్యం, పరిశుభ్రతల విషయంలో మహిళలు పురోగతి సాధించేట్లు చేయడంలో వారు తోడ్పడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 700 మంది వి.ఎల్.ఇలు పాల్గొన్నారు. ''మహిళా సాధికారత, ముఖ్యంగా గ్రామీణ భారతదేశంలో నివసిస్తున్న వారి సాధికారత మా



ప్రభుత్వంలో అంతర్భాగం'' అని స్మృతి ఇరానీ అన్నారు.

బంజారా వర్గ మహిళల్లో 'చుప్పీ తోడో, సయానీ బనో' పేరుతో వి.ఎల్.ఇ స్నేహలతా దేవి చేపట్టిన కార్యక్రమాన్ని స్మృతి ఇరానీ ప్రత్యేకించి ప్రస్తావించారు. ''పాలనకు మొదటగా స్పందిస్తున్నది మహిళా వి.ఎల్.ఇలే. గత మూడేళ్ళలో జన్ ధన్ యోజన ద్వారా 16 కోట్ల మందికి పైగా మహిళలు బ్యాంక్ ఖాతాలు తెరిచారు. ప్రభుత్వం ప్రారంభించిన 'ముద్రా' యోజన ద్వారా అదే విధంగా దేశంలో 7.80 కోట్ల మంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తయారయ్యారు'' అని స్మృతి ఇరానీ చెప్పారు. బెంగళూరు సమీపంలో మహిళా వి.ఎల్.ఇ ఒకరు నిర్వహిస్తున్న సి.ఎస్.ఇని మార్చి 11న సందర్శించనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రభుత్వ బ్యాంకులు ఇన్నెందుకు?

ముంబయి: భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ ''స్తబ్ధత''లో ఉందని, మనకు తరచు ప్రభావాలకు గురికాని సమర్థమైన ఫైనాన్షియల్ వ్యవస్థ అవసరం ఉందని బ్యాంకర్ ఉదయ్ కోటక్ అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ లో దాదాపు 13,000 కోట్ల కుంభకోణం బయటపడిన నేపథ్యంలో ఆయన ఆ విధంగా వ్యాఖ్యానించారు. భారతీయ బ్యాంకింగ్ చరిత్రలోనే దానిని అతి పెద్ద మోసంగా భావిస్తున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్యను కుదించవలసిన అవసరం కూడా కనిపిస్తోందని ఉదయ్ అన్నారు. ''అడపా దడపా ప్రతి కొద్ది సంవత్సరాల కొకసారి, మనం నేడున్న విధంగా అచేతన స్థితిలోకి పడిపోవడానికి వీలులేదు'' అని కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ కోటక్ ఇక్కడ 'ఇండియా టుడే' పత్రిక నిర్వహించిన సదస్సులో అన్నారు. పి.ఎన్.బిలో కుంభకోణం గురించి ఆయన నేరుగా ప్రస్తావించలేదు. రత్నాలు, నగల వ్యాపారాలు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు పి.ఎన్.బిని కోట్ల రూపాయల మేరకు మోసగించినట్లు వెల్లడైంది. తాను ఎటువంటి ''రాజకీయ చర్చ''లోకి దిగదలచుకోలేదని ఉదయ్ చెప్పారు. ''నిష్కర్షగా చెప్పాలంటే, మనకు కొద్ది ప్రభుత్వ రంగ బ్యాంకులు చాలు. విలీనాలు, కుంచించుకుపోవడం ద్వారా కొద్ది బ్యాంకులు ఏర్పడవచ్చు'' అని ఆయన అన్నారు. అతి పెద్ద రుణ దాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సహా ప్రస్తుతం 20 సంస్థలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. వ్యవస్థలో దాదాపు 70 శాతం ఆస్తులు వాటి వద్దనే ఉన్నాయి. ఇంచుమించుగా అవన్నీ అధిక స్థాయిల్లో నిరర్థక ఆస్తుల దెబ్బకు గురైనవే. ఐ.ఎన్.జి వైశ్యా బ్యాంక్‌ను విలీనం చేసుకోవడం ద్వారా కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రైవేటు రంగంలో నాల్గవ పెద్ద బ్యాంక్‌గా అవతరించింది. వివిధ ప్రయోజనాల నిమిత్తం కోటక్ బ్యాంక్ ఇటీవల రూ. 5,500 కోట్లను సమీకరించింది. విలీనాలు, స్వాధీనాలకు కూడా ఆ మొత్తాన్ని ఉపయోగించుకోనుంది.



మరో రూ. 700 కోట్లు ఇచ్చేందుకు సిద్ధపడ్డ అల్ట్రాటెక్


భారత్ దాల్మియాకు అవార్డును కట్టబెట్టడంపై ఎన్.సి.ఎల్.టిలో పేచీ పెట్టకూడదని నిర్ణయం

ముంబయి: బినాని సిమెంట్‌కు చెందిన 'స్ట్రెస్సడ్ ఎసెట్ల' కొనుగోలుకు బిడ్ మొత్తంలో రూ. 700 కోట్లు పెంచి మొత్తం రూ. 7,250 కోట్లు చెల్లించేందుకు ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్ అంగీకరించింది. ఈ విషయంలో భారత్ దాల్మియా నుంచి పోటీ లేకుండా చేసుకునేందుకు ఈ మొత్తాన్ని ముందుగానే చెల్లించేందుకు కూడా అది అంగీకరించింది. 'స్ట్రెస్సడ్ ఎసెట్ల' అమ్మకాన్ని పర్యవేక్షిస్తున్న పరిష్కార వృత్తినిపుణుడు (ఆర్.పి) ఒకరు ఈ విషయంలో అత్యధిక బిడ్డర్‌గా భారత్ దాల్మియా నేతృత్వంలోని కన్సార్టియంను గత సోమవారం ప్రకటించారు. ఆర్.పి పరిష్కార ప్రణాళిక గురించి చర్చించేందుకు రావలసిందిగా భారత్ దాల్మియాను ఆహ్వానించడం కూడా జరిగింది. దానితో బినాని సిమెంట్ బిడ్లను పునఃమదింపు చేయవలసిందిగా కోరుతూ అల్ట్రాటెక్ కంపెనీ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. మూల్యాంకన క్రైటీరియాను పంచుకోవాలని కూడా అది ఆర్.పిని కోరింది. ఈ విషయమై ఎన్.సి.ఎల్.టిలో వివాదాన్ని సాగదీసి, ప్రక్రియను జాప్యం చేసే బదులు తన బిడ్ మొత్తాన్ని పెంచాలని కంపెనీ నిర్ణయించుకుందని అల్ట్రాటెక్ సిమెంట్ ఛీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అతుల్ దాగా గురువారం వెల్లడించారు. ఈ కొత్త బిడ్‌ను రుణ దాతలు అంగీకరిస్తారా అనే ప్రశ్నకు ''మేం సవరించిన బిడ్‌ను సమర్పించాం. తమకు ఏది ఎక్కువ అనువైనదో రుణ దాతలు నిర్ణయించుకోవాలి. 'స్ట్రెస్సడ్ ఎసెట్ల'కు గరిష్ఠ విలువను రాబట్టుకోదలిస్తే, వారు దానిని అంగీకరిస్తారు'' అని అతుల్ జవాబిచ్చారు. స్కోరింగ్ మెథడాలజీ ఆధారంగా బిడ్డర్లలో విజేతను నిర్ణయిస్తామని పరిష్కార వృత్తినిపుణుడు గతంలో ప్రకటించారు. కానీ, దీనిపై స్పష్టత లేదని అతుల్ అన్నారు. బినాని సిమెంట్ రుణ దాతలకు రూ. 4,000 కోట్లు, ఆపరేషనల్ క్రెడిటర్లకు రూ. 2,000 కోట్లు బకాయి పడింది. బినాని సిమెంట్ వార్షిక ఉత్పాదక సామర్థ్యం కోటి 10 లక్షల టన్నులు. బినాని సిమెంట్‌ను కైవసం చేసుకునేందుకు దాల్మియా-బయిన్, అల్ట్రాటెక్‌లతోపాటు రామ్‌కో సిమెంట్, హెడెల్‌బర్గ్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ యజమానులతోపాటు స్టాక్ బ్రోకర్ రాకేశ్ ఝుంఝున్‌వాలా కూడా బిడ్లు సమర్పించారు.

అనేక మలుపులు

నిజానికి, మొదటి విడతలో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌ను విజేతగా ప్రకటించారు. కానీ, కొత్త రుణ భారం మరొకటి బయటపడడంతో రీబిడ్డింగ్ నిర్వహించాలని రిజల్యూషన్ ప్రొఫెషనల్ నిర్ణయించారు. బయిన్ క్యాపిటల్ సంస్థకు చెందిన ఇండియా రిసర్జంట్ ఫండ్, పీరామల్ ఎంటర్‌ప్రైజెస్‌తో కలసి భారత్ దాల్మియా రూ. 6,700 కోట్లకు బిడ్ సమర్పించింది. రుణ దాతలకు రూ. 6,300 ఇచ్చేందుకు, మరో రూ. 400 కోట్లను మూలధనాన్ని సమకూర్చడం కింద ఇచ్చేందుకు సిద్ధపడింది. ఇక్కడ, ఆసక్తికరమైన మరో విషయం ఏమిటంటే, బినాని సిమెంట్ ప్రతిపాదిత స్వాధీనానికి దాల్మియా భారత్ సిమెంట్‌కు అనుబంధ సంస్థ అయిన రాజ్‌పుతానా ప్రాపర్టీస్‌కు కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) ఆమోదం తెలిపింది. ఇన్‌సాల్వెన్సీ కోడ్ కింద కార్పొరేట్ రుణగ్రస్తుని ఆస్తుల స్వాధీనంలో సి.సి.ఐకి నోటిఫై చేస్తున్న మొదటి లావాదేవీ కూడా ఇదే.

ఇంట్లో గృహోపకరణాలు కొనుగోలు చేసే ముందు మూడు నక్షత్రాల గుర్తుందా?.. నాలుగు నక్షత్రాలదా? అన్నింటికంటే ఉత్తమమైన ఐదు నక్షత్రాల రేటింగ్ ఉందా అని చూస్తున్నాం. ముఖ్యంగా వాషింగ్‌మిషన్, రిఫ్రిజిరేటర్ వంటి అధికంగా విద్యుత్తు వినియోగమయ్యే ఉపకరణాల్లో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) ఇచ్చే రేటింగ్ ఉన్న వాటినే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంట్లో ఒక పరికరం కొనుగోలులోనే 'స్టార్ రేటింగ్' చూస్తున్నప్పుడు.. ఏకంగా ఇల్లు కొంటున్నప్పుడు రేటింగ్ గురించి ఆరా తీయరా అంటే? ఇటీవల కొనుగోలుదారులకు ఎదురవుతున్న అనుభవాలతో కచ్చితంగా వాకబు చేస్తున్నారు అంటున్నారు నిర్మాణదారులు.



ఇవీ ప్రయోజనాలు..

- విద్యుత్తు ఆదా 20 నుంచి 30 శాతం
- నీటి ఆదా 30 నుంచి 50 శాతం
- గాలి స్వచ్ఛత పెరుగుతుంది
- పుష్కలంగా పగటి వెలుతురు

ఇంటి రేటింగ్?



కొనుగోలుదారుల ఆలోచనలను, అభిరుచులను పరిగణనలోకి తీసుకొంటూ... భారీ ప్రాజెక్ట్‌లు చేపడుతున్న గృహ నిర్మాణ సంస్థలు.. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) రేటింగ్‌తో వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా వేసవి కాలం వస్తే నగరవాసులు నీటి కోసం అదనంగా చాలా ఖర్చు చేయాల్సి వస్తోంది. అయినా కొన్నిసార్లు సమయానికి నీటి లభ్యత లేక ఇబ్బందులు పడటం .. దాదాపు ప్రతి ఒక్కరికి ఎప్పుడో ఒకప్పుడు అనుభవమే. ముఖ్యంగా అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి ఈ సమస్యలు మరీ అధికం. చాలా అపార్ట్‌మెంట్లలో నిత్యం ట్యాంకర్ రానిదే రోజు గడవని పరిస్థితి ఉంటోంది. ఇలాంటి వారు సొంత ఇల్లు కొంటున్నప్పుడు నీటిని ఆదా చేసే ప్రాజెక్టులవైపు మొగ్గు చూపుతున్నారు.

వాననీటి సంరక్షణ

నీటిని ఎంత మేరకు ఆదా చేసే అవకాశముంది... ఎటువంటి విధానాలు ప్రాజెక్టుల్లో అవలంభిస్తున్నారనే విషయాలూ రేటింగ్‌ను నిర్ధారిస్తాయి. పెద్ద ప్రాజెక్టులన్నీ భవనాలపై పడిన నీటిని నిల్వ చేసుకునేలా భారీ ట్యాంకులను భూగర్భంలో నిర్మిస్తున్నాయి. వర్షం పడిన సమయంలోనే శుద్ధి చేసి వీటిలోకి తరలిస్తున్నారు. దీంతో పాటూ బోర్‌వెల్స్ రీఛార్జ్ అయ్యేలా.. ఇంజెక్షన్ వెల్స్ ఏర్పాటు చేసి ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నారు. ఇలా అవకాశమున్న అన్ని మార్గాల్లో వాననీటిని సంరక్షిస్తున్నారు. ఇంతేకాకుండా గృహ అవసరాలకు ఉపయోగించే నీటిని తిరిగి ఉపయోగించుకునేలా మురుగునీటి శుద్ధి కేంద్రాలను (ఎస్టీపీ) సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో శుద్ధి చేసిన నీటిని గార్డెనింగ్‌కు, ఇళ్లలోని టాయిలెట్ ఫ్లషింగ్‌కు వాడేలా చూస్తున్నారు. ఫలితంగా నీరు చాలావరకు ఆదా కావటంతోపాటుగా .. వాడిన నీరు పునర్వినియోగం అవుతుంది. ఇంటి రేటింగ్ నిర్ణయించటంలో ఇది ముఖ్యభూమికను పోషిస్తుంది.



వాస్తుతో పాటూ..!

కొనుగోలుదారుల అవసరాలకు తగ్గట్టుగా డిజైన్లలో మార్పులతో స్థిరాస్తి సంస్థలు రేటింగ్ పొందుతున్నాయి. దరఖాస్తులో పొందుపర్చే అంశాల ఆధారంగా ఐజీబీసీ పాయింట్లను కేటాయిస్తుంది. వీటిని బట్టి ప్రాజెక్ట్‌కు ప్లాటినం, గోల్డ్, సిల్వర్ రేటింగ్ ఇస్తారు. వాస్తుతో పాటూ ఈ మధ్య ప్రాజెక్ట్‌ల్లో రేటింగ్‌కు పెద్దపీట వేస్తుండటం నిర్మాణ రంగంలో వచ్చిన మార్పునకు నిదర్శనం. నిర్మాణానికి ఉపయోగిస్తున్న సామగ్రి, సాంకేతిక తదితర అంశాలూ రేటింగ్‌లో కీలకమే. ఒకసారి రేటింగ్ ఇచ్చిన గ్రీన్‌మ్‌లోకి దిగాక విద్యుత్తు, నీటి ఆదాలో కొనుగోలుదారుడికి స్పష్టంగా తేడా తెలుస్తుందని స్థిరాస్తి వ్యాపారులు అంటున్నారు.



విద్యుత్తు పొదుపు

ఒకప్పుడు ఇళ్లలో విద్యుత్తు వినియోగం తక్కువగా ఉండేది. వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రస్తుతం క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా వేసవిలో ఎంతో అధికంగా ఉంటోంది. ఈ బిల్లులు జేబుకు చిల్లు పెడుతుంటాయి. ఇదంతా ఇంట్లో చల్లదనం కోసమే. నిర్మాణ సమయంలోనే గది ఉష్ణోగ్రతలు కొంతవరకైనా తగ్గించే సామగ్రిని ఉపయోగిస్తే చాలావరకు సమస్య తీరినట్లే కదా! వెలుతురు వచ్చేలా ఇంటి డిజైన్ ఉంటే.. విద్యుత్తు బిల్లు గణనీయంగా తగ్గుతుంది. గృహ కొనుగోలుదారులు కోరుకుంటున్నదీ ఇదే. అందుకే కొత్త ప్రాజెక్ట్‌ల్లో ఇల్లు కొనేటప్పుడు ఐజీబీసీ రేటింగ్ గురించి కూడా ఆరా తీస్తున్నారు.

వస్తేనే ప్రచారం

బడా స్థిరాస్తి సంస్థలు ప్రస్తుతం గ్రీన్ బిల్డింగ్ రేటింగ్ విషయంలో పోటీపడుతున్నాయి. ఆకాశహర్మ్యాలను నిర్మిస్తున్న సంస్థలు రేటింగ్ కోసం అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. అయితే ఇక్కడ ప్రతీ సంస్థ ప్లాటినం రేటింగ్‌ను ఆశిస్తోంది. ఇది వస్తే గొప్పగా ప్రచారం చేసుకొంటున్నాయి. రేటింగ్ ఏమాత్రం తగ్గినా గోల్డ్, సిల్వర్ వచ్చినా ఆ విషయం వినియోగదారులకు చెప్పడం లేదు.

మీ ఇంటికి కూడా..

స్థిరాస్తి సంస్థలు నిర్మించే భవనాలే కాదు.. వ్యక్తిగతంగానూ గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ పొందవచ్చు. ఎంత విస్తీర్ణంలో ఇంటిని నిర్మిస్తున్నారనే ఆంక్షలేమీ లేవు. రేటింగ్‌కు అవసరమైన విధంగా ఇంటి డిజైన్, ఉపయోగించే సామగ్రి, ఇంకుడు గుంతల ఏర్పాటు, వాననీటి సంరక్షణ, విద్యుత్తు ఆదా వంటి చర్యలతో ఐజీబీసీ రేటింగ్ పొందవచ్చు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో 100 చ.మీ., ఆపై విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లలో ఇంకుడు గుంతలు ఉంటేనే నివాసయోగ్యత సర్టిఫికెట్ ఇచ్చే విధంగా నిబంధనలు మార్చబోతున్నారు.

ఇంటిపై పూర్తిగా అవగాహన ఉండాలి!



ఇంటి కొనుగోలు సమయంలో ముఖ్యంగా అపార్ట్‌మెంట్ల లోని ఫ్లాట్లలో కార్పెట్ ఏరియా, బిల్టప్ ఏరియా, సూపర్ బిల్టప్ ఏరియా పదాలు వినిపిస్తుంటాయి. మొదటిసారి ఇల్లు కొనుగోలు చేసేవారిలో చాలామందికి ఇవి గందరగోళంగా అన్పిస్తుంటాయి. వీటి గురించి అవగాహన ఉంటే కొనుగోలు సమయంలో ఏజెంట్లు, బిల్డర్లతో ధర విషయంలో మాట్లాడి చకచకా నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. మన అవసరాలకు తగిన విస్తీర్ణం కలిగిన ఇంటిని సొంతం చేసుకునేందుకు వీలవుతుంది. ఇంట్లో గదుల్లోని గచ్చు పరిధి వరకు విస్తరించిన ప్రాంతాన్ని కార్పెట్ ఏరియాగా పరిగణిస్తారు. గోడలను మినహాయించి లెక్కిస్తారు. ఉమ్మడి స్థలం మెట్లు, లిఫ్ట్, లాబీ, ఆట స్థలం వంటివి ఇందులోకి రావు. కాబట్టి కొనేటప్పుడు కార్పెట్ ఏరియా ఎంత అనేది తెలిస్తే వంటగది, హాలు, పడకగది, పిల్లల గది ఏ విస్తీర్ణంలో రాబోతుందనేది అవగాహనకు రావొచ్చు. చాలామంది బిల్డర్లు కార్పెట్ ఏరియాను వారి బ్రోచర్లలో స్పష్టం చేయరు. బిల్టప్ ఏరియా, సూపర్ బిల్టప్ ఏరియాపైనే ధర వసూలు చేస్తారు. సాధారణంగా బిల్టప్ ఏరియాలో 70 శాతం వరకు కార్పెట్ ఏరియా ఉంటుంది. ఇంట్లో గచ్చు, గోడలన్నీ కలిపి బిల్టప్ ఏరియాగా లెక్కిస్తారు. గోడలు 20 శాతం ఆక్రమిస్తాయి. మరో 10 శాతం బాల్కనీ, ఇతరత్రా పోతుంది. మీ ఫ్లాట్ 1000 చ.అడుగుల



బిల్టప్ ఏరియా అయితే 30 శాతం ఉపయోగించని స్థలమే ఉంటుంది. వినియోగంలో ఉండే స్థలం 700 చ.అ. మాత్రమే. బిల్టప్ ఏరియాతో పాటు కామన్ ఏరియాను కలిపి సూపర్ బిల్టప్ ఏరియాగా వ్యవహరిస్తుంటారు. కారిడార్, లిఫ్ట్, లాబీ ఇందులోనే కలుపుతుంటారు. కొందరు బిల్డర్లు ఈతకొలను, గార్డెన్, క్లబ్‌హౌస్ కలిపి లెక్కిస్తారు.

కొత్త అపార్టుమెంట్ కొనేముందు?

మేం కొత్తగా ఓ అపార్ట్‌మెంట్ కొందాం అనుకుంటున్నాం. ఇప్పటికే చాలా చోట్లకెళ్లి చూశాం. ఒక్కో చోట బిల్డరు ఒక్కో రకమైన సమాచారం ఇస్తున్నారు. వాళ్లు చెప్పినవి వినడమే తప్ప మేం ఏం అడగాలో తెలియడం లేదు. 'అన్ని విషయాలు తెలుసుకుని కొనుక్కోకపోతే మోసపోతారు' అని ఇంట్లో వాళ్లు హెచ్చరిస్తున్నారు. అపార్ట్‌మెంట్ కొనేముందు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేయగలరు.

ఫ్లాట్ కొనేటప్పుడు చాలామంది సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల న్యాయ సంబంధమైన సమస్యలు ఎదుర్కొంటారు. డబ్బు నష్టపోవడం, సరైన సదుపాయాల్లేకుండా బాధలు అనుభవించడం వంటివి జరుగుతూ ఉంటాయి. ఫ్లాట్ కొనేందుకు సిద్ధపడేముందు ప్రధానంగా చేయాల్సింది ఏమిటంటే.. అపార్టుమెంట్‌కు, బిల్డర్‌కు, ల్యాండ్ ఓనర్‌కు ఉన్న యాజమాన్య హక్కులను జాగ్రత్తగా పరిశీలించడం. దస్తావేజులు ఎలా ఉన్నాయో కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. సామాన్యుడు దస్తావేజులన్నీ సరిగ్గా తెలుసుకోవడం కష్టం గనక సివిల్ ప్రాక్టిస్ చేసే లాయర్‌కు చూపించాలి. దీంతో బిల్డర్‌కు, ఓనర్‌కు క్రయవిక్రయ హక్కులు ఉన్నాయో, లేదో తెలుస్తుంది. క్రయవిక్రయ హక్కులున్నాయని గుర్తించిన తర్వాత ఒరిజినల్ డాక్యుమెంట్లు అడిగే బాధ్యత కూడా కొనుగోలుదారులదే.



ఇల్లే ఆఫీస్ అయితే..

ఒకప్పుడు ఇల్లు వేరు.. ఆఫీసు వేరుగా ఉండేవి.. కానీ ప్రస్తుతం రోజులు మారాయి. ప్రొఫెషనల్స్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇంటి నుంచే ఆఫీసు విధుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఉన్న ఖాళీ ప్రదేశాలను అందంగా ఆఫీసులాగా తీర్చిదిద్దుకునే



అవకాశం ఉంది. ఆఫీసు ప్రపోజల్స్, డ్రాయింగ్స్, ఇతర ఫైల్స్ ఉంచుకోవటం, ప్రత్యేక కంప్యూటర్ ఏర్పాటు చేసుకోవటం వంటివి ఆఫీసు స్పేస్ వినియోగానికి తప్పని సరి. కుటుంబ సభ్యులకు ఇబ్బంది లేకుండా ఒక్కోసారి రాత్రివేళల్లో కూడా పనిచేసుకునే వెసులుబాటు ఇక్కడ ఉండాలి. వర్క్ స్పేస్, స్టడీ ఏరియాలో చెక్కఫ్లోరింగ్ ఉండాలి. ఇలా చేస్తే చప్పుడు ఎక్కువగా వినిపించదు. దీనిపై కార్పెట్ వాడటం వల్ల ధ్వనులను కొంతవరకు నిరోధించవచ్చు. కొన్ని సందర్భాల్లో పనిచేసే చోటే కొంచె విశ్రాంతి తీసుకోవాలనుకుంటే నిద్రపోవడానికి కొంచెం స్థలం ఏర్పాటు చేసుకోవాలి. ఇలా ఉంటే బాగా అలసిపోయినప్పుడు పదినిమిషాలు విశ్రాంతి తీసుకొని మళ్లీ పని చేసుకోవచ్చు. వర్క్‌స్పేస్‌లోనే చిన్న చిన్న షెల్ఫ్‌లు, ర్యాక్‌లు ఏర్పాటు చేసుకోవటం వల్ల ఎక్కువ పుస్తకాలు ఒకేచోట పెట్టకుండా ఉంటుంది. చదువుకోవడానికి వాడే వర్క్ స్పేస్‌లో గోడమొత్తం ఒక పెయింటింగ్ గానీ స్టిక్కరింగ్ గానీ ఉంటే స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. మన వృత్తికి సంబంధించిన జ్ఞాపికలు, బొమ్మలు వంటివి అక్కడ ఉంచడం వల్ల మోటివేటివ్ స్పిరిట్ కలిగే అవకాశం ఉంటుంది.

సోఫాసీనులు కండి..!



ఇళ్లలో లివింగ్ రూం ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. మన కుటుంబ సభ్యులు మొత్తం కలిసి మాట్లాడుకోవడానికి వేదిక లివింగ్ రూం. ఎవరైనాబంధువులు, మిత్రులు వచ్చినప్పుడు వారితో లివింగ్ రూంలోనే కాలక్షేపం చేస్తాం. మన ఖాళీ సమయాన్ని టీవీ చూస్తూనో, మరేదైనా వ్యాపకంతోనో లివింగ్ రూంలోనే గడుపుతాం. అందుకే ఈ గది ఎంత అందంగా.. ఆకర్షణీయంగా ఉంటే మన మూడ్ అంత బాగుంటుంది. లివింగ్ రూంలో ముఖ్యమైన ఫర్నిచర్ సోఫాసెట్లు. ఇప్పుడివి చాలా వెరైటీల్లో మార్కెట్లో దొరుకుతున్నాయి. మన గోడలు గాఢమైన రంగులతోఉంటే ఫర్నిచర్ తేలిక రంగులో ఉండాలి. గోడలు తెల్లగా ఉంటే సోఫా సెట్లు మంచి రంగుల్లో ఉన్నవి తీసుకోవాలి. లివింగ్ రూం కోసం మల్టీపర్పస్ ఛైర్‌లు, సోఫాలను ఎంపిక చేసుకోవాలి. సింగిల్ సీటర్స్‌ని కూడా పెట్టుకొంటే అందంగా ఉంటుంది. ముదురు రంగుల్లో ఉండే కౌచ్‌లు గదిని అత్యంత ఆకర్షణీయంగా మారుస్తాయి. సృజనాత్మకంగా తీర్చిదిద్దిన బెడ్ కమ్ సోఫాసెట్లను కూడా తయారు చేసుకోవచ్చు.



మొక్కలతో ఆహ్లాదం

ఇంటిని సుందరంగా తీర్చిదిద్దుకోవడమే కాదు ఆహ్లాద వాతావరణాన్ని పెంపొందించుకోవడం కూడా ఇప్పుడు సరికొత్త ఒరవడి. ఖాళీ స్థలం ఉంటే చాలు అందమైన మొక్కలను లేదా పండ్లనిచ్చేవి పెంచుతున్నారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో కూడా మొక్కలను సమకూర్చుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. దీనివల్ల విదేశాల్లో కనిపించేవీ ఇక్కడ ప్రత్యక్షమవుతున్నాయి. డ్రాగన్ ఫ్రూట్, మైసూర్ రస్‌బెర్రి, గాయ్‌లార్డియా, నిమేషియా కార్నివాల్ వంటివన్నమాట. ఇక బోన్సాయ్ రకానికి చెందిన పండ్లచెట్లను కూడా తక్కువ స్థలం, ఎత్తులోనే పెంచుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. దానిమ్మ, నారింజ, జామ, మామిడి వంటివి ఈ కోవలోకి వస్తాయి. ఎక్కువ స్థలాన్ని వినియోగించుకునే అవసరం కూడా రాదు. నిర్వహణలోనే కాస్త అప్రమత్తతతో ఉంటే చాలని సూచిస్తున్నారు.


ఇల్లు చాలడం లేదా!



ఇల్లు విశాలంగా ఉంటే ఎలాగైనా సర్దుకోవచ్చు. అలంకరించుకోవచ్చు. ఎటొచ్చీ తక్కువ విస్తీర్ణంలో ఉండేవాటితోనే సమస్య. అసలే చిన్నగా ఉండే గదుల్లో సామగ్రితో నింపేస్తే మరింత ఇరుకుగా కన్పిస్తాయి. కొందరి నివాసాలు చూస్తే చిన్నవే. అన్ని రకాల వస్తువులు ఉన్నా ఇరుకనే భావన కల్గదు. కొద్దిపాటి మార్పులతో మీ సొంతింటిని కూడా అలాగే తీర్చిదిద్దుకునే అవకాశం ఉంది. నగరంలో షాపింగ్ చేసే అలవాటు ఎక్కువ. అవసరంతోపాటు నచ్చిన వస్తువులను కొనేస్తుంటారు. ఆ సమయంలో ఇంట్లో చోటు లేదనే విషయమే గుర్తుకురాదు. మరి వీటన్నింటితో ఇల్లు నిండిపోతే.. మనుషులు తిరగడానికి చోటెక్కడుంటుంది? ఇందుకోసం ఇంటీరియర్ డిజైనర్లు ఏం సూచిస్తున్నారంటే.. హాలులో ఇదివరకు ఎక్కువగా దివాన్ సెట్స్ కన్పిస్తుండేవి. స్థలాభావంతో వీటి స్థానంలో బహుళ ఉపయోగకరంగా ఉండే ఫర్నిచర్ వచ్చింది. సోఫా, దివాన్ రెండింటి అవసరాలు తీరుస్తున్నాయివి. ఇక్కడ వేసే బెడ్ కింది భాగంలో అల్మారాల ఏర్పాటుతో బెడ్‌షీట్‌లు, పాదరక్షలు, ఇతరత్రా వస్తువులను వేర్వేరు అరలలో దాచుకోవచ్చు. పడక గదుల తలుపుల వెనక స్థలం సద్వినియోగానికి పలు మార్గాలు ఉన్నాయి. హ్యాంగర్ ఏర్పాటుతో వాటికి బెల్ట్‌లు, టై, టోపీలు, దుస్తులను తగిలించుకోవచ్చు. ఖాళీగా ఉన్న గోడలను చెక్కతో చేసిన క్యాబ్స్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆ స్థలాన్ని కూడా వినియోగించుకోవచ్చు. లోపలి వైపు నుంచి గోడ కన్పిస్తూ ఉంటుంది కాబట్టి గది అందం చెడకుండా ఉంటుంది. పాత ఇళ్లలో అన్ని గదుల్లో సామగ్రి భద్రపర్చేందుకు స్లాబులు నిర్మించేవారు. వీటితోనే గది ఇరుకుగా అన్పిస్తుంది. పైగా వాటిపై వస్తువులు పెడితే గది మరింత చిన్నగా కన్పిస్తుంది. కొంచెం ఖర్చు అయినా కప్‌బోర్డ్‌లు చేయిస్తే.. వస్తువులు బయటకు కన్పించవు కాబట్టి గది శుభ్రంగా, విశాలంగా కన్పిస్తుంది. గది మూలల్లో, గోడ వెంట అల్మారాలు అడ్డంగా ఆక్రమించేలా కాకుండా నిలువుగా ఉండే వాటిని చేయించుకోవాలి. దీంతో ఎక్కువ వస్తువులను వాటిలో సర్దేయవచ్చు. మూలకో, ఎక్కడో ఒక పక్కనే అల్మారా ఉంటుంది కాబట్టి గది విశాలంగా అన్పిస్తుంది.


కోహ్లీ కొత్త ఇన్నింగ్స్

ఉబర్ బ్రాండ్ అంబాసిడర్‌గా టీమిండియా కెప్టెన్



న్యూఢిల్లీ : టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో ప్రముఖ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యాడు. ప్రముఖ క్యాబ్ ఆపరేటర్ ఉబర్ సంస్థ కోహ్లీని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఉబర్ సంస్థతో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నానని కోహ్లీ ట్విట్టర్లో ప్రకటించాడు. భారత్‌లో క్యాబ్ ఆపరేటర్ల వ్యాపారంలో టాప్ ప్లేస్‌లో ఉన్న ఉబెర్ సంస్థ కోహ్లీతో కుదుర్చుకున్న ఒప్పందంతో మరింత ఉత్సాహంతో ఉంది. భారీ పెట్టుబడులతో వ్యాపారాన్ని విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. శ్రీలంకలో జరుగుతున్న టి20 ట్రై సిరీస్‌కు దూరంగా ఉన్న కోహ్లీ ఇప్పటికే పలు అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాడు. ఈ వారంలో కోహ్లీ కుదుర్చుకున్న రెండో ఒప్పందం ఇది. ఇటీవల లూమినస్ పవర్ టెక్నాలజీస్ బ్యాటరీ సంస్థ కోహ్లీని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ప్రపంచంలోని టాప్ టెన్ బ్రాండ్ అంబాసిడర్ల లిస్ట్‌లో ఉన్న కోహ్లీ కోసం చాలా కంపెనీలు క్యూ కడతాయి. బ్రాండ్ వాల్యూలో కోహ్లీ పోర్బ్స్ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు.

గోరఖ్‌పూర్ ఓటర్ల లిస్ట్‌లో కోహ్లీ!



టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీపేరు ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ నియోజకవ ర్గంలోని ఓటర్ల లిస్ట్‌లో ప్రత్యక్షమైంది. ఢిల్లీ వాడైన కోహ్లీ పేరు గోరఖ్‌పూర్ నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో ఉండటంతో షాక్ తిన్న బూత్ లెవెల్ ఆఫీసర్ ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో యూపీ ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. ఈనెల 11న యూపీలోని ఖోరఖ్‌పూర్, ఫుల్పూర్ లోక్‌సభ స్థానాలకు ఉపఎన్నికలు జరుగుతున్నాయి. సీఎం యోగి, ఉపముఖ్యమంత్రి మౌర్య తమ లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో జరుగుతున్న ఈ ఎన్నికల ఫలితాలు మార్చి 14న వెలువడతాయి.

మరొకరితో నన్ను పోల్చద్దు

ఆల్‌రౌండర్ విజయశంకర్



కొలంబో: శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు టీ20 ట్రై సిరీస్‌లో మెరుపులా మెరిశాడు ఆల్‌రౌం డర్ విజయశంకర్. ఈ సిరీస్‌కు సెలెక్టయిన జట్టులో చోటు దక్కటంతోనే సంతోషంతో ఎగిరి గంతేసిన విజయ్‌శంకర్ శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్‌లో వికెట్లు పడగొట్టలేకపోయినా రెండో మ్యాచ్‌లో తన సత్తా చూపెట్టాడు. కసిగా బంతులేసి పొదుపుగా పరుగులిచ్చి టీమిం డియా విజయంలో ముఖ్య పాత్ర పోషించాడు. ఆడిన రెండో మ్యాచ్‌లోనే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలు చుకుని అరుదైన ఘనతను సొంతంచేసు కున్నాడు. అయితే రెగ్యులర్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాకు విజయశంకర్ ప్రత్యామ్నాయమంటూ క్రికెట్ విశ్లేషకులు చేస్తున్న వ్యాఖ్యానాలను విజయశంకర్ తిరస్కరించాడు. హార్దిక్‌తో తనకు పోలిక వద్దని అన్నాడు. 'చాలా మందికి మరొకరితో పోల్చు కోవటం ఇష్టముండదు, వేరేవాళ్లతో పోల్చుకుంటే వత్తిడికి గురయ్యే అకాశముంది, మన ఆటతీరు దెబ్బతినే ప్రమాదమూ ఉంది' అని విజయ్ శంకర్ పేర్కొన్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో చక్కటి లైన్‌అండ్ లెంగ్త్‌తో బంతులేసిన విజయశంకర్‌కు తొలి వికెట్ కాస్త ఆలస్యంగానే దక్కింది. వేసిన తొలి ఓవర్లో ఓ క్యాచ్‌ను వాషింగ్టన్ సుందర్ ఒదిలేయగా, ఆ తర్వాత మరో క్యాచ్‌ను రైనా ఒదిలేశాడు. ఇదేమీ తనను నిరుత్సాహ పరచలేదని, ఆటగాళ్లు అనుకోకుండా క్యాచ్‌లు వదిలేయటం సహజ మని అన్నాడు. తానెలాంటి ఒత్తిడికీ గురికాలేదన్నాడు. వికెట్ల తీయటంపై తాను దృష్టిపెట్టలేదని ఎలా బౌలింగ్ చేయాలన్న దానిపైనే శ్రద్ధపెట్టానని అన్నాడు.





జట్ల వివరాలు

శ్రీలంక : దినేశ్ చండిమాల్ (కెప్టెన్), సురంగ లక్మల్, ఉపుల్ తరంగ, ధనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, దసున్ షణక, కుశాల్ పెరీరా, తిసారా పెరీరా, జీవన్ మెండిస్, ఇసురా ఉదనా, అకిల ధనంజయ, అమిల అపోన్సో, నువాన్ ప్రదీప్, చమీరా, ధనంజయ డి సిల్వా.

బంగ్లాదేశ్: మహ్మదుల్లా (కెప్టెన్), తమిమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ఇమ్రుల్ కయాస్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, షబ్బీర్ రెహ్మాన్, రుబెల్ హుస్సేన్, తస్కిన్ అహ్మద్, అబు హైదర్, అబు జయేద్, అరిఫుల్ హక్, నజిముల్ ఇస్లాం, నూరుల్ హసన్, మెహిదీ హసన్, లింటన్ దాస్.

బంగ్లాదేశ్‌తో నేడు టీ20కి ఫైట్

ఆధిపత్యం కోసం లంక ఆరాటం

కొలంబో : భారత్‌పై సాధించిన విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న శ్రీలంక జట్టు నిదహాస్ కప్ ముక్కోణపు టి20 సిరీస్ రెండో మ్యాచ్‌ను ఇవాళ బంగ్లాదేశ్‌తో ఆడు తుంది. ఇటీవల బంగ్లా దేశ్‌లో పర్యటించిన శ్రీలంక జట్టు టెస్టులు, టి20ల్లో పూర్తి ఆధిక్యత కనబరిచింది. దీంతో పాటు జింబాబ్వే కూడా ఆడిన ముక్కోణపు సిరీస్‌లోనూ శ్రీలం కదే పై చేయి అయింది. ఇక శనివారం జరిగే మ్యాచ్‌లోనూ అదే ఆటతీరును ప్రదర్శించేం దుకు శ్రీలంక రెడీ అయింది. భారత్ విసిరిన 175 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించి తొలి మ్యాచ్‌లో బోణీ కొట్టిన శ్రీలంక ఈ మ్యాచ్‌లోనూ భారీ స్కోరునే నమ్ముకుంది. ముఖ్యంగా కుశాల్ పెరీరా ఈ మ్యాచ్‌లోనూ సత్తా చూపెడతాడం టోంది. ఓపెనర్లతో పాటు మిగతా బ్యాట్స్‌మెన్ కూడా రాణిస్తే భారీ స్కోరు చేయటం కష్టమేమీ కాదని, బంగ్లాను ఓడించ గలమని ఆత్మవిశ్వాసంతో చెబుతోంది. ఇక భారత్ చేతిలో ఓటమి పాలైన బంగ్లాదేశ్ జట్టు ఆటగాళ్లు ఒత్తిడితో ఉన్నారు. భారీ స్కోర్లు సాధించలేక సతమతమవుతున్నారు. కెప్టెన్ షకిబ్ అల్ హసన్ లేకపోవటం ఆ జట్టుకు పెద్ద లోపంగా కనిపిస్తోంది. ఇంకా పరుగులు చేయాల్సి ఉంద ని, బౌలింగ్ కూడా మెరుగు పరచు కోవాలని తాత్కాలిక కెప్టెన్ మహ్మదుల్లా చెబుతున్నాడు.

సాయంత్రం 7 గంటల నుంచి డి స్పోర్ట్స్ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం



రోహిత్‌శర్మపై విమర్శల వెల్లువ



కొలంబో : శ్రీలంక ట్రై సిరీస్‌లో ఆడుతున్న భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మపై అభిమానులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేసున్నారు. తొలి మ్యాచ్‌లో లంకపై డకౌట్ అయిన రోహిత్ బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో 17 రన్స్ మాత్రమే చేశాడు. దీంతో రోహిత్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. బీసీసీఐ కొత్త కాంట్రాక్టు జాబితాలో ఏ ప్లస్ గ్రేడ్ దక్కించుకున్న రోహిత్ జీతం పెరిగిన ఉద్యోగిలా ఆడుతున్నావంటూ ఓ అభిమాని ట్వీట్ చేశాడు. ఇక మిగతా ఆటాగాళ్లకు అవకాశమిద్దామని రోహిత్ త్వరగా ఔటవుతున్నాడని మరో అభిమాని వ్యంగ్యంగా ట్వీట్‌చేశాడు. వరుసగా డకౌట్ అవుతూ శ్రీలంక మ్యాచ్‌లో రికార్డును మూటగట్టుకున్న రోహిత్ బంగ్లాదేశ్‌పై డబుల్ డిజిట్‌ను దాటాడు. అయితే 2018లో ఆడిన 18 ఇన్నింగ్స్‌లో 40 పరుగులు దాటలేదని రోహిత్ ఆటతీరును ఓ అభిమాని విశ్లేషించాడు.

షమీపై ఎఫ్ఐఆర్..

రోజుకో సంచలన ఆరోపణ చేస్తున్న భార్య హసీన్ జహాన్



కోల్‌కతా :టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమీ క్రికెట్ కెరీర్ ప్రమాదంలో పడింది. ఇప్పటికే జట్టు కాంట్రాక్టుకు దూరమైన షమీపై కోల్‌కతా పోలీస్ స్టేషన్లో గృహహింస కేసు నమోదైంది. పలువురు మహిళలతో షమీకి సంబంధాలున్నాయని, పలువురు కుటుంబ సభ్యులతో కలసి తనను వేధిస్తున్నారని కోల్‌కతా పోలీసులకు షమీ భార్య హసీన్ జహాన్ ఫిర్యాదు చేసింది. దీంతో సమీపై మరో నలుగురిపై కోల్‌కతా పోలీసులు కేసులు పెట్టారు. ఐపీసీ 498ఏ, 323, 307, 376, పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇందులో కొన్ని కేసులు నాన్ బెయిల బుల్ కేసులు కాగా, మరికొన్ని కేసుల్లో పదేళ్ల వరకూ శిక్ష పడే అవకాశం ఉంది. ఐపీఎల్ జట్టు ఢిల్లీ డేర్‌డెవిల్స్ గిఫ్ట్‌గా ఇచ్చిన ఫోన్‌లో షమీ ఇతర మహిళలతో జరిపిన అసభ్యకర సంభాషణల వివరాలను ఫోటోలను భార్య జహాన్ పోస్ట్ చేయడంతో సంచలనమైంది. 2014లో ప్రేమించి పెళ్లి చేసుకున్న తనను అనేక రకాలుగా హింసించాడని, చంపేందుకు కుట్ర పన్నాడని జహాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక తాజాగా మరికొన్ని ఆరోపణలు కూడా చేశారు. తనను చంపి అడవిలో పాతిపెట్టమని సోదరుడికి చెప్పాడని హసీన్ వెల్లడించింది. తాజా ఆరోపణలతో షమీ క్రికెట్ కెరీర్ ప్రమాదంలో పడింది. ఈ కేసులన్నీ తేలేదాకా షమీని భారత జట్టుకు ఎంపికయ్యే అవకాశం లేదు. తాజాగా ఫేస్‌బుక్‌పై జహాన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భర్త నుంచి ఎన్నో వేధింపులు ఎదుర్కొన్న తనకు అండగా నిలిచేందుకు ఏ ఒక్కరు కూడా ముందుకు రాలేదని, తన బాధను ఫేస్‌బుక్ ద్వారా పంచుకున్నానని జహాన్ పేర్కొన్నారు. తనకు ఎటువంటి సమాచారం లేకుండా తన ఫేస్‌బుక్ ఖాతాను ఎలా బ్లాక్ చేస్తారని, తన ఫోస్టులు, ఫొటోలను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు.






ప్యాంగ్‌చాంగ్ : దక్షిణకొరియా నగరం ప్యాంగ్‌చాంగ్‌లో 12వ ప్యారా ఒలింపిక్స్ ఘనంగా మొదలయ్యాయి. ఆదేశ అధ్యక్షుడు మూన్ జె ఇన్ ఈ పోటీలను ప్రారంభించారు.

భారత్‌కు ఐర్లండ్ షాక్

ఇఫో(మలేసియా) : అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో ఐర్లండ్ జట్టు భారత్‌కు షాకించింది. చివరి లీగ్ మ్యాచ్‌లో 3–2 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించి ఈ టోర్నీలో తొలి విజ యాన్ని నమోదు చేసుకుంది. ఇక ఐర్లండ్ చేతిలో భారత్‌కు ఇది తొలి పరాజయం. ఈ టోర్నీలో మూడో ఓటమితో భారత జట్టు పతకం ఆశలు ఆవిరయ్యాయి. ఐదు, ఆరు స్థానాల కోసం జరిగే మ్యాచ్‌లో భారత్ ఐర్లండ్‌తోనే పోటీపడాల్సి ఉంది. పతకం రేస్‌లో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో భారత్‌కు ఐర్లండ్ నుంచి అనూ హ్యంగా ప్రతిఘటన ఎదురైంది. ఫస్ట్ క్వార్టర్‌లో రమణ్‌దీప్ సింగ్ చేసిన గోల్‌తో 10వ నిమిషంలో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అమిత్ రోహిదాస్ 26వ నిమిషంలో గోల్ చేసి భారత్ ఆధిక్యతను 2–0కు పెంచాడు. అయితే ఆ తర్వాత దూకుడు పెంచిన ఐర్లండ్‌కు షేన్ ఓడెంగో చేసిన గోల్‌తో ఉత్సాహం రెట్టింపయింది. సెంకడ్ హాఫ్ ముగిసే సరికి భారత్ 2–1 ఆధిక్యంతో ఉన్నప్పటికీ ఆ తర్వాత ఐర్లాండ్ భారత శిబిరంపై దాడులు పెంచుతూ ఒత్తిడి పెంచింది. సీన్ ముర్రే 36వ నిమిషంలో గోల్ చేసి స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత లీ కోల్ 42వ నిమిషంలో గోల్ చేయడంతో ఐర్లండ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆట చివర్లో భారత ఆటగాళ్లు ప్రతిదాడి చేసినా గోల్స్ చేయ టంలో విఫలమవడంతో ఐర్లండ్ విజయం సాధించింది. మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో 5–1 గోల్స్‌తో భారీ విజయం సాధించిన భారత్ ఐర్లండ్‌నూ చిత్తుగా ఓడించాలన్న అంచనాలు తల్లకిందులయ్యాయి.

తల్లి అయ్యాక తొలి విజయం



ఇండియానా వెల్స్ : మాతృత్వపు అనుభూతిని ఆనందిస్తూ ఏడాడిన్నర విరామం తర్వాత మళ్లీ టెన్నిస్ మైదా నంలో అడుగుపెట్టిన ప్రపంచ మాజీ నంబర్‌వన్, అమెరికన్ స్టార్ సెరెనా విలి యమ్స్ తొలి విజయం సాధించింది. ఇండియానా వేల్స్‌లో జరుగుతున్న డబ్ల్యుటిఏ ఈవెంట్‌లో పాల్గొన్న సెరెనా తొలి రౌండ్‌లో 7–5, 6–3 తేడాతో కజకిస్తాన్ క్రీడాకారిణి జరీనా దియాస్‌ను ఓడించింది. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచిన సెరెనా గర్భం దాల్చడంతో టెన్నిస్‌కు దూర మైంది. సెప్టెంబర్‌లో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన సెరెనా చావుబతుకుల మధ్య కొట్టుమి ట్టాడింది. ప్రియుడు అలెక్సిస్‌ను పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత 2017 చివర్లో తొలి సారిగా మైదానంలో అడుగుపెట్టిన సెరెనా ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఓడిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో డేవిస్ కప్ పోటీల్లో అక్క వీనస్‌తో కలసిడబుల్స్ ఆడినా ఓటమి పాలైంది. అయినా అలుపెరగని సాధనతో ఇండి యానా వెల్స్ టోర్నీలో అడుగుపెట్టి తొలి విజయం సాధించింది. టోర్నీలో అడుగుపెట్టిన సెరెనాకు ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో స్వాగతం పలికారు. దీంతో సెరెనా ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి.

అవినీతి ప్రక్షాళలో ఇది తొలి అడుగు

వివేక్, శేష్‌నారాయణ తొలగింపుపై మాజీ సభ్యుల స్పందన

హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పదవుల నుంచి అధ్యక్షుడు వివేక్, కార్యదర్శి శేష్ నారాయణ్‌లను తొలగించటంపై పలు క్రీడా సంఘాల ప్రతినిధులు స్పందించారు. రెండు పదవులు అనుభవిస్తున్నందున హెచ్‌సిఏలో అధ్యక్ష, కార్యదర్శి పదవుల్లో ఉన్న వివేక్, శేష్ నారాయణలను తొలగిస్తూ అంబుడ్స్‌మెన్ నరసింహారెడ్డి గురువారం సంచలన తీర్పు చెప్పారు. ఈ రెండు పదవులకు ఎన్నికలు నిర్వహించాలని తీర్పు చెప్పాలని తన తీర్పులో వెల్లడించారు. అంబుడ్స్‌మెన్ తీర్పుతో హెచ్‌సిఏలో అవినీతి ఉందని రుజువైందని, అవినీతి ప్రక్షాళనలో తొలి అడుగుపడిందని హెచ్‌సిఏ మాజీ సభ్యుడు బాబూరావు నాయుడు అన్నారు. వివేక్ అడ్డగోలుగా తన ప్రయోజనాల కోసం స్టేడియంను వాడుకుంటున్నారని, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గురువారెడ్డి తెలిపారు. లోథా కమిటీ సిఫారసులు హెచ్‌సిఏలో అమలు కావటం లేదని అన్నారు. ఈ విషయాన్ని ఎప్పటి నుంచో తాను చెబుతూ వచ్చానని బాబూరావు నాయుడు అన్నారు. వివేక్‌కు వ్యతిరేకంగా బాబూరావు కూడా పిటిషన్ దాఖలు చేసిన వారిలోఉన్నారు.



క్రీడారంగంలోనూ హైదరాబాద్ ఓ హబ్ అయింది. గతంలో ఎప్పుడో తప్ప అంతర్జాతీయ క్రీడల్లో వినిపించని హైదరాబాద్ పేరు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మారుమోగుతోంది. ఎంతో మంది ఒలింపియన్లు, క్రికెటర్లను అందించిన ఈ మహానగరం ఇప్పుడు ఎన్నో క్రీడలకూ పుట్టినిల్లయింది. బ్యాడ్మింటన్‌లో సైనా, సింధులకు పోటీగా చాలా మంది యవ క్రీడాకారులు హైదరాబాద్ కీర్తిని దశదిశలా చాటుతున్నారు. తాజాగా జిమ్నాస్టిక్స్‌లో **అరుణారెడ్డి** పేరు ఇప్పుడు మారుమోగుతోంది.

అరుణ తార

హైదరాబాద్ : తెలుగమ్మాయి అరుణారెడ్డి సృష్టించిన చరిత్ర అంతా ఇంతా కాదు. కనీసం సౌకర్యాలు కూడా సరిగా లేని క్రీడలో పాల్గొని ప్రపంచ స్థాయి పోటీల్లో జాతీయ జట్టుకు ఎంపికై కాంస్య పతకం గెలుచుకుని భారత క్రీడారంగంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించింది. అగ్రదేశాలకే పరిమితమైపోయిందుకున్న జిమ్నాస్టిక్స్ క్రీడలో మెరుపుతీగలా మెరిసింది. రియో ఒలింపిక్స్‌లో రికార్డులు తిరగరాసిన దీపాకర్మార్‌కు ధీటుగా భారత్‌కు భవిష్యత్‌లో పతకాలు గెలిచిపెట్టే భారాన్ని మోస్తోంది. వచ్చే నెల్లో జరిగే కామన్‌వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడల కోసం ప్రస్తుతం ఢిల్లీలో శిక్షణ పొంతున్న అరుణారెడ్డితో 'మనం' ప్రత్యేకంగా మాట్లాడింది.

ఒలింపిక్ పతకమే లక్ష్యం

మెల్‌బోర్న్ ప్రపంచ కప్ పోటీలతో ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని, పతకం గెలవడంతో పాటు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల ఆటతీరును, మెళకువలను నేర్చుకున్నానని ఈ అనుభవం ఒలింపిక్స్‌లో పతకం గెలుచుకునేందుకు ఉపయోగపడుతుందని అరుణ చెబుతోంది. మెల్‌బోర్న్ పోటీల్లో కొద్దిలో రజత పతకం మిస్సయినప్పటికీ నిరాశచెందలేద ని వివరించింది. 2020లో జరిగే ఒలింపిక్స్‌లో పతకమేలక్ష్యంగా తన సాధన సాగుతోందని, వచ్చే నెలలో జరిగే కామన్‌వెల్త్, ఆసియా క్రీడల్లో పతకాలు అందించటం ఖాయమని తెలిపింది. అందుకోసం ఢిల్లీలో శిక్షణ పొందుతున్నానని వివరించింది.

తండ్రికే అంకితం

మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ కప్ జిమ్నాస్టిక్స్ పోటీల్లో సాధించిన పతకం తన తండ్రి నారాయణరెడ్డికి అంకితమని అరుణ తెలిపింది. తాను గొప్ప జిమ్నాస్ట్ కావాలన్న తండ్రి ఆకాంక్ష మేరకు కఠోర శ్రమ చేశానని ఆ కృషికి ఫలితం దక్కిందని చెప్పింది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరవలేనిది

2010లో అకస్మాత్తుగా తండ్రి నారాయణరెడ్డి మరణించటం తననెంతో కుంగదీసిందని అరుణ తెలిపింది. అయితే కుటుం సభ్యులు తనను ఎంతో ప్రోత్సహించారని, అంతర్జాతీయంగా తానీ స్థాయికి ఎదగటానికి తల్లి సుభద్ర, అక్క పావనిరెడ్డి , మిగతా కుటుంబ సభ్యుల ప్రోత్సాహమే కారణమంది.

కోచ్‌కు రుణపడి ఉంటా

అంతర్జాతీయ జిమ్నాస్ట్‌గా తానీ స్థాయికి ఎదగటానికి కోచ్ బ్రిజ్ కిశోరే కారణమని వివరించింది. చిన్నతనంలోనే తనలో నైపుణ్యాన్ని గుర్తించిన బ్రిజ్‌కిశోర్‌కు ఎంతో రుణపడి ఉంటానంటున్న అరుణ హైదరాబాలోనూ అద్భుతమైన కోచ్‌లు ఉన్నారని సౌకర్యాలు మెరుగుపరిస్తే మరింత మంది మెరికల్లాంటి ప్లేయర్లను తయారు చేయచ్చని చెబుతోంది.

ఒక్కపతకం దశ మార్చేసింది

మెల్‌బోర్న్ పోటీల్లో పతకంతో అరుణ చరిత్ర మారిపోయింది. 2014 జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీల్లో పతకం గెలుచుకుని అందరి దృష్టినీ ఆకర్షించిన ఆ తర్వాత ఉజ్బెకిస్తాన్‌లో రెండేళ్ల పాటు శిక్షణ తీసుకుని రాటుదేలింది. ఆ తర్వాత ఒక్కో మెట్టూ ఎదుగుతూ జాతీయ జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకుంది. ప్రభుత్వ ప్రోత్సాహం మరువలేనిదని అరుణ తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. అరుణ సాధించిన విజయానికి కానుకగా తెలంగాణ ప్రభుత్వం రెండు కోట్ల రూపాయల నజరానా ప్రకటించింది. అన్ని క్రీడలకూ గుర్తింపు ఇలాంటి ప్రోత్సహకాలతోనే వస్తుందని అరుణ తెలిపింది.

అరుణ కొత్త చరిత్ర సృష్టిస్తుంది : దీపాకర్మాకర్

ఇక అరుణ భారత జిమ్నాస్టిక్స్‌లో కొత్త చరిత్ర సృష్టించటం ఖాయమని రియో ఒలింపిక్ స్టార్ దీపా కర్మాకర్ అభినందించింది. మెల్‌బోర్న్ ప్రపంచ కప్ పోటీల్లో అరుణ పతకం సాధించటం ఖాయమని ముందే చెప్పానంటున్న కర్మాకర్ మరింత ప్రోత్సాహం, శిక్షణ ఉంటే అరుణ రాటు దేలుతుందని చెప్పింది.

ఆల్‌ది బెస్ట్

జిమ్నాస్టిక్స్‌లో మెరుపుతీగ అరుణ మరిన్ని విజయాలు సాధించాలని, హైదరాబాద్ కీర్తితో పాటు త్రివర్ణ పతాక రెపరెపలాడేలా పతకాలు గెలుచుకోవాలని అభిమానులకు కోరుకుంటున్నారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.